Crime News

# ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక



సంపుటి : 19,సంచిక : 194, బుధవారం 11 - 03 - 2026 పేజిలు : 12

## గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి

- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- రాబోయే మూడేళ్లలో శాశ్వత భవనాలు లేని అన్ని గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.
- వివిధ శాఖల అధికారులు, మంత్రులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం
- 'తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలి
- తెలంగాణ పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని
- ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారానే జరగాలి' అని భట్టి విక్రమార్క వెల్లడించారు



రాబోయే మూడేళ్లలో శాశ్వత భవనాలు లేని అన్ని గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.వివిధ శాఖల అధికారులు, మంత్రులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై, హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి నిధుల మంజూరుపై సమీక్షించారు.'తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కల్పించే కోర్సులు ప్రవేశపెట్టాలి. గ్లోబల్ సమ్మిట్‌లో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలతో ఏటీసీ కోర్సులు ప్రారంభిస్తాము. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారానే జరగాలి' అని భట్టి విక్రమార్క - మిగతా 2 లో

## నీళ్లివ్వమని అడిగిన రైతులను జైల్లో పెట్టడం ఏమిటి


2 లో

- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- రంగనాయక్ సాగర్ పనులు వెంటనే పూర్తి చేయాలని బండి సంజయ్ డిమాండ్
- పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని విమర్శ
- పనులు పూర్తయి ఉంటే 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని వ్యాఖ్య


2 లో

## నన్ను ఒక ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారు

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడ్డ తనను అరెస్ట్ చేశారన్న కవిత
- అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడంపై ఆగ్రహం
- ఇళ్లను కూల్చివేసిన చోటే కొత్త ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్

## వంటగ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

- వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష
- 10 శాతం మేర ఉత్పత్తి పెంచాలని ఇంధన ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు
- భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయన్న కేంద్రం
- దేశానికి 70 శాతం ఉత్పత్తులు ఇతర మార్గాల్లో వస్తున్నాయన్న కేంద్రం



వంటగ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వంటగ్యాస్‌ను బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో 10 శాతం మేర ఉత్పత్తిని పెంచాలని ఇంధన ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఇంధన ఉత్పత్తిపై ఆందోళనలు రేకెత్తుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక భేటీ నిర్వహించారు.విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హార్దీప్ సింగ్ పూరితో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. ఎల్పీజీ నిల్వలు, సరఫరాపై సమీక్ష జరిపారు.కాగా ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కేంద్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. కమర్షియల్ - మిగతా 2 లో


2 లో

## దుబాయ్‌లో యుద్ధ భయం

- ఎడారిలో మూగజీవాల ఆక్రందన
- క్షిపణి దాడుల భయంతో దుబాయ్ వీడుతున్న ప్రవాసులు
- పెంపుడు జంతువులను తీసుకెళ్లలేక స్తంభాలకు కట్టేసి పోతున్న వైనం
- ఒమన్ సరిహద్దుల్లో పెంపుడు జంతువులకు నో ఎంట్రీ

## బ్యాంకు ఖాతాల్లో మినిమం బ్యాలెన్స్ లేకపోవడంతో మూడేళ్లలో రూ.11,000 కోట్లు వసూలు


2 లో

- కనీస నిల్వలు లేనందుకు ప్రైవేటు రంగ బ్యాంకులు వసూలు చేసిన ఛార్జీలు రూ.11 వేల కోట్లు
- రూ.8 వేల కోట్లు వసూలు చేసిన ప్రభుత్వరంగ బ్యాంకులు
- పార్లమెంటుకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చిన నిర్మలా సీతారామన్


2 లో

## ఇకపై నాలుగు కేటగిరీలుగా గ్రామ పంచాయతీలు

- ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఏపీలో గ్రామ పంచాయతీల పునర్‌వర్గీకరణకు ప్రభుత్వ ఆమోదం
- మూడు నుంచి నాలుగుకు పెరిగిన పంచాయతీల కేటగిరీలు
- కొత్తగా 'రూర్బన్' పంచాయతీల ఏర్పాటుకు నిర్ణయం
- జనాభా, ఆదాయాన్ని బట్టి పంచాయతీల కొత్త వర్గీకరణ
- రూర్బన్ పంచాయతీల్లో పట్టణ స్థాయి సౌకర్యాల కల్పన

## జనసేన ఆవిర్భావ రాష్ట్రస్థాయి వేడుకల రద్దు



- పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ కీలక సూచనలు
- ఈ నెల 14న పిఠాపురంలో జరగాల్సిన వేడుకల రద్దు
- జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ రాష్ట్రస్థాయి వేడుకల రద్దు
- ఎండల తీవ్రత, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కీలక నిర్ణయం
- జిల్లా, నగర, మండల కేంద్రాల్లో స్థానికంగా ఘనంగా వేడుకలు నిర్వహించాలన్న పవన్

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ప్రణాళికలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నెల 14న పిఠాపురంలో భారీ ఎత్తున వేడుకలను నిర్వహించాలని జనసేన తొలుత నిర్ణయించింది. అయితే, ఆ వేడుకలను - మిగతా 2 లో

## తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా అమరావతి అభివృద్ధి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం
- రాజధానిలోని వివిధ సంస్థలకు జరపాల్సిన భూ కేటాయింపులు,మౌలిక వసతులపై ప్రధానంగా చర్చ,తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి రూ. 119 కోట్లు
- తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు కేటాయింపునకు ఆమోదం లభించింది
- పంచాయితీరాజ్ విభాగంలోని ఏపీఎస్ఐఆర్డీకి 5 ఎకరాల కేటాయించేందుకు అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది
- మొత్తంగా 167 ఎకరాల విస్తీర్ణంలో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం
- హోటళ్లు, అమ్యూజ్‌మెంట్ పార్కులను అభివృద్ధి చేయాలని తెలిపారు



తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటుతూ భావితరాలకు అందించేలా అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధానిలో సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులను చేపట్టేలా అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. క్రీడలు, పర్యాటకానికి పెద్ద పీట వేసేలా ప్రణాళికలు ఉండాలని తేల్చి చెప్పారు. పెట్టుబడులు పెట్టడానికి వచ్చే సంస్థలతో అధికారులు నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని దిశానిర్దేశం చేశారు.అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. రాజధానిలోని వివిధ సంస్థలకు జరపాల్సిన భూ కేటాయింపులు, సెక్రటేరియేట్, హెచ్వోడీ భవనాల్లో - మిగతా 2 లో

Crime News ది క్రైమ్ న్యూస్ తెలుగు దినపత్రిక

బుధవారం 11 - 03 - 2026

## ఆకర్షణతో మొదలయ్యే స్మోకింగ్

## బానిసత్వంగా మారి జీవితాన్ని అంతమొందిస్తుంది




ఈ రోజుల్లో చాలా మంది యువతలో, కొంతమంది పెద్దల్లో కూడా స్మోకింగ్ ఒక ఫ్యాషన్ లా మారుతోంది. మొదట అది కేవలం సరదాగా, స్నేహితుల ఒత్తిడితో లేదా ఆసక్తితో ప్రారంభమవుతుంది. కానీ క్రమంగా అది అలవాటుగా మారి చివరకు బానిసత్వానికి దారితీస్తుంది. స్మోకింగ్ కేవలం ఒక వ్యక్తి ఆరోగ్యాన్నే కాదు, అతని కుటుంబాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. స్మోకింగ్ చేసేవాటిలో నికోటిన్ అనే పదార్థం మనిషిని త్వరగా బానిసగా మార్చుతుంది. ఒకసారి అలవాటు పడితే దానిని వదిలేయడం చాలా మందికి కష్టంగా మారుతుంది. స్మోకింగ్ వల్ల శరీరంలోని ముఖ్యమైన అవయవాలు నెమ్మదిగా దెబ్బతింటాయి. ఊపిరితిత్తుల సమస్యలు, గుండె జబ్బులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం, శరీర శక్తి తగ్గిపోవడం ఇవే కాకుండా, పక్కన ఉన్నవారికి కూడా స్మోకింగ్ వల్ల హాని కలుగుతుంది. దీనిని పాసివ్ స్మోకింగ్ అంటారు. అంటే పొగ త్రాగని వ్యక్తులు కూడా ఆ పొగను పీల్చుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవచ్చు, స్మోకింగ్ ప్రభావం కుటుంబంపైన పడుతుంది. స్మోకింగ్ చేసే వ్యక్తి తన ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, తన కుటుంబాన్ని కూడా బాధలకు గురి చేస్తాడు. అనారోగ్యం కారణంగా కుటుంబ సభ్యులు మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. చిన్న పిల్లలు కూడా ఆ ప్రభావానికి గురవుతారు. చివరికి కుటుంబంలో ఆందోళన, కష్టాలు, నష్టాలు పెరుగుతాయి. స్మోకింగ్ ప్రారంభం కాకముందే దానిని నివారించడం అత్యంత మంచిది. స్నేహితుల ఒత్తిడికి లోబడకండి, అలాంటి స్నేహితుల సావాసానికి దూరంగా ఉండండి, స్మోకింగ్ వల్ల కలిగే నష్టాలను తెలుసుకోండి, ఆరోగ్యకరమైన అలవాట్లను పెంచుకోండి, క్రీడలు, వ్యాయామం, పుస్తకాలు వంటి మంచి పనుల్లో సమయం గడపండి జీవిత లక్ష్యాలపై దృష్టి పెట్టండి. మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంది అనే విషయాన్ని ఎప్పటికీ గుర్తుంచుకోవాలి. స్మోకింగ్ కు అలవాటు పడినవారు కొన్ని పద్ధతులు పట్టుదలతో అవలంబిస్తే ఖచ్చితంగా మారుతారు. ముందుగా మీకు మీరుగా "నేను స్మోకింగ్ మానేయాలి" అనే గట్టి నిర్ణయం తీసుకోవాలి. ఒకేసారి మానేయలేని వాళ్ళు రోజు రోజుకు క్రమం తప్పకుండా స్మోకింగ్ ను తగ్గిస్తూ పూర్తిగా మానేయవచు. స్మోకింగ్ చేయాలనిపించినప్పుడు వ్యాయామం చేయడం, నీరు త్రాగడం, ఏదైనా ఆహారం తినడం, ఇతర పనుల్లో దృష్టి పెట్టాలి. కొన్ని అలవాట్లు సావాసదోషం వలన కూడా అలవాటు అవుతాయి. స్మోకింగ్ చేయని స్నేహితులతో ఎక్కువగా గడిపితే అలవాటు తగ్గుతుంది. మొహమాటం పడకుండా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, మద్దతు తీసుకోండి. అవసరమైతే వైద్యుల సహాయం తీసుకోవాలి. చిన్న చిట్కాలు మిమ్మల్ని మార్చేస్తాయి. స్మోకింగ్ చేసే ప్రదేశాలకు దూరంగా ఉండండి ఒత్తిడి పెరిగినప్పుడు స్మోకింగ్ వైపు వెళ్లకుండా జాగ్రత్తపడండి. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోండి, ప్రతి చిన్న విజయాన్ని కూడా గుర్తించి మిమ్మల్ని, మీరు ప్రోత్సహించుకోండి. జీవితానికి చెడు అనిపించే అన్ని దురలవాట్లకు దూరంగా ఉండండి.



డాక్టర్. వై. సంజీవ కుమార్,
ఫౌండర్ & ప్రెసిడెంట్,
స్కై ఫౌండేషన్,
9393613555,
9493613555.

## జనసేన ఆవిర్భావ రాష్ట్రస్థాయి వేడుకల రద్దు

**మొదటిపేజీ తరువాయి** – రద్దు చేస్తున్నట్లు పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. ముఖ్యంగా రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత, వాతావరణ పరిస్థితులపై అందిన నివేదికలను దృష్టిలో ఉంచుకుని జనసైనికుల క్షేమం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.తొలుత పిఠాపురం వేదికగా రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాలని భావించినప్పటికీ, ప్రతికూల వాతావరణం దృష్ట్యా వ్యూహం మార్చారు. రాష్ట్ర స్థాయి భారీ బహిరంగ సభకు బదులుగా, ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా, నగర, మండల కేంద్రాల్లో ఎక్కడికక్కడ స్థానికంగానే ఘనంగా నిర్వహించాలని పవన్ కల్యాణ్ పార్టీ శ్రేణులను ఆదేశించారు. మార్చి 14 అనేది జనసైనికులకు, వీర మహిళలకు ఒక పండగలాంటి రోజని, ఆ ఉత్సాహం తగ్గకుండా స్థానిక స్థాయిలోనే కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు.పిఠాపురంలో భారీ సభ రద్దు కావడంతో ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జనసేన కార్యాలయాలు పండుగ వాతావరణానికి సిద్ధమవుతున్నాయి. నియోజకవర్గాల వారీగా పార్టీ జెండా ఆవిష్కరణలు, సేవా కార్యక్రమాలతో ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి

**మొదటిపేజీ తరువాయి** – వెల్లడించారు.'ఐటీడీఏల సహకారంతో గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి. తెలంగాణ పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలి. కవ్వాల్, శ్రీశైలం టైగర్ జోన్ల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. ప్రభుత్వం ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధిపై చర్యలు తీసుకుంటుంది.డ్రగ్స్ మహమ్మారి నివారణకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. డ్రగ్స్ దుష్ప్రభావాలపై కళారూపాల ద్వారా యువతకు అవగాహన కల్పించాలి' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

## నన్ను ఒక ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారు

**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారు. నిరాహార దీక్షకు దిగిన తనను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించ చడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పేదల కోసం గళమెత్తిన తనను ఒక ఉగ్రవాదిలా భావించి అరెస్ట్ చేశారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు.హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన కవిత, వెలుగుమట్లలో పేదలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను అధికారులు కర్కశంగా కూల్చివేసిన తీరును తప్పుబట్టారు. భూదాన్ భూములు అంటేనే పేదలకు ఇచ్చేవి అని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే ఇలాంటి దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. కూల్చివేసిన చోటే మళ్లీ ఇళ్లను నిర్మించి బాధితులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ, ఖమ్మంలో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న తీరును గమనించాలని కవిత సూచించారు. ఈ అన్యాయంపై ఆయనకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. బాధితుల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఉన్నారని, పరీక్షల సమయంలో వారిని రోడ్డున పడేయడం కలెక్టర్, జిల్లా మంత్రులకు కనిపించడం లేదా? అని ఆమె నిలదీశారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని, అవసరమైతే కోర్టులో పిల్ వేసి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## వంటగ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి** – ఎల్పీజీ వాస్తవ అవసరాలను గ్యాస్ కంపెనీలు అందుకోవాల్సిందేనని ఇంధన కంపెనీలకు స్పష్టం చేసింది.ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో కొంత సంక్షోభం వాస్తవమే కానీ పెట్రోలియం ఉత్పత్తుల ప్రస్తుతానికి ఇబ్బంది లేదని కేంద్రం తెలిపింది. పశ్చిమాసియాలో యుద్ధానికి ముందు తరహాలోనే భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. దేశానికి వచ్చే 70 శాతం ఉత్పత్తులు హోర్ముజ్ జలసంధి నుంచి కాకుండా ఇతర మార్గాల్లో వస్తున్నట్లు కేంద్రం తెలిపింది.

## తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా అమరావతి అభివృద్ధి

**మొదటిపేజీ తరువాయి** – కల్పించాల్సిన మౌలిక వసతులపై చర్చించారు. సీఆర్డీఏ నుంచి వచ్చిన వివిధ ప్రతిపాదనలను సీఆర్డీఏ అథారిటీ సమావేశం ఆమోదించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కార్యాలయ నిర్మాణానికి 80 సెంట్ల భూమి కేటాయించారు.హెచ్ఓడీ టవర్ల నిర్మాణానికి రూ.2,316 కోట్లు: తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు కేటాయింపునకు ఆమోదం లభించింది. పంచాయితీరాజ్ విభాగంలోని ఏపీఎస్ఐఆర్డీకి 5 ఎకరాల కేటాయించేందుకు అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీ సచివాలయం, హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2316 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. అందుకుగాను రూ. 119 కోట్ల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు .అధికారులకు సీఎం దిశానిర్దేశం: నీరుకొండ వద్ద చేపట్టే టూరిజం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టాలన్న సీఎం, అందుకు మొత్తంగా 167 ఎకరాల విస్తీర్ణంలో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ ప్రాజెక్టులో వాటర్ ఫ్రంట్, కల్చరల్ సెంటర్



తదితర విభాగాలు వస్తాయని, పర్యాటకంతో పాటు నిత్యం రకరకాల కార్యక్రమాలు నిర్వహించుకునే వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు. హోటళ్లు, అమ్యూజ్‌మెంట్ పార్కులను అభివృద్ధి చేయాలని తెలిపారు. భవిష్యత్తులో క్రీడా రంగం అతి పెద్ద ఆదాయ వనరు కాబోతోందన్న సీఎం, దీనికి బీసీసీఐ, ఐసీసీ సంస్థలే అతి పెద్ద ఉదాహరణ అని వివరించారు.ఒకప్పుడు నిధుల కోసం ఎదురు చూసే పరిస్థితి నుంచి ఇప్పుడు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా క్రికెట్ బోర్డులు ఎదిగాయన్నారు. ఇదే విధంగా మరికొన్ని క్రీడలు సైతం కమర్షియలుగా టర్న్ అవుతాయన్న చంద్రబాబు ఇలాంటి వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. అమరావతిలోని స్పోర్ట్స్ సిటీకి సంబంధించిన మాస్టర్ ప్లాన్ ఇదే విధంగా రూపొందించామని తెలిపారు. అమరావతిలో పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని వదులుకోకూడదని పెద్ద సంస్థలు భావిస్తుండడం కూటమి ప్రభుత్వానికి ఉన్న క్రెడిబులిటీ అని చెప్పారు.అమరావతిలో తెలుగు కల్చరల్ సెంటర్: ఓవైపు రాజధానిలో పనులను త్వరితగతిన చేపట్టేలా పర్యవేక్షణ చేస్తూనే పెట్టుబడులు పెట్టే సంస్థలతో నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిలో నిర్మించబోతున్న తెలుగు కల్చరల్ సెంటర్ కు మంచి పేరును పరిశీలించాలని సూచించారు. రాజధానిలో ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు ఓ పెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్, పట్టణాభివృద్ధి, సీఆర్డీఏ, ఏడీసీ అధికారులు పాల్గొన్నారు.

## ఇకపై నాలుగు కేటగిరీలుగా గ్రామ పంచాయతీలు

**మొదటిపేజీ తరువాయి** – ఏపీలో గ్రామ పంచాయతీల స్వరూపాన్ని మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీల పునర్వర్గీకరణకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు మూడు రకాలుగా ఉన్న పంచాయతీలను, ఇకపై జనాభా, వార్షిక ఆదాయం ఆధారంగా నాలుగు కేటగిరీలుగా విభజించింది. ఇందులో భాగంగా పట్టణ లక్షణాలు సంతరించుకుంటున్న పెద్ద గ్రామాలను గుర్తిస్తూ కొత్తగా 'రూర్బన్' (రూరల్ + అర్బన్) పంచాయతీ కేటగిరీని ప్రవేశపెట్టింది.గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పరిపాలన, పౌర సేవలు అందించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ కొత్త వర్గీకరణ ప్రకారం రూర్బన్ పంచాయతీలలో పట్టణాలకు దీటుగా మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

**కొత్తగా నాలుగు కేటగిరీలు.. వివరాలు:**

రూర్బన్ పంచాయతీ: 10 వేలకు పైగా జనాభా, రూ.కోటి కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో అయితే 5 వేలకు పైగా జనాభా ఉంటే సరిపోతుంది. ఈ పంచాయతీలలో పట్టణ తరహా సౌకర్యాలు కల్పిస్తారు.

**గ్రేడ్–1 పంచాయతీ :** 3 వేల నుంచి 10 వేల మధ్య జనాభా, రూ.30 లక్షల నుంచి రూ.కోటి లోపు వార్షిక ఆదాయం ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో 2,500 నుంచి 5 వేల మధ్య జనాభా ఉండాలి. మండల కేంద్రంగా ఉన్న పంచాయతీలు ఈ గ్రేడ్ కిందికి వస్తాయి.

**గ్రేడ్–2 పంచాయతీ :** 2 వేల లోపు జనాభా ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో జనాభా 1,500 నుంచి 2 వేల మధ్య ఉండాలి.

**గ్రేడ్–3 పంచాయతీ :** 1,500 కంటే తక్కువ జనాభా ఉన్న పంచాయతీలను ఈ కేటగిరీలో చేర్చారు.

ఈ నూతన వర్గీకరణతో పంచాయతీలకు వాటి జనాభా, ఆదాయ వనరులకు అనుగుణంగా నిధుల కేటాయింపు, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన సులభతరం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పెద్ద గ్రామాల్లో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సేవలు అందించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## దుబాయ్‌లో యుద్ధ భయం

**మొదటిపేజీ తరువాయి** – పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతలు దుబాయ్‌లో విషాదకరమైన దృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఇరాన్ దాడుల భయంతో సురక్షిత ప్రాంతాలకు వెళుతున్న ప్రవాసులు.. తమతో పాటు ఇన్నాళ్లు కలిసి ఉన్న పెంపుడు జంతువులను నడిరోడ్డుపై వదిలేస్తున్నారు. యజమానులు తమ కుక్కలను స్తంభాలకు కట్టేసి అలాగే వెళ్ళిపోతున్నారు. ఆహారం, నీరు లేక అవి ఆక్రందనలు చేస్తున్నాయి. పిల్లులను అట్టపెట్టెల్లో పెట్టి, వాటిపై "మమ్మల్ని క్షమించండి.. వీటిని తీసుకెళ్లడం మా వల్ల కాదు" అని రాసి రోడ్ల పక్కన పడేస్తున్నారు. కొంతమంది ప్రవాసులు పెంపుడు జంతువులను తరలించే ఖర్చు భరించలేక, వాటికి విషం ఇచ్చి చంపేయాలని పశువైద్యులను కోరుతుండటం అక్కడి పరిస్థితి




తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రాణం కంటే ప్రేమ చిన్నదైపోయిందన్నట్లుగా సాగుతున్న ఈ పరిణామాలు జంతు ప్రేమికులను కలచివేస్తున్నాయి.

**ఎడారిలో మూగజీవాల హాహాకారాలు**

రోడ్డు మార్గంలో ఒమన్ సరిహద్దులకు చేరుకుంటున్న వారు, అక్కడ జంతువులకు అనుమతి లేకపోవడంతో వాటిని ఎడారిలోనే వదిలి వెళుతున్నారు. భగభగమండే ఎండలో ఆహారం లేక అవి అలమటిస్తున్నాయి. అటు జంతు సంరక్షణ కేంద్రాలు కూడా ఇప్పటికే నిండిపోవడంతో కొత్తగా వచ్చే జంతువులను చేర్చుకోవడం వారికి భారంగా మారింది. రోజుకు వందల సంఖ్యలో ఫోన్ కాల్స్ వస్తున్నాయని స్వచ్ఛంద సంస్థలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

**సరిపోని స్మార్ట్ మెషీన్ల సాయం..**

దుబాయ్ మున్సిపాలిటీ వీధి జంతువుల కోసం ఏర్పాటు చేసిన 'ఎహ్సాన్ స్టేషన్' (ఆహారం అందించే స్మార్ట్ మెషీన్లు) ఇప్పుడు పెరుగుతున్న ఈ సంఖ్యకు సరిపోవడం లేదు. సంపన్న దేశంలో ఇలాంటి అమానవీయ ఘటనలు జరగడం పట్ల అంతర్జాతీయ స్థాయిలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

## నీళ్లివ్వమని అడిగిన రైతులను జైల్లో పెట్టడం ఏమిటి

**మొదటిపేజీ తరువాయి** – రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాగునీటి కాలువ పనుల కోసం ఆందోళన బాట పట్టిన రైతులను పోలీసులు అరెస్టు చేయడంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా మండిపడ్డారు. తమ పొలాలకు నీళ్లివ్వమని అడిగిన రైతులను జైల్లో పెట్టడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్, తంగళ్లపల్లి మండలాలకు సాగునీరు అందించే 11వ ప్యాకేజీ (ఎల్ఎం 4, ఎల్ఎం 6) కాలువ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కాలువ పనుల కోసం రూ. 3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది దాటినా, ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంపై బండి సంజయ్ విస్మయం వ్యక్తం చేశారు. ఈ పనులు గనుక పూర్తయి ఉంటే దాదాపు 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన అన్నారు. గత పదేళ్ల అధికారంలో ఉండి కూడా సిరిసిల్ల జిల్లాకు నీరివ్వని కేటీఆర్ ఒక 'రైతు ద్రోహి' అని ఆయన ఘాటుగా విమర్శించారు. అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ వైఫల్యాల వల్లే రైతులు పంటలు నష్టపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు మద్దతుగా నిలిచిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి సహా ఇతర నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. రైతులపై అక్రమ కేసులు నమోదు చేస్తే ఊరుకునేది లేదని, వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని హెచ్చరించారు. రైతుల డిమాండ్లు నెరవేరే వరకు బీజేపీ అండగా ఉంటుందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి కాలువ పనులు ప్రారంభించకపోతే పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు.



## బ్యాంకు ఖాతాల్లో మినిమం బ్యాలెన్స్ లేకపోవడంతో

**మొదటిపేజీ తరువాయి** – బ్యాంకు ఖాతాల్లో కనీస నిల్వలు (మినిమం బ్యాలెన్స్) లేని కారణంగా గడిచిన మూడేళ్లలోప్రైవేటు రంగ బ్యాంకులు ఖాతాదారుల నుంచి రూ.11 వేల కోట్లు వసూలు చేసినట్లు కేంద్రం పార్లమెంటుకు వెల్లడించింది. ఇదే కాలంలో ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.8 వేల కోట్లు వసూలుచేసినట్లు తెలిపింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటుకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.ప్రైవేటు రంగ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ అత్యధికంగా రూ.3,800 కోట్లు కనీస నిల్వల నిబంధన పేరుతో ఖాతాదారుల నుంచి వసూలు చేసినట్లు ఆర్థిక మంత్రి



తెలిపారు. ఆ తర్వాత యాక్సిస్ బ్యాంకు రూ.2,700 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంకు రూ.1,200 కోట్ల చొప్పున వసూలు చేశాయి.ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పంజాబ్ నేషనల్ బ్యాంకు అత్యధికంగా రూ.1,500 కోట్లు వసూలు చేయగా, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.1,200 కోట్లు, ఇండియన్ బ్యాంకు రూ.1,100 కోట్ల చొప్పున వసూలు చేసినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. కాగా, కనీస నిల్వలపై ఎస్బీఐ 2020 మార్చి నుంచి ఛార్జీలు వసూలు చేయడం లేదు. గత ఏడాది నుంచి పంజాబ్ నేషనల్ బ్యాంకు, కెనరా బ్యాంకు కూడా ఈ ఛార్జీలను తొలగించాయి.

## ముందుగా వచ్చి ముందుగా వెళ్లొచ్చు



ఉద్యోగాలు చేస్తున్న మహిళలకు మద్దతుగా మహారాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ పరిధిలోని మహిళా ప్రభుత్వ ఉద్యోగుల కోసం 'కమ్ ఎర్లీ–గో ఎర్లీ' (ముందుగా రండి–ముందుగా వెళ్లండి) పేరుతో కొత్త విధానాన్ని ప్రకటించింది. రాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రి సునేత్ర అజిత్ పవార్ మంగళవారం శాసనమండలిలో ఈ విషయాన్ని వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన చర్చకు సమాధానమిస్తూ ఆమె ఈ ప్రకటన చేశారు.ఈ కొత్త పాలసీ ప్రకారం, మహిళా ఉద్యోగులు తమ సౌలభ్యాన్ని బట్టి ఉదయం 9:15 నుంచి 9:45 గంటల మధ్య కార్యాలయానికి రావచ్చు. ఇలా ముందుగా వచ్చిన వారికి, నిర్దేశిత పనివేళల కంటే 30 నిమిషాల ముందే కార్యాలయం నుంచి వెళ్లిపోయేందుకు అనుమతిస్తారు. "రద్దీ వేళల్లో తీవ్రమైన ట్రాఫిక్, కిక్కిరిసిన లోకల్ రైళ్ల నుంచి మహిళలకు ఉపశమనం కల్పించడమే ఈ నిర్ణయం ముఖ్య ఉద్దేశం" అని సునేత్ర పవార్ వివరించారు .మహిళా భద్రత, ఆర్థిక స్వాతంత్ర్యం, ఆరోగ్యం లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను ఆమె సభకు వివరించారు. మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు ఇస్తున్నామని, ప్రసవానంతరం అవసరమైతే మెడికల్ సర్టిఫికెట్ లేకుండానే ఏడాది వరకు సగం జీతంతో సెలవు తీసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. 'ఆపరేషన్ ముస్కాన్' ద్వారా 2015 నుంచి ఇప్పటివరకు 42,594 మంది పిల్లల ఆచూకీ కనుగొన్నట్లు చెప్పారు.'లాడ్కీ బహీన్', 'నమో మహిళా సశక్తికరణ్', 'లఖ్‌పతి దీదీ' వంటి పథకాలను ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందని పవార్ పేర్కొన్నారు. స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను 'ఉమేద్ మాల్స్', ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా మార్కెట్ చేస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టడం, బాలికల డ్రాపౌట్ రేటు తగ్గించడం కోసం 'ఆదిశక్తి అభియాన్' ప్రారంభించినట్లు చెప్పారు. మహిళలపై సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రధాన రైల్వే స్టేషన్లలో ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేశామన్నారు.ఇదే అంశంపై సోమవారం శాసనసభలో మాట్లాడిన మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అదితి తత్కరే, ఆన్‌లైన్ వేధింపులు, డిజిటల్ దాడులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మహిళల పురోగతికి సైబర్ నేరాలు అతిపెద్ద అవరోధంగా మారాయని, గ్రామీణ మహిళలకు డిజిటల్ ఫైనాన్స్, సోషల్ మీడియాపై అవగాహన కల్పిస్తామని ఆమె తెలిపారు.

# యువ క్రికెటర్లకు ప్రేరణ

సంపాదకీయం

తొలిసారిగా కపిల్ దేవ్ సార్థ్యంలోని క్రికెట్ టీమ్ ప్రపంచ కప్ గెలిచిన 1983 నుంచి ఇప్పటి వరకు అనేక మార్పులు వచ్చాయి. క్రికెట్‌లో రూల్స్ మారాయి. అనేక నిబంధనలు వచ్చి పడ్డాయి. ట్వంటీ ట్వంటీ వచ్చింది. కొత్తగా ఐపిఎల్ మ్యాచ్‌లు వచ్చాయి. ఇవన్నీ కూడా యువ క్రెటర్లను ఆకర్షిస్తున్నాయి. ఇలా ఎన్ని మార్పులు వస్తున్నా..భారత్ క్రికెట్ వన్నె తగ్గకుండా పోరాడుతున్న స్ఫూర్తి అభినందనీయం. అంతేకాదు.. భారత్ క్రికెట్‌లో కొత్త నీరు నిరంతరంగా ప్రవహిస్తూనే ఉంది. సచిన్ టెండూల్కర్, గంగూలీ, యువరాజ్ సింగ్, జడేజా, వీరేంద్ర సెహ్వాగ్ ఇలా ఎందరో క్రికెటర్లు మన టీమ్ పనితనాన్ని మెరుగు పర్చారు. ధోనీ, విరట్ కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి వారు క్రికెట్ స్వరూపాన్నే మార్చేశారు. ఇక మొన్న జరిగిన టీ ట్వంటీ వరల్డ్ కప్ పోటీల్లో భారత్ మరోమారు సత్తా చాటింది. ఇందులో గమనించాల్సిన విషయం ఏమంటే సంజూ శంసన్ విశ్వరూపం. అతడి ఆటతీరు చూడగానే సమయాను కూలంగా ధోనీలా, విరాట్‌లా, రోహిత్ శర్మలా విజృంభించగల నైపుణ్యం కనిపించింది. అన్నింటికి మించి అతను చేసిన ఓ చిన్న పని భారత ఔన్నత్యాన్ని, క్రికెట్ గొప్పతనాన్ని చాటింది. ఇంగ్లడ్తో జరిగిన సెవి స్‌లో సెంచరీ మిస్ అయిన సంజూ శాంసన్ మ్యాన్ ఆఫ్‌ది మ్యా, గా ఎన్నికయ్యాడు. కానీ భారత్ విసిరిన 250 పైన పరుగుల ఛాలెంజ్‌లో ఇంగ్లడ్ యువ కిశోరం బెథెల్ అద్భుతంగా రాణించాడు. ఒంటరి పోరుతో సెంచరీతో భారత్‌కు వణుకు పుట్టించాడు. అతను ఔట్ కాకుండా ఉంటే...భారత్ వెనుదిరుగేదే. సంజూ శాంసన్ తనకు దక్కిన మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును బెథెల్‌కు అందించారు. అతనే నిజమైన హీరో అని పొగిడారు. సంజూ చేసిన ఈ ఒక్క పనితో భారత్ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటింది. అయితే అదే సంజూను మనం గుర్తించి, జట్టులోకి తీసుకోవడం లో రాజకీయాలు ఆడామని ఒప్పుకోవాల్సిందే. ప్రతిభకు ఏదీ అడ్డం కాదని, క్రీడల్లో రాజకీయాలు ఉండరాదని మనం గుర్తించాలి. అందులే ఇలాంటి వారందరినీ స్ఫూర్తిగా యువతలో కొత్త ఆశలు చిగురింప చేశారు. క్రికెట్‌లోచోటు దక్కేది 11 మందికే అని తెలిసినా భారత యువరక్తం ఇప్పుడు లక్షల్లో శిక్షణ తీసుకుంటున్నారు. తామూ క్రికెటర్లుగా ఎదగాలనుకుంటున్నారు. ఇలాంటి వారు జాతీయ జట్టులో చోటు దక్కించుకోకున్నా, క్రికెట్‌ను నిలబడెతున్నారని తెలుసుకోవాలి. అందుకే ఇప్పుడు ఎక్కడ చూసినా క్రికెట్ కోచింగ్ సెటర్లు వెలిశాయి. ప్రతి ఇంట్లో ఒకరు క్రికెట్ బ్యాట్ పట్టుకుని మైదానంలోకి పరుగెడుతున్నాడు. ఇది ఓ రకంగా ప్రేరణ. యువతకు స్ఫూర్తి. అటు విమెన్ క్రికెట్ అయినా, ఇటు మెన్ క్రికెట్ అయినా ప్రతి ఒక్కరూ శిక్షణకు దిగుతున్నారు. మొత్తంగా టీమిండియా వరుసగా రెండోసారి, మొత్తంగా మూడో పర్యాయం టీ20 ప్రపంచ కప్‌లో చాంపియన్‌గా నిలిచింది. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ వంటి యోధులు ఇప్పుడున్న జట్టుకు వెన్నముక గా నిలిచారు. జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌ను ముందుండి నడిపించాడు. అవసరమనుకున్న ప్రతిసారీ వికెట్ పడగొట్టి ప్రస్తుత తరంలో ప్రపంచ అత్యుత్తమ బౌలర్‌గా తనపేరును సార్థకం చేసుకున్నాడు. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ ఆల్‌రౌండ్ మెరుపులతో టీమిండియా ఆధిపత్యానికి ఎదురులేక పోయింది. జట్టులోని ఆటగాళ్లంతా కలిసికట్టుగా కదంతొక్కి ప్రపంచకప్ సంగ్రామంలో భారత్ మరోమారు విశ్వవిజేతగా ఆవిర్భవించడంలో విశేషంగా దోహదపడ్డారు. సమర్థ నాయకుడిగా ముందుండి నడిపించిన సూర్యకుమార్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ విజయంతో భారత్‌కు ఐసీసీ ట్రోఫీలు అందించిన దిగ్గజాలు కపిల్ దేవ్, ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ సరసన నిలిచాడు. ప్రపంచ క్రికెట్‌లో ఆధిపత్యాన్ని చాటుకుంటున్న భారత జట్టు సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. కపిల్ డెవిల్స్, ధోనీ సేన, రోహిత్ బృందం అద్భుత విజయాలను మరిపిస్తూ.. మరో విశ్వకప్పును ఒడిసి పట్టుకుంది. న్యూజిలాండ్‌ను ఏకపక్షంగా నిలువరించిన సూర్యకుమార్ సేన యావద్భారతావని గర్వించే ప్రదర్శన కనబరచింది. రెండేళ్ల క్రితం జరిగిన టోర్నీలో టైటిల్ గెలిచిన భారత జట్టు ఈసారి ట్రోఫీ నిలబెట్టుకొని సరికొత్త చరిత్ర సృష్టించింది. మొత్తంగా మూడోసారి ఈ కప్పును దక్కించుకొని మరే జట్టుకూ సాధ్యమవని అరుదైన ఘనతను అందుకొంది. ఈ అద్భుతానికి సాక్షిగా నిలిచిన అహ్మదాబాద్ స్టేడియంలో మూడేళ్లక్రితం వన్డే ప్రపంచకప్ ఫైల్లో ఎదురైన పరాజయ భారాన్ని దించేసుకుంది. ఆతిథ్య జట్టుకు కప్పు దక్కదన్న సెంటిమెంట్‌ను పటాపంచలు చేసింది. ఇలా ఎన్నో రికార్డుల పరంపరలు, మధురస్మృతులను క్రికెట్ అభిమానులకు అందించిన భారత జట్టు విజయం చిరస్మరణీయం. అహ్మదాబాద్ స్టేడియంలో పరుగులను రాబట్టడం కష్టమే అయినా, 255 పరుగుఉల కొట్టి, పటిష్టమైన న్యూజిలాండ్ జట్టును ధీకొటటిన తీరు యువ క్రికెటర్లకు స్ఫూర్తాదాయకం. క్రికెట్ అభిమానలకు విమెన్స్ డే ఆదివారం పండ గనింపింది. రెండేళ్ల క్రితం టీ20 ప్రపంచకప్ గెలిచిన టీమిండియాలోని రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజాలాంటి కీలక ఆటగాళ్లు ఇప్పుడు జట్టులో లేరు. అయినా, ఆ సీనియర్లు లేరన్న లోటు లేకుండా యువ క్రికెటర్లు అద్భుతంగా రాణించారు. ఇదే టీమిండియా బలం అని నిరూపించారు. కొత్త రక్తం వస్తూనే ఉంటుందని నిఊపించారు. టీమిండియా ఈసారి టోర్నీ ఆసాంతం అద్భుమైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. టోర్నమెంట్ మొత్తంగా సూపర్`8 దశలో దక్షిణాఫ్రికాతో పరాజయం మినహా అన్ని మ్యాచుల్లోనూ విజయదుందుభి మోగించి సత్తా చాటుకుంది. మూడుసార్లు 250కి పైగా స్కోర్లు నమోదు చేయడం మన జట్టు యువ బ్యాటర్ల సత్తాకు నిదర్శనం. ఛేదన అయినా, లక్ష్యాన్ని నిర్దేశించడంలో అయినా జట్టు రాటుదేలిందనే చెప్పాలి. ఇలాగే కొనసాగితే రేపు జరిగే అనేక పోటీల్లో విజయం మనదే అవుతుంది. ఈ చిరస్మరణీయ గెలుపులో ఆటగాళ్ల పట్టుదల, ప్రతిభకు తోడు కోచ్ గౌతమ్ గంభీర్ పాత్ర ఎనలేనిది.




# ఇరాన్ యుద్ధ ప్రభావంతో ధరల మోత

## గ్యాస్ ధరలు పెరగడంతో పెట్రో ధరలపై ఆందోళన
## ఇప్పటికిప్పుడు ప్రమాదం లేదని వెల్లడించిన కేంద్రం

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మనదేశ నిత్యావసరాలపై తీవ్ర ప్రభావం చూపించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా పెట్రోల్, గ్యాస్, ఎరువుల దిగుమతులకు ఆటంకం ఏర్పడడంతో, అతి త్వరలోనే వీటి నిల్వలు నిండుకుంటాయని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సంర్భంలో గ్యాస్ ధరలు పెరిగాయి. అలాగే పెట్రో ధరలు పెరుగాయని అంటున్నారు. వీటి ప్రభావంతో నిత్యాసవరాలు కూడా పెరగక తప్పేలా లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం స్పందించింది. ముఖ్యంగా పెట్రోల్ ధరలు పెరుగుతాయనే వార్తలను ఖండించింది. కొంతపాలం పాటు నష్టాలను చమురు కంపెనీలు భరిస్తాయని వెల్లడించింది. రాబోయే 6 నుంచి 8 వారాల వరకు ముడి చమురు, శుద్ధి చేసిన పెట్రోల్ నిల్వలు ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. అలాగే ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు కూడా ప్రస్తుతానికి సరిపోతాయని పేర్కొంది. అయితే గ్యాస్ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 25 రోజులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇంతకు ముందు ఈ వ్యవధి 21 రోజులు ఉండేది. మనదేశంలో సగటున ఒక కుటుంబం ఏడాదికి 7 నుంచి 8 సిలిండర్లను మాత్రమే వినియోగిస్తున్నట్టు కేంద్రం పేర్కొంది. లాగే రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది అయితే ప్రస్తుత భౌగోళిక ఉద్రిక్తతలు, గ్యాస్ సరఫరాలో కోత యూరియా ఉత్పత్తులపై ప్రభావం చూపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం 177.31 లక్షల టన్నుల ఎరువులు నిల్వలున్నట్టు తెలిపింది. వాటిల్లో 59.30 లక్షల టన్నుల యూరియా, 25.13 లక్షల టన్నుల డీఏపీ, 55.87 లక్షల టన్నుల ఎన్‌పీకే ఎస్ నిల్వలున్నాయని పేర్కొంది.

## ఇంధన ధరలు దిగి వస్తాయి
### త్వరలోనే ఇరాన్ యుద్ధం ముగుస్తుంది
### ట్రంప్ సంచలన ప్రకటన

ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతుందని,వెనక్కి తగ్గేది లేదన్న ట్రంప్ కొంత మెత్త బడ్డారు. వెనక్కి తగ్గుతున్నట్లుగా కనిపిస్తున్నారు. ఇరాన్ కూడా గట్టి హెచ్చరికలు చేయడంతోనో ఏమో యుద్ధానికి త్వరలోనే ముగింపు దొరుకుతుందని అన్నారు. ఇరాన్ యుద్ధం త్వరలోనే ముగుస్తుందని, చమురు ధరలు కిందకు దిగి వస్తాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి చేరువలో ఉన్నామని, ఇరాన్‌పై దాడిని, మధ్య ప్రాచ్యంలోని చెడును వదిలించడానికి అమెరికా చేసిన విహారయాత్రగా ట్రంప్ అభివర్ణించారు. ఆ విహారయాత్ర స్వల్పకాలికంగానే ఉంటుందని తెలిపారు. మియామి గోల్ఫ్ క్లబ్‌లో రిపబ్లికన్ చట్ట సభ్యులతో జరిగిన సమావేశంలో ట్రంప్ ప్రసంగించారు. 'ఇరాన్ యుద్ధం ఈ వారంలోనే ముగుస్తుందా' అనే ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. 'లేదు. కానీ త్వరలోనే ముగుస్తుంది' అని జవాబిచ్చారు. 'మా సైనిక లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా పెద్ద అడుగులు వేస్తున్నాం. ఇరాన్‌లోని బలగాలను పూర్తిగా తుడిచిపెట్టేశాం. అంతర్జాతీయ చమురు సరఫరాకు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించేది లేదు. అలా చేస్తే ఇరాన్‌ను పూర్తిగా ధ్వంసం చేస్తాం' అని ట్రంప్ హెచ్చరించారు. మెరికా, ఇజ్రాయెల్‌పై దాడిని పొడిగించేందుకు ఇరాన్‌కు తగినంత సామర్థ్యం లేదు కాబట్టి, యుద్ధం త్వరలోనే ముగిసిపోతుందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా`ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడంతో ఆయన వారసుడిగా మొజ్తాబా ఖమేనీ ఎంపికైనట్టు వార్తలు వస్తున్నాయి. ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా మొజ్తాబాను ఎంపిక చేయడం పట్ల తాను చాలా నిరాశ చెందానని, అయితే కొత్త సుప్రీం లీడర్‌పై దాడి చేసే ఉద్దేశం తనకు లేదని ట్రంప్ తెలిపారు.

# పెన్సిలిన్ ఆవిష్కర్త ఫ్లెమింగ్



## మార్చి 11...అలెగ్జాండర్ ఫ్లెమింగ్ వర్ధంతి

వెయ్యేళ్ల కాలంలోనే అతి గొప్ప ఆవిష్కరణగా, కోట్లాది మంది ప్రాణాలకు రక్షణగా గుర్తింపు పొందింది 'పెన్సిలిన్'. వైద్య శాస్త్రంలో అద్భుతమైన యాంటీ బయాటిక్ మందుగా పేరుపొందిన పెన్సిలిన్ పేరు చెప్పగానే వెంటనే స్ఫురించే పేరు అలెగ్జాండర్ ఫ్లెమిం గ్. తొలి యాంటీ బయోటిక్‌గా పేరొందిన ఆ మందును కనిపెట్టిన శాస్త్రవేత్తే అలగ్జాండర్ ఫ్లెమింగ్.

ప్రపంచంలో అత్యంత విస్తృతంగా ఉపయోగించే యాంటీ బయాటిక్.

వేరే ప్రయోగం చేస్తుండగా జరిగిన చిన్న పొరపాటు వల్ల ఇది బయట పడడం విశేషం. పెన్సిలిన్ వల్ల క్షయ, న్యూమోనియా, టైఫాయిడ్ లాంటి ఎన్నో ప్రాణాంతక వ్యాధుల నుంచి మానవాళికి రక్షణ కలుగు తోంది. దీన్ని కనిపెట్టినందుకు ఫ్లెమింగ్ 1945లో నోబెల్ బహు మతిని పొందారు.

సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ (ఆగస్టు 6, 1881 – మార్చి 11, 1955) స్కాట్లాండుకు చెందిన జీవ శాస్త్ర వేత్త, వైద్యుడు. 1923 లో కనుగొన్న ఎంజైములు, లైసోజై ములు, 1928 లో కనుగొన్న ప్రపంచ మొట్ట మొదటి యాంటీ బయోటిక్ పెన్సిలిన్ ఆయన పరిశోధనల్లో ముఖ్యమైనవి. పెన్సిలిన్ కనుగొన్నందుకు ఆయన 1945లో హోవర్డ్ ఫ్లోరే, ఎర్నెస్ట్ బోరిస్ చైన్ లతో కలిసి వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్నాడు. బ్యాక్టీరియాలజీ, ఇమ్యునాలజీ, కీమోథెరపీ మీద అనేక వ్యాసాలు రాశారు.

స్కాట్లాండ్‌లో 1881 ఆగస్టు 6న రైతు కుటుంబంలో పుట్టిన ఫ్లెమింగ్, ఏడేళ్ల వయసు లోనే తండ్రిని కోల్పోయి, ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు మధ్యలోనే ఆపేసి షిప్పింగ్ కంపెనీలో గుమాస్తాగా చేరాల్సి వచ్చింది. అనుకోకుండా ఆస్తి కలిసి రావడంతో తిరిగి ఇరవయ్యేళ్ల వయసులో చదువును కొన సాగించడం ప్రపంచానికెంతో మేలు చేకూర్చింది. సెయింట్ మేరీస్ కాలేజీలో వైద్యవిద్యలో చేరి చురుగ్గా చదువుతూనే రైఫిల్ షూటింగ్, ఈత, వాటర్‌పోలో క్రీడల్లో బహుమతులు పొందుతూ ఉండేవారు. మేరీ మెడికల్ కాలేజీ నుంచి 1906 లో ఈయన డిగ్రీ తీసుకున్నారు. డిగ్రీ పొందాక పరిశోధనల్లో నిమగ్నమయ్యారు.

మొదటి ప్రపంచ యుద్ధం ఫలితంగా 1918 లో మళ్ళీ సెయింట్ మేరీ మెడికల్ కాలేజీకి చేరారు. మొదటి ప్రపంచ యుద్ధం మొదలవడంతో సైనికులకు చికిత్స లు చేసే బృందానికి నాయకత్వం వహించారు. గాయాలకు సూక్ష్మ జీవుల వల్ల ఇన్ఫెక్షన్ సోకి చాలా మంది సైనికులు చనిపోవడాన్ని గమనించిన ఫ్లెమింగ్, యుద్ధా నంతరం బ్యాక్టీరియాపై పరిశోధన లు చేయసాగారు. లండన్ లోని సెయింట్ మేరీస్ హాస్పిటల్‌లోని ప్రయోగశాలలోని ఇన్‌క్యులేషన్ విభాగంలో ఫ్లెమింగ్ ఇన్ఫ్లుఎంజా వైరస్‌తో ప్రయోగాలు చేశారు. వాటిలో భాగంగా 'స్టెఫైలో కోకి' సూక్ష్మజీవులపై పరిశోధన చేస్తుండగా ఓ రోజున చిన్న పొర పాటు జరిగింది. ఆ బ్యాక్టీరియా ఉన్న పాత్రలను బల్లపై పెట్టి మర్చిపోయి ఇంటికి వెళ్లిపోయారు. ఆ మర్నాడు వచ్చి చూస్తే బయటి వాతావరణం ప్రభావం వల్ల ఓ పాత్రలో నీలిరంగులో బూజులాంటి తెట్టు (ఫంగస్) కట్టి ఉండడం గమనించారు. చిత్రంగా ఆ బూజు ఆశించినంత మేరా పాత్రలో సూక్ష్మజీవులు నాశనమై కనిపించా యి. అంటే ఆ బూజులో సూక్ష్మ జీవులను చంపే పదార్థమేదో ఉందని తెలుసు కున్నారు.

దాంతో ఫ్లెమింగ్ దానిపై పరిశోధ నలు చేసి చిన్న కుంచెలాగా ఉండే పదార్థాన్ని వేరుచేయ గలిగారు. లాటిన్‌లో పెన్సిలియమ్ అంటే చిన్న కుంచె అనే అర్థం ఉండడంతో దానికి 'పెన్సిలిన్' అని పేరు పెట్టారు. దాన్ని 1928లో కనిపెట్ట గా, మరిన్ని పరిశోధనలు చేసి ఓ మందుగా మార్చి వాడుకలోకి తీసుకు రావడానికి 17 సంవత్స రాలు పట్టింది. దీంతో యాంటీ బయాటిక్ యుగానికి నాంది పలికినట్టయింది.

ప్రచురించిన నివేదికలలో ఫ్లెమింగ్ ఇలా అంటారు: ఒకరు కొన్నిసార్లు తాను వెతకని దాన్ని కనుగొంటారు. నేను సెప్టెంబర్ 28, 1928 న తెల్లవారు జామున మేల్కొన్న పృుడు, ప్రపంచం లోని మొట్ట మొదటి యాంటీ బయాటిక్ లేదా బ్యాక్టీరియా కిల్లర్‌ను కనుగొనడం ద్వారా ఔషధం మొత్తాన్ని విప్లవా త్మకంగా మార్చాలని నేను ఖచ్చితంగా అనుకోలేదు. కానీ నేను సరిగ్గా అదే చేశానని అనుకుంటు న్నాను. 1942 లో యునైటెడ్ స్టేట్స్‌లో స్ట్రెప్టోకోకల్ సెప్టిసిమియాకు మొదటి రోగికి విజయవంతంగా చికిత్స అందించబడింది.

అలెగ్జాండర్ ఫ్లెమింగ్ స్కాటిష్ జీవశాస్త్రవేత్త, వైద్య రసాయన శాస్త్రవేత్త (ఫార్మకాలగిస్ట్) కాగా, ఆయన కనిపెట్టిన "ఎంజైము లైసోజైము(1923 ), అంటి బయోటిక్ ' పెన్సిలిన్(1928 ) ' ముఖ్యమైనవి. 1945లో వైద్య శాస్త్రానికి నోబెల్ బహుమానం ఈ పెన్సిలిన్ కనుగొన్నందుకు ఫ్లెమింగ్ తో పాటు హొవార్డ్ ఫ్లోరె, ఎర్నెస్ట్ చెయిన్ అనే మరో ఇద్దరు శాస్త్ర వేత్తలకు కూడా ఇచ్చారు.

సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...

# భారత క్రికెట్ స్వర్ణ యుగం

## టీ–20 ప్రపంచకప్ విజయం



సమకాలీన క్రికెట్ ప్రపంచం వేగం, వ్యూహం, సాంకేతికతల సమన్వయంతో కొత్త దశలోకి అడుగు పెట్టింది. ముఖ్యంగా ట్వంటీ–20 ఫార్మాట్ క్రికెట్‌ను అత్యంత ఉత్కంఠ భరిత క్రీడగా మలిచింది. కేవలం మూడు గంటల వ్యవధిలోనే ఫలితం తేలే ఈ ఫార్మాట్ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది అభిమానులను ఆకర్షిస్తోంది. అంతర్జాతీయ క్రికెట్ వ్యవస్థను నిర్వహిస్తున్న అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించే పురుషుల టీ–20 ప్రపంచకప్ ఈ ఫార్మాట్‌కు అత్యున్నత వేదికగా నిలుస్తోంది. ప్రపంచంలోని అత్యుత్తమ జట్లు పాల్గొనే ఈ మహా టోర్నమెంట్‌లో భారత క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలవడం భారత క్రీడా చరిత్రలో గర్వకారణంగా నిలిచింది. గత కాలపు చారిత్రాత్మక విజయానికి నాయకత్వం వహించిన కెప్టెన్ రోహిత్ శర్మ తన సమర్థ వ్యూహాలతో ఆధునిక క్రికెట్‌లో ఒక విశిష్ట నాయకుడిగా గుర్తింపు పొందాడు. జట్టును సమన్వయంతో ముందుకు నడిపించడంలో, ఆటగాళ్ల ప్రతిభను సరైన సమయంలో వినియోగించడంలో ఆయన చూపిన దూరదృష్టి ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచింది. టోర్నమెంట్ మొత్తం భారత జట్టు అజేయంగా సాగి టైటిల్ సాధించడం అరుదైన ఘనతగా నిలిచింది.

భారత క్రికెట్‌కు గొప్ప వారసత్వం ఉంది. టెస్ట్ క్రికెట్ నుంచి వన్డేలు, టీ–20ల వరకు భారత జట్టు ఎన్నో చారిత్రక విజయాలను సాధించింది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది అభిమానులను కలిగిన జట్లలో భారత జాతీయ క్రికెట్ జట్టు అగ్రస్థానంలో నిలుస్తోంది. 2007లో జరిగిన తొలి టీ–20 ప్రపంచ కప్ విజయం భారత క్రికెట్‌లో ఒక కొత్త యుగాన్ని ప్రారంభించింది. ఆ విజయంతో యువ ఆటగాళ్లకు కొత్త అవకాశాలు లభించాయి. దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి వచ్చి భారత జట్టును మరింత బలంగా తీర్చిదిద్దారు.

కాలక్రమేణా జట్టు నిర్మాణంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఒకప్పుడు సీనియర్ ఆటగాళ్లపై ఆధారపడి ఉన్న జట్టు, ఇప్పుడు అనుభవం మరియు యువశక్తి కలయికతో సమతుల్యంగా మారింది. విరాట్ కోహ్లీ వంటి స్థిరమైన బ్యాట్స్‌మన్, హార్దిక్ పాండ్యా వంటి దూకుడు ఆల్ రౌండర్, అలాగే ప్రపంచ స్థాయి వేగబౌలర్ జస్ప్రీత్ బుమ్రా వంటి ఆటగాళ్లు జట్టుకు కీలక బలంగా నిలిచారు. వీరి సమిష్టి ప్రదర్శన భారత జట్టును ప్రపంచ స్థాయిలో అత్యంత పటిష్ట జట్టుగా నిలిపింది.

ప్రస్తుత 2026 టోర్నమెంట్‌లో భారత జట్టు ప్రదర్శన గణాంక పరంగా కూడా విశేషంగా నిలిచింది. లీగ్ దశ నుంచి ఫైనల్ వరకు ఒక్క మ్యాచ్ మినహా అజేయంగా ముందుకు సాగడం భారత జట్టు సామర్థ్యానికి నిదర్శనం. ప్రతి మ్యాచ్‌లోనూ జట్టు సమన్వయంతో కూడిన ప్రదర్శన కనబరిచింది. బ్యాటింగ్ విభాగంలో ప్రారంభ ఓవర్ల నుంచే దూకుడు ప్రదర్శించడం ద్వారా ప్రత్యర్థి జట్లపై ఒత్తిడి సృష్టించారు. పవర్ ప్లేలో వేగంగా పరుగులు సాధించడం ద్వారా బలమైన పునాది వేసి, మధ్య ఓవర్లలో నిలకడగా ఆడి, చివరి ఓవర్లలో స్కోరును భారీగా పెంచడం భారత బ్యాటింగ్ వ్యూహంలో ప్రధాన లక్షణంగా నిలిచింది.

బౌలింగ్ విభాగం కూడా భారత విజయానికి కీలక పాత్ర పోషించింది. పవర్ ప్లేలోనే ప్రత్యర్థి జట్లను ఒత్తిడికి గురిచేయడం ద్వారా ప్రారంభంలోనే వికెట్లు సాధించారు. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు పరుగులను నియంత్రించి బ్యాట్స్‌మన్‌లపై ఒత్తిడిని పెంచారు. చివరి ఓవర్లలో వేగబౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్ చేయడం ద్వారా ప్రత్యర్థి జట్లకు భారీ స్కోర్లు సాధించే అవకాశాన్ని తగ్గించారు. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రా చేసిన కట్టుదిట్టమైన బౌలింగ్ అనేక మ్యాచ్‌లలో భారత జట్టుకు విజయాన్ని అందించింది.

ఫీల్డింగ్ కూడా భారత జట్టు విజయానికి కీలక కారణంగా నిలిచింది. ఆధునిక క్రికెట్‌లో ఫీల్డింగ్ స్థాయి ఎంత ముఖ్యమో భారత ఆటగాళ్లు తమ ప్రదర్శనల ద్వారా నిరూపించారు. బౌండరీల వద్ద అద్భుతమైన క్యాచ్‌లు, మెరుపు వేగంతో చేసే రన్ అవుట్లు, మైదానంలో చురుకైన కదలికలు ప్రత్యర్థి జట్లపై తీవ్ర ఒత్తిడిని సృష్టించాయి. కొన్ని సందర్భాల్లో ఫీల్డింగ్ ద్వారానే మ్యాచ్ గమనాన్ని మార్చిన ఘట్టాలు కనిపించాయి.

ప్రస్తుత విజయ ప్రయాణంలో మరో ముఖ్య పాత్ర పోషించిన ఆటగాడు సూర్య కుమార్ యాదవ్. ఆధునిక క్రికెట్‌లో అత్యంత వినూత్నమైన బ్యాటింగ్ శైలి కలిగిన ఆటగాడిగా ఆయన ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాడు. మైదానం మొత్తం మీద అసాధారణ కోణాల్లో షాట్లు ఆడగల సామర్థ్యం ఆయన ప్రత్యేకత. క్రికెట్ విశ్లేషకులు ఆయనను “360 డిగ్రీ బ్యాట్స్‌మన్”గా అభివర్ణిస్తారు. ఒత్తిడి పరిస్థితుల్లో కూడా ధైర్యంగా ఆడే స్వభావం జట్టుకు కీలక బలంగా నిలిచింది.

ఈ విజయానికి వెనుక ఉన్న మరో ప్రధాన కారణం భారత క్రికెట్ వ్యవస్థ యొక్క బలం. దేశంలో ఉన్న విస్తృతమైన దేశీయ క్రికెట్ వ్యవస్థ యువ ప్రతిభను వెలికి తీస్తోంది. ఈ వ్యవస్థను సమర్థంగా నిర్వహిస్తున్న భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన క్రికెట్ సంస్థగా గుర్తింపు పొందింది. దేశీయ టోర్నీలు, శిక్షణా అకాడమీలు, ఆధునిక సౌకర్యాలు యువ ఆటగాళ్లను అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దు తున్నాయి.

భారత క్రికెట్ విజయాలు కేవలం క్రీడా విజయాలు మాత్రమే కాదు; అవి జాతీయ గర్వానికి ప్రతీకలు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది భారతీయ అభిమానులు ఈ విజయాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చిన్న పట్టణాల నుంచి మహా నగరాల వరకు ప్రతి చోటా అభిమానులు సంబరాలు నిర్వహించారు. క్రికెట్ భారతదేశంలో ఒక క్రీడ మాత్రమే కాదు; అది ఒక భావోద్వేగం, ఒక సామూహిక అనుభూతి. భవిష్యత్తు దృష్ట్యా ఈ విజయం భారత జట్టుకు మరింత ప్రేరణగా నిలుస్తుంది. యువ ఆటగాళ్లకు ఇది ఒక ప్రేరణాత్మక ఉదాహరణగా మారింది. క్రమశిక్షణ, కృషి, సమన్వయం ఉంటే ప్రపంచ స్థాయిలో విజయాలను సాధించడం సాధ్యమని ఈ విజయం నిరూపించింది. సూర్య కుమార్ యాదవ్ నాయకత్వం భారత జట్టుకు స్థిరత్వం, ఆత్మ విశ్వాసాన్ని అందించింది. ఆయన నిర్మించిన బలమైన జట్టు నిర్మాణం భవిష్యత్తులో కూడా భారత క్రికెట్‌కు మార్గదర్శకంగా నిలుస్తుంది.

మొత్తంగా చూస్తే ఈ టీ–20 ప్రపంచకప్ విజయం భారత క్రికెట్ చరిత్రలో ఒక మైలురాయి. అజేయ ప్రస్థానం, సమన్వయంతో కూడిన జట్టు ప్రదర్శన, వ్యూహాత్మక నాయకత్వం ఇవన్నీ కలిసి ఈ విజయాన్ని సాధ్యం చేశాయి. భారత క్రికెట్ యొక్క స్వర్ణయుగం కొనసాగుతుందనే నమ్మకాన్ని ఈ విజయం మరింత బలపరిచింది. సూర్య కుమార్ యాదవ్ నాయకత్వంలో సాధించిన ఈ విజయగాథ భారత క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుంది. సూర్య కుమార్ యాదవ్ వంటి యువ నాయకుల చేతుల్లో భారత క్రికెట్ భవిష్యత్తు మరింత ప్రకాశవంతంగా ఉండబోతోందనే ఆశాభావాన్ని అభిమానులలో నింపుతోంది.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

# పెరుగుతున్న ఎండల తీవ్రత

## ముందస్తు చర్యలపై ప్రభుత్వం అప్రమత్తం

అమరావతి : రాష్ట్రంలో ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. దీంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ముందస్తు చర్యలపై సమీక్షించింది. ఎండల తీవ్రత, వడగాల్పుల పరిస్థితులపై హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత మంగళవారం సమావేశం నిర్వహించారు. ఏపీఎస్‌డీఎంఏ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్లు, లైన్ డిపార్ట్‌మెంట్ల అధికారులు, విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ న్`2026'ను హోంమంత్రి ఆవిష్కరించారు. అధికారులందరూ అనుసరించి ముందుకు సాగాలని ఆదేశించారు. సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగి వడగాల్పులు ఎక్కువగా వీచే అవకాశం ఉందని మంత్రి అనిత హెచ్చరించారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని.. వడదెబ్బ కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని హోంమంత్రి ఆదేశాలు జారీ చేశారు. పశువుల రక్షణకు సంబంధించి సూచనలు జారీ చేయాలని సూచించారు. వడదెబ్బ బారిన పడిన వారి చికిత్స కోసం బెడ్లు, మందులు, అంబులెన్సులు సిద్ధం చేయాలని వైద్యశాఖను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రాంతాల్లో పనిచేసే కార్మికులపై ప్రత్యేక దృష్టి సారించాలని హోంమంత్రి తెలిపారు. నిరంతరాయంగా తాగునీటి సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను హోంమంత్రి ఆదేశించారు. తాత్కాలిక చలువ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.



''నడక చాలు, మీకు జిమ్ అవసరం లేదు'' అని ఎవరైనా చెప్పడం మనలో చాలా మంది విని ఉండొచ్చు. సాధారణంగా జిమ్‌కు వెళ్లలేకపోతున్న వారికి ఇది ఓదార్పుగా అనిపించవచ్చు. జిమ్‌కు దుమ్మా కొట్టడం దానికి బదులుగా నడకను ఎంచుకోవడం అంటే అది అంత సులువైన విషయం కాదు అలాగని అసాధ్యం కూడా కాదు. జిమ్ మానడం వల్ల కలిగే నష్టాలను నడకతో భర్తీ చేయడం సాధ్యమే అంటున్నారు వ్యాయామ నిపుణులు. వారు చెబుతున్న ప్రకారం...అలా చేస్తే లాభం లేదు...

# నడకతో ఎన్నో లాభాలు!

కారు దిగి ఆఫీసు వరకు నడవడం, షాపింగ్ మాల్‌లో తిరగడం, ఫోన్‌లో మాట్లాడుతూనో, చాట్ చేస్తూనో నడవడం, పార్క్‌లో రిలాక్స్‌డ్‌గా నెమ్మదిగా వాక్ చేయడం... వంటి వాటివల్ల జిమ్ సెషన్‌ను భర్తీ చేయడం సాధ్యం కాదు. ఎందుకంటే అవి వ్యక్తి శరీరంపై నిర్మాణాత్మక ఒత్తిడిని కలిగించవు. కార్డియో పేరిట ట్రెడ్‌మిల్, క్రాస్ ట్రైనర్, సైక్లింగ్...వగైరాలు జిమ్‌లో అందుబాటులో ఉంటాయి.

అటువంటి వ్యాయామాలతో కూడిన జిమ్ సెషన్ వదిలేస్తూ, ఆ నష్టం భర్తీ కావాలంటే ఏదో ఒక పని మీద కాకుండా నడవడం అనే పని మీద బయటకు వెళ్లాలి. అప్పుడే మన చేతులు సరిగ్గా కదులుతాయి. చూపు ముందుకు ఉంటుంది. ఒక్కో అడుగు సాధారణం కంటే ఎక్కువ దూరం పడుతుంటుంది.

**ఇలా నడిస్తే...భళా...**

స్మార్ట్‌వాచ్ లేదా ఫోన్ ఉంటే, ఒక సాధారణ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. స్థిరమైన రీతిలో గంటకు 5 కి.మీ వేగంతో 30 నిమిషాల పాటు నిర్విరామంగా నడవాలి. అంటే దాని ద్వారా మనం 2.50 కి.మీ నడుస్తామన్న మాట. ఆ వేగంతో, చాలా మంది సాధారణ నడక నుంచి బయటపడి తేలికపాటి కార్డియో శైలిలోకి వెళతారు. శ్వాస కొంచెం లోతుగా మారుతుంది. కండరాలు సాధారణ ప్రయాణ వేగం కంటే ఎక్కువ శక్తిని ఖర్చు చేయడానికి తగ్గట్టుగా వేడెక్కుతాయి. అలా 30 నిమిషాలు నాన్–స్టాప్ గా నడిస్తే గుండె, ఊపిరితిత్తులు రక్త నాళాలు గట్టి ప్రభావాన్ని ఎదుర్కొంటాయి.

దీనికి రోజువారీ తప్పక చేయాల్సిన అవసరం కూడా లేదు. వారంలో నాలుగు రోజులు సరిపోతుంది. ''దానిని ఒకేలా పరిగణించినప్పుడు మాత్రమే. నడక ఒక వ్యాయామం అవుతుంది. తొలుత 5 నిమిషాల పాటు సున్నితమైన వేగంతో ప్రారంభించి ఆపై తగిన వేగంలో స్థిరంగా నడవడం అలవాటు చేసుకోవాలి. అంతే కాకుండా చేతులను వెనక్కి కట్టేయడం లాంటివి చేయకూడదు.

చేతులను దాదాపు 90 డిగ్రీల వద్ద వంచి సహజంగా ఊగుతూ ఉండేలాచూడాలి. చదునైన నేలపై 30 నిమిషాల్లో 2.3–2.7 కి.మీ. లక్ష్యంగా పెట్టుకోవాలి. వేగాన్ని తగ్గించకుండా ఉండటానికి అవసరమయితే సంగీతం లేదా పాడ్‌కాస్ట్‌లను ఉపయోగించవచ్చు. వాక్ ముగిసే సమయంలో హృదయ స్పందన రేటు తగ్గడానికి 2–3 నిమిషాల పాటు నెమ్మదించిన నడకతో ముగించాలి.

## బాల్య వివాహం అంటే

# పసిబిడ్డపై అత్యాచారమే

## ముగిసిన 100 రోజుల బాల్య వివాహ ముక్తి రథం అవగాహన యాత్ర

### ఆర్డీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్

**వనపర్తి ప్రతినిధి, మార్చి 10 (నినాదం)**

బాల్య వివాహం అనేది కేవలం సామాజిక దురాచారం మాత్రమే కాదని, అది చట్టం దృష్టిలో పసిబిడ్డపై జరిగే అత్యాచారమని రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్ అన్నారు. భారత ప్రభుత్వ మహిళా,శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన వందరోజుల సాంద్రత కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహ ముక్త భారత్, బాల వివాహ ముక్తిరథంతో వనపర్తి, జోగులాంబ గద్వాల, మహబూబ్ నగర్ జిల్లాల్లో అవగాహన యాత్ర ముగిసింది. ఈ సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్ మాట్లాడుతూ వనపర్తి, జోగులాంబ గద్వాల, మహబూబ్ నగర్ జిల్లాలోని మారుమూల గ్రామాలు, పట్టణాల్లో 'బాల వివాహ ముక్తి రథం'పర్యటించిందని, మూడు దశల్లో నిర్వహించిన ప్రచారంలో మత పెద్దలు, విద్యార్థులు, పంచాయతీలు, వివాహ సేవా నిర్వాహకులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా వేల సంఖ్యలో ప్రజల చేత ప్రమాణం చేయించడం జరిగిందని, బాల్య వివాహం అంటే పసిబిడ్డపై అత్యాచారమేనని, ఇది శిక్షార్హమైన నేరమని ప్రజలకు వివరించినట్లు ఆమె పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థల నెట్‌వర్క్ 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' భాగస్వామ్యంతో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందని పేర్కొన్నారు. మా నిస్వార్థ ప్రయత్నాలకు ప్రజల నుండి లభించిన స్పందన చూస్తుంటే వనపర్తి, జోగులాంబ గద్వాల, మహబూబ్ నగర్ జిల్లాలో బాల్య వివాహ రహిత భారతదేశం అనే లక్ష్యానికి మనం చాలా దగ్గరగా ఉన్నామని నమ్మకం కలుగుతోందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. బాల వివాహ ముక్తి రథం రథయాత్రను వనపర్తి జిల్లాలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీతా రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి లు ప్రారంభించారని తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ బి.సంతోష్, అదనపు ఎస్పీ శంకర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని సునంద, సిడబ్ల్యుసి చైర్మన్, డీఈవో, ఏ ఎల్ ఓ, డిసిపిఓ లు ప్రారంభించారని వివరించారు. మహబూబ్ నగర్ జిల్లాలో మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, జెడ్పి సీఈవో వెంకట్ రెడ్డి లు ప్రారంభించారని చెప్పారు. గత 30 రోజుల్లో ఈ రథంసుమారు 7200 కిలోమీటర్లు ప్రయాణించిందని, 730 గ్రామాలను చేరుకుందని, దాదాపు ఎనిమిది లక్షల 80 వేల మంది ప్రజలను ఈ ఉద్యమంలో భాగస్వాములను చేసిందని ఆమె గుర్తు చేశారు. ప్రధాన రహదారులకే పరిమితం కాకుండా మోటార్ సైకిళ్లు, సైకిల్ యాత్రల ద్వారా మారుమూల తండాలకు, గ్రామాలకు కూడా సందేశాన్ని చేరవేసిందని అన్నారు. ఈ ప్రచారాన్ని అత్యంత శాస్త్రీయంగా మూడు దశల్లో నిర్వహించామని చెప్పారు. మొదటి దశలో విద్యాసంస్థల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడం, రెండవ దశలో మత పెద్దలు, వివాహ శుభకార్యాలతో సంబంధం ఉన్న కేటరర్లు, డెకరేటర్లు, బ్యాండ్ మేళం, కళ్యాణ మండప యజమానులను కలిసి వధూవరుల వయస్సు ధృవీకరించుకున్న తర్వాతే సేవలు అందించాలని కోరడం జరిగిందన్నారు. మూడవ దశలో గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధుల సమక్షంలో గ్రామస్థులను చైతన్యపరచడం, బాల్య వివాహం అనేది కేవలం సామాజిక దురాచారం మాత్రమే కాదని, అది చట్టం దృష్టిలో పసిబిడ్డపై జరిగే అత్యాచారమని, ఇది ఒక బాలిక ఎదుగుదలను చిదిమేసి ఆమెను అనారోగ్యం, నిరక్షరాస్యత, పేదరికంలోకి నెట్టివేస్తుందని వివరించినట్లు చిన్నమ్మ తామస్ పేర్కొన్నారు. మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ డిసెంబర్ 4, 2025న ప్రారంభించిన ఈ 100 రోజుల ప్రచారం ఇప్పుడు ప్రజా ఉద్యమంగా మారిందని, ప్రభుత్వ యంత్రాంగం, ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, సామాన్య ప్రజల మద్దతుతో 'బాల్య వివాహ రహిత జిల్లా' లక్ష్యాన్ని త్వరలోనే సాధిస్తామని చిన్నమ్మ తామస్ ధీమా వ్యక్తం చేశారు













## ఆటో రిపేర్ రంగంలో

# డిజిటల్ విప్లవం

భారతదేశంలో అతిపెద్ద డిజిటల్ ఎనేబుల్డ్ రిపేర్ షాప్ నెట్‌వర్క్ ఆటోరాక్స్.. ఆఫ్టర్‌మార్కెట్ ఎకోసిస్టమ్‌ను నిర్మించడానికి బూడ్మోతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా రిపేర్ షాపులు, స్పేర్ పార్ట్స్ క్యాటలాగ్‌లు, అమ్మకందారులు & ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లు అన్నీ ఒకే డిజిటల్ వ్యవస్థలో రియల్ టైమ్‌లో అనుసంధానిస్తుంది. ఆటోరాక్స్ ప్రస్తుతం భారతదేశంలో 2000కిపైగా వర్క్‌షాప్‌లతో దేశంలో అతిపెద్ద డిజిటల్ గ్యారేజ్ నెట్‌వర్క్‌గా ఉంది. ఇది ఇప్పటికే 40 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కాగా మరింత విస్తరణకు సిద్ధమవుతోంది. ఈ సంస్థ స్వతంత్ర గ్యారేజీలకు డీలర్‌షిప్ స్థాయి డిజిటల్ టూల్స్ అందించి వాటి పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతోంది. ఇప్పటి వరకు ఆటోమొబైల్ రిపేర్ రంగంలో చాలా టెక్నాలజీ మార్పులు వచ్చినప్పటికీ సరైన స్పేర్ పార్ట్‌ను కనుగొనడం అనే దశలో మాత్రం చాలా సమస్యలు ఉండేవి. టెక్నీషియన్లు పని మధ్యలో ఆపి వేరే సిస్టమ్‌లలో పార్ట్స్ వివరాలు చూసుకోవాల్సి వచ్చేది. దీని వల్ల సమయం వృథా కావడం, తప్పులు జరిగే అవకాశం పెరగడం వంటి సమస్యలు ఉండేవి. ఈ సమస్యను పరిష్కరించడానికి ఆటోరాక్స్ మరియు బూడ్మో కలిసి పనిచేస్తున్నాయి. దీంతో రిపేర్ ఆర్డర్ ఒక సాధారణ డాక్యుమెంట్‌గా కాకుండా.. డయాగ్నోసిస్, పార్ట్స్ కనుగొనడం, కొనుగోలు ప్రక్రియలను కలిపే ఒక తెలివైన డిజిటల్ హబ్‌గా మారుతుంది.



# రెండు రోజుల నష్టాలకు బ్రేక్

## ట్రంప్ వ్యాఖ్యలతో మార్కెట్లకు జోష్.. లాభాల్లో ముగిసిన మార్కెట్లు

### ఇరాన్ యుద్ధం త్వరలో ముగియవచ్చన్న ట్రంప్ వ్యాఖ్యలతో సానుకూల సంకేతాలు

### 640 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్, 233 పాయింట్లు పెరిగిన నిఫ్టీ

రెండు రోజుల వరుస నష్టాలకు తెరదించుతూ మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగియవచ్చంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. దీంతో అంతర్జాతీయంగా ఆందోళనలు తగ్గడంతో కొనుగోళ్లకు మద్దతు లభించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 639.82 పాయింట్లు పెరిగి 78,205.98 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 233.5 పాయింట్లు లాభపడి 24,261.6 వద్ద ముగిసింది. ఇరాన్‌తో వివాదం కారణంగా గత కొన్ని రోజులుగా అంతర్జాతీయ మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యాయి. అయితే, ఈ వివాదం త్వరలోనే పరిష్కారమవుతుందని ట్రంప్ సూచించడంతో గ్లోబల్ మార్కెట్లలో సానుకూల వాతావరణం నెలకొంది. ఈ పరిణామంతో అంతర్జాతీయ ముడిచమురు ధరలు కూడా దిగిరావడంతో మార్కెట్లకు కలిసొచ్చింది.

ట్రేడింగ్‌లో బెంచ్‌మార్క్ సూచీల కంటే బ్రాడర్ మార్కెట్లు మెరుగైన పనితీరు కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.62 శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.12 శాతం మేర లాభపడ్డాయి.




రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఆటో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. అయితే, నిఫ్టీ ఐటీ సూచీ అమ్మకాల ఒత్తిడికి గురైంది. ఆయిల్ అండ్ గ్యాస్ రంగం కూడా బలహీనంగానే కదలాడింది.

టెక్నికల్‌గా నిఫ్టీకి 24,300 వద్ద తక్షణ నిరోధం ఉందని, దానిని దాటితే 24,600 స్థాయికి చేరవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో, 24,000 స్థాయి కీలక మద్దతుగా పనిచేస్తుందని విశ్లేషకులు తెలిపారు. మధ్యప్రాచ్యంలోని పరిణామాలు, అంతర్జాతీయ ఆర్థిక సంకేతాలను బట్టి మార్కెట్ల భవిష్యత్ గమనం ఆధారపడి ఉంటుంది.


Crime News ది క్రైమ్ న్యూస్ తెలుగు దినపత్రిక


# ఇన్వెస్టర్లూ.. ఆందోళన వద్దు!

## సెబీ చైర్మన్ తుహిన్ కాంతా పాండే



రాజకీయ, భౌగోళిక సవాళ్లు ఎదురైనప్పుడు ఆందోళనకు లోనుకావద్దని క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్మన్ తుహిన్ కాంతా పాండే ఇన్వెస్టర్లకు సూచించారు. ప్రస్తుత పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో భయాలకు లోనుకాకుండా వ్యవహరించవలసిందిగా సలహా ఇచ్చారు. దేశీయంగా ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత సవాళ్లు సద్దుమణిగే వరకూ వేచిచూడమని సూచించారు. దీర్ఘకాలంలో ఎన్ఎస్ఈ ఇండెక్స్ నిఫ్టీ పటిష్టత కొనసాగుతుందని, తద్వారా భారత్ వృద్ధి అవకాశాలను ప్రతిబింబిస్తుందని తెలియజేశారు. ఎన్ఎస్ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ–50.. 30 వసంతాల వేడుక సందర్భంగా పాండే ఇన్వెస్టర్లకు పలు సూచనలు ఇచ్చారు.పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో దేశీయంగా స్టాక్ మార్కెట్లు అత్యధికస్థాయిలో హెచ్చుతగ్గులను చవిచూస్తున్నట్లు పేర్కొన్నారు. కీలక నౌకా మార్గాలలో ఎదురవుతున్న అవాంతరాల కారణంగా చమురు, గ్యాస్ సరఫరాలకు విఘాతం ఏర్పడుతున్నట్లు తెలియజేశారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ సరఫరాలమధ్య సమతౌల్యం దెబ్బతింటున్నట్లు వివరించారు.

# ఎఫ్‌డీఐల నిబంధనలు సరళతరం

## చైనా ఎఫ్‌డీఐలకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్!

భారత్‌తో సరిహద్దును పంచుకునే దేశాల నుంచి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చైనా సహా మిగిలిన అన్ని దేశాల ఎఫ్‌డీఐల విషయంలో ఉన్ననిబంధనలను సరళతరం చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ వార్తా సంస్థ పేర్కొంది. ఈ మేరకు ప్రధాని మోదీ నేతృత్వంలో మంగళవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాయి.

**ఎఫ్‌డీఐల నిబంధనలు కఠినతరం ఎందుకు?**

గల్వాన్ లోయలో 2020లో భారత్– చైనా సైనికుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ కారణంగా ఆ దేశంతో సంబంధాలు క్షీణించాయి. దీంతో టిక్ టాక్, వియ్‌చాట్ వంటి 200 యాప్‌లను భారత్ నిషేధించింది. ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ నుంచి వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలనూ భారత్ తిరస్కరించింది. ఆ దేశం నుంచి వచ్చే ఎఫ్‌డీఐల నిబంధనలనూ కఠినతరం చేసింది.



ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని 2020లో ప్రెస్ నోట్ 3ని ప్రభుత్వం జారీ చేసింది. భారత్‌తో సరిహద్దులను పంచుకునే దేశాలన్నింటికీ ఈ ప్రెస్ నోట్ 3 వర్తిస్తుందని తెలిపింది. చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భూటాన్, నేపాల్, మయన్మార్, అఫ్గానిస్థాన్ లాంటి దేశాలు ఇందులో ఉన్నాయి.

**రెండేళ్ల క్రితమే ప్రస్తావన**

ఎన్డీయే మూడోసారి అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే చైనా ఎఫ్‌డీఐల అంశం ప్రస్తావనకు వచ్చింది. 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో చైనా పెట్టుబడుల గురించి ప్రస్తావన ఉంది. చైనా ఎఫ్‌డీఐలతో దేశీయంగా తయారీని పెంచవచ్చని, తద్వారా ఇక్కడి నుంచి విదేశాలకు వస్తువులను ఎగుమతి చేయొచ్చని పేర్కొంది. అమెరికా, యూరప్‌లు చైనాకు ప్రత్యామ్నాయాన్ని చూస్తున్న వేళ.. ఆ ప్రయోజనాన్ని పొందొచ్చని పేర్కొంది. చైనా పెట్టుబడులను ఆహ్వానించి ఆ ఉత్పత్తులను ఎగుమతి చేయడం మెరుగైన ఆలోచనగా సర్వే అభిప్రాయపడింది. కాబట్టి చైనా ఎఫ్‌డీఐలను ప్రోత్సహించాలని పేర్కొంది. నిబంధనలు కఠినం కావడంతో చైనా నుంచి వచ్చే ఎఫ్‌డీఐలు తగ్గాయి. 2000 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబర్ మధ్య చైనా నుంచి కేవలం 2.51 బిలియన్ డాలర్ల పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. దేశంలోకి వచ్చే మొత్తం ఎఫ్‌డీఐల్లో చైనా 23వ స్థానంలో ఉంది.

## మినిమం బ్యాలెన్స్ చార్జీల రూపంలో

# రూ. 11 వేల కోట్లు వసూలు

కనీస నిల్వల నిబంధన పేరుతో ఖాతాదారుల నుంచి గడిచిన మూడేళ్లలో (2022–23 నుంచి 2024–25) ప్రైవేటు రంగ బ్యాంకులు రూ.11 వేల కోట్లు వసూలు చేసినట్లు కేంద్రం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఇదే కాలంలో ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.8వేల కోట్లు వసూలు చేసినట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌కు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రైవేటురంగ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా రూ.3800 కోట్లు ఛార్జీల రూపంలో ఖాతాదారుల నుంచి వసూలు చేసిందని మంత్రి తెలిపారు. యాక్సిస్ బ్యాంక్ రూ.2,700 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.1200 కోట్లు చొప్పున వసూలు చేశాయన్నారు.

ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ అత్యధికంగా రూ.1500 కోట్లు వసూలు చేయగా.. బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.1200 కోట్లు, ఇండియన్ బ్యాంక్ రూ.1100 కోట్లు చొప్పున వసూలు చేసినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు.




కనీస నిల్వలపై 2020 మార్చి నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛార్జీలు వసూలు చేయడం లేదు. పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్ కూడా గతేడాది నుంచి ఈ ఛార్జీలను తొలగించాయి. కరెంట్ ఖాతాల విషయంలో కొన్ని మార్పులు చేశాయి. ప్రైవేటు రంగ బ్యాంకులు మాత్రం ఇప్పటికీ కనీస నిల్వలు లేకపోతే ఛార్జీలు వసూలు చేస్తున్నాయి.

# ఎం.ఆర్.ఓ కార్యాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

- కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష







**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** నూతనంగా ప్రారంభించిన మండల రెవెన్యూ అధికారి కార్యాలయం ద్వారా మండల ప్రజలకు మెరుగైన సేవలు వేగవంతంగా అందాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కాల్వ శ్రీరాంపూర్ మండలంలో 75 లక్షల రూపాయల గ్రాంట్ నిధులతో నూతనంగా నిర్మించిన మండల రెవెన్యూ అధికారి కార్యాలయాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, అదనపు కలెక్టర్ డి.వేణు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కాల్వ శ్రీరాంపూర్ మండలంలో ఎం.ఆర్.ఓ కార్యాలయ నిర్మాణం చాలా రోజులుగా పెండింగ్‌లో ఉందని, 75 లక్షల రూపాయలతో అన్ని వసతులతో కూడిన నూతన తహసిల్దార్ కార్యాలయాన్ని నిర్మించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. నూతన కార్యాలయం నుంచి ప్రజలకు మెరుగైన సేవలు అందాలని, వారి సమస్యలు సత్వరపు పరిష్కారం అయ్యే దిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ గ్రామాలను క్లస్టర్ గా విభజించి ప్రతి క్లస్టర్ కు గ్రామ పరిపాలన అధికారి నియమించామని తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత డిస్పోజ్ చేయాల్సి ఉంటుందని , ప్రతి దరఖాస్తు వీలైనంత త్వరగా పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించే రెవెన్యూ శాఖకు మండలంలో మంచి కార్యాలయం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేస్తున్నట్లు తెలిపారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించామని, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షల పెంపు ,నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, రైతు రుణమాఫీ, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్, రైతు భరోసా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేద రైతులకు ఉన్న భూ హక్కుల సంరక్షణ కోసం భూ భారతి చట్టం ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ జగదీశ్వర్ రావు, ఎంపిడిఓ రామ్మోహన్ చారి, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రినిటీ డీగ్రీ కాలేజీ విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రామగుండం సి.పి ఆదేశాల మేరకు,పెద్దపెల్లి షీ టీమ్ వారు, గోదావరిఖని, మార్కండేయ కాలనీ లోని ట్రినిటీ డీగ్రీ కాలేజీ విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం ఇంచార్జ్ ఎస్ ఐ లావణ్య మాట్లాడుతూ మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలపై, యాంటీ డ్రగ్స్, అనగా డ్రగ్స్, అమ్మాయిలు అబ్బాయిలతో జాగ్రత్తగా ఉండాలని, సోషల్ మీడియా అనగా ఇన్స్టాగ్రామ్, స్నాప్చార్ట్ లాంటి అప్ లను వాడకుండా ఉండటం మంచిది అని తెలిపినారు.ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్, స్నేహలత, ప్రిన్సిపాల్ యుగేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా చదువుల తల్లి సావిత్రిబాయిపూలే 129వ వర్ధంతి వేడుకలు

- సమ్మక్క- సారక్క,చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి
- ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం




**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు ఎల్కపల్లి సురేష్ అధ్యక్షత వహించగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, సీనియర్ ఉపాధ్యాయురాలు శ్రీదేవి లు ముఖ్య అతిథిగా హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి, ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య అని, కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి,ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె, తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించిందని, కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారని ,నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసిందని. సమాజంలోని కులతత్వం, పురుషాధిక్య ధోరణులు కలిగిన చాలామంది పండిత మేధావులందరిని తరిమి కొట్టిందని,ఆమె ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి ని అని ఆయన అన్నారు.సమ్మక్క- సారక్క,చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని, మహిళలు వంటింటికే పరిమితం కాదని,ఇంటికి పట్టిన బూజును ఎట్లా దులుపుతారో,దేశానికి పట్టిన మతోన్మాదాన్ని అట్లా దులపాలని ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అనుప్ సాయి ,జశ్వంత్,అభిషేక్, చైత్ర, సాయి శరణ్య, అమీనా ,ప్రహర్షిని తదితరులు పాల్గొన్నారు.

# శుద్ధిత నీటి ప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం

- బాల వికాస మేనేజర్ మధుసూదన్ రెడ్డి




**రామగిరి, మార్చి 10(ది క్రైమ్ న్యూస్):-** బాలవికాస ఆధ్వర్యంలో మంథని నియోజక వర్గంలోని లద్నాపూర్, పుట్టపాక, ఖానాపూర్ గ్రామాల్లో గ్రామస్థాయి అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాల వికాస మేనేజర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... 80 శాతం రోగాలు నీటి ద్వారానే వస్తాయని, మంచి నీటిని తాగడం ద్వారా నీటి సంబంధమైన రోగాలను నియంత్రించ వచ్చాన్నారు. గ్రామంలో మంచినీటి సౌకర్యార్థం సుమారు 10 లక్షల రూపాయల వ్యాయంతో లద్నాపూర్, పుట్టపాక, ఖానాపూర్ గ్రామాల్లో గంటకు 500 లీటర్ల నీటిని ఉత్పత్తి చేసే శుద్ధిత నీటి ప్లాంట్ల ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రంలో పిఏసీఎస్ కొత్త శ్రీనివాస్, లోడి కోర్డినేటర్ మల్లేశం, బాలవికాస ప్రాజెక్ట్ కోర్డినేటర్ ప్రసూన్ రెడ్డి, బాలమోహన్ రెడ్డి,ఫీల్డ్ కోర్డినేటర్ కిషన్ , గ్రామల సర్పంచిలు వనం రామచంద్ర రావు , రాజాబాబు, మహిళా సమాఖ్య ప్రతినిధి మాదసి పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# లద్నాపూర్ రామాలయానికి కరెంట్ పునరుద్ధరణ

- లద్నాపూర్ సర్పంచ్ వనం రాంచందర్ చొరవతో



**రామగిరి, మార్చి 10(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం లద్నాపూర్ గ్రామంలోని శ్రీ రామాలయానికి మంగళవారం విద్యుత్ సరఫరాను అధికారులు తిరిగి పునరుద్ధరించారు. ఓసీపీ--టు విస్తరణలో భాగంగా లద్నాపూర్ గ్రామంలోని కొంత ప్రాంతాన్ని పునరావాస కేంద్రానికి తరలించడంతో అక్కడ విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. దీంతో రామాలయంలో కూడా కరెంట్ లేక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుడి తరలింపు పూర్తయ్యే వరకు ఆలయంలో విద్యుత్ సౌకర్యం కొనసాగించాలని గ్రామస్తులు సర్పంచ్ వనం రాంచందర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ నేపథ్యంలో సర్పంచ్ వనం రాంచందర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు గత వారం పునరావాస కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పునరావాస సమస్యలతో పాటు రామాలయం సమస్యను సంబంధిత అధికారులకు వివరించారు. దీనిపై స్పందించిన జీఎం త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఇచ్చిన హామీ మేరకు మంగళవారం సర్పంచ్ వనం రాంచందర్ సమక్షంలో అధికారులు రామాలయానికి విద్యుత్ సరఫరాను తిరిగి పునరుద్ధరించారు. దీంతో గ్రామస్తులు, భక్తులు ఆనందం వ్యక్తం చేస్తూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళా విద్యకు మార్గదర్శకురాలు సావిత్రిబాయి పూలే

- బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా వైస్ చైర్మెన్ కొండి సతీష్
- ఘనంగా సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మహిళా విద్యకు మార్గదర్శకురాలిగా, సమాజ సంస్కర్తగా చిరస్థాయిగా నిలిచిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే అని బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా వైస్ చైర్మెన్ కోండి సతీష్ అన్నారు. మహిళలు చదువుకుంటేనే సమాజాభివృద్ధి జరుగుతుందని సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి సందర్భంగా ఆమె ఫోటోకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిభాయి పూలే మహిళ విద్యకు తొలి దీపం వెలిగించిన మహానీయురాలు అని, మహిళలు, దళితులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి విశేషకృషి చేశారన్నారు. సమాజంలో ఉన్న కుల వివక్ష, బాల్య వివాహాలు, మహిళలపై జరిగే అన్యాయాలపై వ్యతిరేకంగా ఆమె పోరాడారని తెలిపారు. పుణెలో తొలి బాలికల పాఠశాల నెలకొల్పిన మహానీయురాలు అని కొనియాడారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్ళడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో కోమటిపల్లి రాజేందర్, సదానందం, కొండి దిలీప్, ధనుంజయ్, ఆడిపు సుధాకర్, మిట్టపల్లి శ్రీనివాస్, మాదాసు కృష్ణ శ్రీధర్, అభిలాష్, తరుణ్, రూపేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికీ మూడు రోజుల జైలు శిక్ష : రామగుండం ట్రాఫిక్ సిఐ



**రామగుండం కమిషనరేట్ (ది క్రైమ్ న్యూస్):** రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్ డ్రైవ్‌లో దొరికిన 17 మందిని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ గోదావరిఖని వెంకటేష్ దుర్వ ముందు హాజరుపరుచగా 15 మందికి 30,000 రూపాయల జరిమానా ఇద్దరికి రెండవసారి పట్టుబడగా మూడు రోజుల జైలు శిక్ష విధించారు. ఒక వ్యక్తి గోదావరిఖనిలో ఆటో డ్రైవర్ గా పనిచేస్తూ ఉన్నాడు, మరొక వ్యక్తి ఎన్టీపీసీ పవర్ ప్లాంట్ లో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు.వీరిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించడం జరిగింది. సీఐ మాట్లాడుతూ వాహనం మద్యం తాగి వాహనం నడప రాదని నడిపినచో వారిపై చట్టరీత్యా చర్య తీసుకోవడం జరుగుతుంది మరియు వాహనానికి సంబంధించిన పత్రములు మరియు టూ వీలర్ వెహికల్స్ నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సిఐ బి రాజేశ్వరరావు తెలియజేయడం జరిగింది.

# రాజీవ్ యువ వికాసం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు

- రాష్ట్ర బడ్జెట్లో వెంటనే నిధులు కేటాయించాలి డివైఎఫ్ఐ గోదావరిఖని పట్టణ కమిటీ డిమాండ్




**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని వెంటనే అమలు చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ గోదావరిఖని పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సోమవారం రోజు గోదావరిఖని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కార్యదర్శి కొంటుసాగర్ పట్టణ కార్యదర్శి అట్ల శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో భాగంగా యువతకు రాజీవ్ యువ వికాసం ద్వారా స్వయం ఉపాధి పొందెందుకై ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగుల నుండి భారీ ఎత్తున దరఖాస్తులు తీసుకోవడం జరిగింది అది కేవలం ఇప్పటివరకు కాగితాలకే పరిమితమైంది తప్ప రాజీవ్ యువ వికాసం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లబ్ధి పొందిన ఏ ఒక్క యువత కూడా లేదని వారికి సందర్భంగా గుర్తు చేశారు ఎంతో మంది ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంటెక్ పూర్తి చేసిన నిరుద్యోగులు వారు స్వయంగా వారి కాళ్లపై నిలబడటానికి ప్రభుత్వం ఒక అవకాశం కల్పించడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన ఆ ఆనందం ఆవిరి అయిపోయిందని ఇప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది నిరుద్యోగ యువత కుటుంబ పోషణకై చాలీచాలని జీతాలకు ప్రైవేటు కంపెనీలలో పరిశ్రమలలో వెట్టి చాకిరి చేస్తున్నారని గుర్తు చేశారు అంతేకాకుండా రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా వందల రూపాయలు నిరుద్యోగులకు ఖర్చు చేశారే తప్ప ఒక్కరికి కూడా ఇప్పటివరకు లబ్ధి చేకూరలేదని వారు మండిపడ్డారు. కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్ర బడ్జెట్లో యువతకు వారి స్వయం ఉపాధి కల్పనకై అత్యధికంగా నిధులు కేటాయించాలని వారి సందర్భంగా డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గుండబోయిన శ్రీనివాస్ యాదవ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ ..

**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో స్థానిక సర్పంచ్ ఓరుగల అరుణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 41 మెంబర్స్ కి పరీక్ష సామాగ్రి ప్యాడ్ పెన్ను స్కేలు తదితర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అందరూ 100% ఉత్తీర్ణత సాధించాలని కోరారు.అనంతరం పాఠశాల ఎస్ ఓ మీనాక్షి సర్పంచ్ గారిని శాలువాతో సత్కరించారు ..ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు పెగడపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, డైరెక్టర్లు చాట్ల విజయభాస్కర్, చెట్ల కిషన్, మండల నాయకులు బండారి శ్రీనివాస్, మల్యాల ఎల్లయ్య, గంద్ర శ్రీనివాస్ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# "హమాలి మహా గర్జన"ను విజయవంతం చేయండి

## ● మున్సిపల్ చైర్మన్ మల్లన్నతో కలిసి మహాసభల పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే విజయరమణారావు

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 15న హనుమకొండలో నిర్వహించనున్న "హమాలి మహా గర్జన" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లన్న తో కలిసి మంగళవారం మహా సభల పోస్టర్ ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కా నిండని కాయ కష్టం చేసే హమాలీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హమాలి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులు సంక్షేమం కోసం ఈ మహా గర్జన కార్యక్రమం ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు అయితే ప్రభుత్వం నుంచి అందుకు తగిన నిధులు సమకూర్చినట్లయితే హమాలీల కుటుంబాలకు ఆసరాగా ఉంటుందని, హమాలీలకు తగిన వేతనాలు, భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. హమాలి కార్మికుల జీవన పరిస్థితులు మెరుగుపడాలంటే కార్మికులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. మార్చ్ 15వ తేదీన పెద్దపల్లి జిల్లాలోని హమాలి కార్మికులు, యూనియన్ లకు, పార్టీలకు అతీతంగా హమాలీ పని చేసే ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా హనుమకొండ పట్టణంలోని కాళోజి కళాక్షేత్రం హయగ్రీవ చారి గ్రౌండ్ కు



తరలి వెళ్లి హమాలి మహా గర్జన కార్యక్రమాన్ని ఘన విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నేడి వెంకట్ రెడ్డి, సంఘం లీగల్ అడ్వైజర్, కార్మిక నాయకులు, ఏ జి పి, ఉప్పు రాజన్న, జిల్లా బాధ్యులు జంగా సంపత్ యాదవ్, కొమ్ము భూమయ్య, కొలిపాక సదయ్య, శంకర్, ప్రభాకర్ హమాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ లాభం కోసం రసమయిపై విమర్శలు సరైనవి కావు

## ● ఫ్యాక్టరీ నుండి డబ్బుల డిమాండ్ పై చర్చకు సిద్ధం: లింగాల లక్ష్మణ్

**బెజ్జంకి,మార్చి10(ది క్రైమ్ న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలకేంద్రంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపీపీ లింగాల నిర్మలా- లక్ష్మణ్ మాట్లాడుతూ... మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పై కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారంటూ విమర్శించారు. ఇతనాల్ ఫ్యాక్టరీ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటూ బీఆర్ఎస్ నాయకులపై ఆరోపణలు చేయడమే కాక సోమవారం నిర్వహించిన ప్రెస్ మీట్ లో రసమయిపై చేసిన విమర్శలు కొంతమంది కాంగ్రెస్ నాయకుల స్థాయికి తగవంటూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో దృష్టి సారించాలని నాయకులకు సూచించారు. మండలంలో రహదారుల నిర్మాణం, మార్కెట్ నిర్మాణం, దేవాలయాల అభివృద్ధి వంటి పనులు రసమయి ఆధ్వర్యంలోనే జరిగాయని, నరసింహస్వామి దేవాలయ అభివృద్ధిలో రసమయి పాత్ర ఉందని గుర్తు చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంపై తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులే ఫ్యాక్టరీ నుండి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలున్నాయని, నిజానిజాలు వెలుగులోకి వచ్చేవరకు చర్చకు



సిద్ధమన్నారు.అభివృద్ధిపై కాక రాజకీయ లాభాల కోసం విమర్శలు చేయడం సరైంది కాదని, ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజా ఉద్యమాలు కూడా చేపడతామని కాంగ్రెస్ శ్రేణులను లింగాల నిర్మలా- లక్ష్మణ్ హెచ్చరించారు. నాయకులు కనగండ్ల తిరుపతి, బొల్లం శ్రీధర్, కచ్చు రాజయ్య, దుంబాల రాజమహేంద్ర రెడ్డి, కొమిరె మల్లేశం గౌడ్, గుబీరె మల్లేశం, బోయినపల్లి శ్రీనివాస రావు, బండారి రాములు, కవ్వంపల్లి శ్రీనివాస్, బండి రమేష్, వంగల నరేష్, బిఆర్ఎస్ యువజన నాయకులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# తుపాకీ రాముడు మాయమయ్యాడా.. రూపం మార్చుకున్నా(డు)డా ?

- అంతరించిపోతున్న అరుదైన కళ
- పల్లెల్లో కనిపించని పిట్టలదొర
- ఖాకీ చొక్కా తీసి.. ఖద్దరేశా(డు )డా?
- బడాయి మాటల తుపాకీ రాముడి రాజకీయ రంగ

ప్రవేశంపై ది క్రైమ్ న్యూస్ అందిస్తున్న ప్రత్యేక కథనం....




**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** తుపాకీ రాముడు మాయమయ్యాడా లేక రూపం మార్చుకుని రాజకీయాల్లోకి వచ్చాడా? అనేది ఇప్పుడు కొంతమంది ఆలోచన పరులు అడుగుతున్న ప్రశ్న. పల్లె వీధుల్లో ఖాకీ చొక్కా.. చేతిలో కట్టె తుపాకి.. నెత్తి మీద కౌబాయ్ టోపీ.. తూట్లు పడ్డ బూట్లు.. నోటి నుండి పేలే బడాయి మాటల తూటాలతో తుపాకీ రాముడు కనిపిస్తే చాలు పిల్లలు గుంపులు గుంపులుగా వెంబడించే వాళ్ళు. పెద్దలు కూడా పనులు మానేసి అతని కథలు వినేవాడు. ఎందుకంటే అతని మాటల్లో నిజం లేకపోయినా... నవ్వుల పువ్వులు మాత్రం పుష్కలంగా విరబూసేవి.

అమీన్ సాబ్ తుపాకీ నా తుపాకీ పోటీ పెట్టుకుని.. చెరువులేసినం... అమీన్సాబ్ తుపాకీ మునిగింది... నా తుపాకీ తూముల తేలింది! అని చెప్పి ఊరంతా నవ్వించేవాడు. ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులు పెద్ద పెద్ద దేశాల నాయకులందరూ నన్ను కలవడానికి లైన్లు కడుతున్నారు. నా అపాయింట్మెంట్ దొరకక అలిగిపోతాంద్రు. ఇట్లా ఊర్లు తిరిగే పని మీద టైం లేదని చెప్తున్న. తన ఇంట్లో బోలెడంత బంగారం ఉన్నట్టు... కావలి కట్టేలెక్క బక్కగున్న తన ఇంటామె మొయ్యలేదని బంగారాన్నంతా పెంట మీద వారేస్తే పందికొక్కులు పర్ర పర్ర నమిలి మింగాయని బడాయి మాటలతో అందరినీ అలరించేది. తన ఇంటి కాడ ఉన్న కోడి పిల్లలకు నూకలు కొనడానికి ఇలా ఇంటింటికి తిరిగి పది రూపాయలు అడుక్కుంటున్నానే కానీ నాకు ఆస్తులకు ఏం కొదవ లేదంటాడు. అతని దగ్గర పది రూపాయలు కూడా ఉండవని అందరికీ తెలుసు కానీ మాటల్లో మాత్రం అతను కోట్లాది సంపదకు యజమాని. ఎవరికైనా అవలీలగా లక్షల చెక్కు రాసిచ్చే కోటీశ్వరుడు. అప్పట్లో ఇది ఒక వినోదం... పల్లెటూరి సరదా. కానీ కాలక్రమేన ఈ రూపం పల్లెలో కనబడకుండా పోతున్నది.

నిజంగా తుపాకీ రాముడు మాయమయ్యాడా లేక రూపం మార్చుకుని తిరుగుతున్నాడా? అంటే అతన్ని మించిన బడాయి మాటలతో ఖాకి చొక్కాకు బదులు ఖద్దరు చొక్కా వేసుకున్న తుపాకీ రాముళ్లు మన మధ్య తిరుగుతున్నారని అంటున్నారు కొందరు మేధావులు.

మీ జీవితాలు మార్చేస్తాం... పేదరికాన్ని పోగొడతాం.. ప్రతి ఇంటికి సంపద తీసుకొస్తాం.. అంటూ కల్లబొల్లి హామీలతో ఖద్దర్ చొక్కా తుపాకీ రాముడు రాజకీయ రంగప్రవేశం చేశాడు అంటున్నారు. అతను నవ్విస్తే వీళ్లు ఆశల పల్లకిలో ఊరేగిస్తున్నారు.

తుపాకీ రాముడు ఇల్లిల్లు తిరిగి పది రూపాయలు అడుక్కుంటే... ఖద్దర్ చొక్కా రాముళ్లు కాళ్ళు మొక్కి ఓట్లు అడుగుతున్నారు. అతని చేతిలో కట్టే తుపాకి ఉంటే... వీళ్ళ చేతిలో మైకు ఉంది అంతే. అతని కథలకు ప్రజలు నవ్వుకుంటే వీళ్ళ కథలకు జనాల బతుకులు నాశనం అవుతున్నాయి.

అందుకే ఇప్పుడు పల్లెల్లో కొందరు పెద్దలు ఒక మాట అంటున్నారు... తుపాకీ రాముడు అంతరించిపోవడం లేదు... ఖాకి చొక్క తీసేసి ఖద్దరు చొక్క వేసుకున్నాడు అంతే. ఇదంతా గమనిస్తున్న అసలు తుపాకీ రాముడు నా వారసులు రాజకీయంలో రాటుదలుతున్నారు అని నవ్వుకుంటూ ఉండొచ్చు.

# భక్తుల రద్దీ దృష్ట్యా స్పెషల్ రైళ్ల పొడిగింపుకు విజ్ఞప్తి

## - రైల్వే అధికారులను కోరిన నార్త్ తెలంగాణ రైల్వే ఫోరం



**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** తిరుమల వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నాందేడ్-తిరుపతి రైళ్లను మరో ఏడాది పాటు పొడిగించాలని నాత తెలంగాణ రైల్వే పోరం ప్రధాన కార్యదర్శి కలవేని శ్రీనివాస్ రైల్వే అధికారులను కోరారు. నాందేడ్ నుంచి బాసర, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి మార్గం నుండి నడుస్తున్న 07515/6 మరియు 07189/90 ప్రత్యేక రైళ్లు ప్రస్తుతం ఈనెలాఖరు వరకే నడుస్తున్న నేపథ్యంలో వాటి సేవలను కొనసాగించాలని ట్విట్టర్ ద్వారా రైల్వే శాఖకు విజ్ఞప్తి చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లు ఉత్తర తెలంగాణ ప్రజలకు తిరుమల యాత్రకు ఎంతో సౌకర్యంగా మారాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ రైళ్లకు భారీగా డిమాండ్ ఉండడంతో వచ్చే రెండు నెలల ముందస్తు రిజర్వేషన్లు కూడా అందుబాటులో లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రత్యేకంగా బాసర, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ప్రాంతాల నుంచి తిరుమల వెళ్లే భక్తులకు ఈ రైళ్లు ప్రధాన ఆధారంగా మారాయని, అత్యంత అనుకూలంగా ఉన్నాయని అందువల్ల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైల్వే అధికారులు వెంటనే స్పందించి ఈ స్పెషల్ రైళ్ళను మరో ఏడాది పాటు కొనసాగించాలని నార్త్ తెలంగాణ రైల్వే ఫోరం కోరింది. ఈ విషయంపై రైల్వే ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకుంటే ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని కలవేని శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

## - మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శనిగరపు మల్లేశం, రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నూరి బాబు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పెద్దపల్లి జిల్లా బృందం జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శనిగరపు మల్లేశం, రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నూరి బాబు మాట్లాడుతూ ప్రభుత్వం నెరవేర్చాల్సిన పలు డిమాండ్లను స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి అర్హులైన కుటుంబానికి మూడు ఎకరాల సాగు భూమి ఇవ్వాలని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చి పూర్తి హక్కులు కల్పించాలని కోరారు. విద్యా హక్కు చట్టం ప్రకారం కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం ఉచిత విద్యను అమలు చేయాలని, ఎస్సీ కార్పొరేషన్ శాఖకు 15 వేల కోట్ల నిధులు కేటాయించి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో వైకుంఠధామాలు, కబరస్థానాల పేరుతో దళితుల నుంచి సేకరించిన అసైన్డ్ భూములను తిరిగి వారికి అప్పగించాలని వారు కోరారు. పారిశుద్ధ్య కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి 20 వేల వేతనం అందించాలని, తోళ్ల పరిశ్రమల శాఖకు 10 వేల కోట్ల నిధులు కేటాయించి మాదిగ యువతకు ఉపాధి కల్పించాలని వారు విన్నవించారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పెద్దపల్లి జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నల్లగొండ నరసింహన్న జాతర హుండీ లెక్కింపు

## - జాతర విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు...:
## - ఆలయ చైర్మన్ బండారిపెల్లి లక్ష్మణ్ గౌడ్





**తిమ్మాపూర్, మార్చి10(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నల్లగొండలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో జాతర హుండీ లెక్కింపును అలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.అనంతరం అలయ చైర్మన్ బండారిపెల్లి లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ.... గత నెల 27 నుండి ఈనెల 6వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించిన స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు జాతర హుండీనీ లెక్కించడం జరిగిందన్నారు. వెండి,బంగారం కానుకల రూపంలో రాగా, నగదు రూపంలో హుండీ ద్వారా 8,61,681,టెండర్ ద్వారా 6,64,666, టిక్కెట్ల ద్వారా 2,36,176 మొత్తం కలిపి 17,62,523రూపాయల ఆదాయం వచ్చి,గతేడాది కంటే ఈసారి 80వేలు అధిక ఆదాయం సమకూరినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల కంటే ముందే దాతల సహకారం 25లక్షలతో రాజగోపురం, యాగశాల,స్టీల్ బారుల ఏర్పాటుతో ఆలయాన్ని అభివృద్ధి చేసి స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సహకారంతో జాతరను ఘనంగా నిర్వహించామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పంచాయతీ పాలకవర్గంతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, నాయకులు పూర్తిగా సహకరించడంతో జాతర విజయవంతంమైందని దీనికి ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.ఆలయ ఈఓ నాగుల అనీల్ కుమార్, డివిజన్ ఇన్స్పెక్టర్ పి.సత్యనారాయణ,ఆలయ డైరెక్టర్లు గాజుల అంజయ్య,బూత్కూరి శ్రీనివాస్, కందుకూరి లక్ష్మీ రాజం,జింక శ్రీనివాస్, కవ్వంపల్లి మహేష్,గోలి లక్ష్మీ నర్సయ్య, స్వామివారి సేవకుడు మార్క రాములు గౌడ్ తదితరులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.ద

# నీరా కేఫ్ నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

## - మంథని ఎక్సైజ్ అధికారి రాకేష్



**రామగిరి, మార్చ్ 10(ది క్రైమ్ న్యూస్):-** హైదరాబాదులో గల నీరాకేఫ్ రెండు సంవత్సరాల పాటు నిర్వహించడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు మంథని ఎక్సైజ్ అధికారి రాకేష్ మంగళవారం ఒక ప్రకటనలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విధివిధానాలను వివరించారు. గీత పారిశ్రామిక సంఘాల నుంచి టెండర్ ఆహ్వానించడమైనదని, అట్టి టెండర్కు రూ. 1, 000 లు ఎండి టీజీ టిఓడిడివై టాపర్స్ సిఓ ఓపి ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ హైదరాబాద్ (నీరాక్ కేఫ్) పేరిట డిడి తీయాలని సూచించారు. ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సర్టిఫికెట్, లైసెన్స్, కుల ధ్రువీకరణ పత్రం, ఐడి ప్రూఫ్, ఈ ఎండి రూ. రెండు లక్షలు, సొసైటీ తీర్మానం చేసిన లెటర్, అవసరం ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు బిడ్ ఎందు పాల్గొనవచ్చు అని సూచించారు. బిడ్ ఫైలింగ్ చివరి తేదీ ఈ నెల 18, ఓపెన్ చేసే తేదీ ఈ నెల 28 వివరించారు. మరింత సమాచారం కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. టీజీటీసిఎఫ్సి . కామ్ వెబ్సైట్ యందు, దగ్గరలోని ఎక్సైజ్ స్టేషన్ యందు సంప్రదించగలరని సూచించారు.

# చెత్త రహిత మంథనిగా తీర్చి దిద్దుతాం

## - మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్





**రామగిరి,మార్చి10 (ది క్రైమ్ న్యూస్):-** పదవి బాధ్యతలు స్వీకరించిన నెల రోజుల్లోపు మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ ప్రజాభిమానాన్ని చూరగొరుతున్నారు. మంగళవారం మంథని పట్టణం జూనియర్ కళాశాల మైదానంలో పారిశుధ్య పనులు స్వయంగా పర్యవేక్షించారు. మంథని మున్సిపాలిటీని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ వెల్లడించారు. ప్రజా ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రామంలో మున్సిపల్ సిబ్బందితో చెత్త ఎరివేసి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ.... మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మంథని మున్సిపల్ ను రాష్ట్రంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నటువంటి ఈ 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం ద్వారా మున్సిపల్ పరిధిలోని 13 వార్డుల్లో ఉన్న అన్ని ప్రాంతాల్లోనే రోడ్లను డ్రైనేజీలను సంపూర్ణంగా శుభ్రం చేస్తామన్నారు దోమల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు పారిశుధ్య కార్యక్రమానికి పరిసరాల పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు అన్ని వార్డుల్లో స్ట్రీట్ లైన్లను అప్డేట్ చేస్తామన్నారు మున్సిపల్ పరంగా చేపట్టే ఈ కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు పట్టణాన్ని అన్య రంగాల్లో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కుర్ర లింగయ్య, ఎల్లంకి వంశీ, వాకర్స్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు

## ◆ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతంగా లాప్రోస్కోపిక్ సర్జరీలు

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయి. బొశీపల్లి కి చెందిన 30 సంవత్సరాల మహిళ తీవ్రమైన కుడివైపు కడుపునొప్పితో బాధపడుతూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేసుకోగా గాల్ బ్లాడర్ నెక్ లో స్టోన్ ఉందని వైద్యులు నిర్ధారణ చేశారు. అదే విధంగా మంచిర్యాలకు చెందిన 40 సంవత్సరాల వ్యక్తి కుడివైపు కడుపు నొప్పితో బాధపడుతూ నెల క్రితం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేసుకోగా గాల్ బ్లాడర్ నెక్ లో స్టోన్ మరియు ఇన్ఫెక్షన్ ఉందని నిర్ధారణ చేసి ఇన్ఫెక్షన్ తగ్గడం కోసం 3 వారాలు మందులు ఇవ్వడం జరిగింది. ఇన్ఫెక్షన్ తగ్గిన తరువాత మంగళవారం నాడు ఇద్దరు పేషెంట్ లకు అధునాతన పద్ధతిలో లాప్రోస్కోపిక్ కోలిసిస్టెక్టమీ ఆపరేషన్ ను విజయవంతంగా నిర్వహించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన 33 సంవత్సరాల మహిళ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేసుకోగా గర్భాశయం రెండు భాగాలుగా ఉండడం గమనించారు. ఒక భాగం లో మరియు అటు వైపు గర్భాశయ నాళం(ట్యూబ్/ఫెలోపియన్ ట్యూబ్) లో ఎన్డోమెట్రియోసిస్ అనే వ్యాధి ఉందని గుర్తించి చెడిపోయిన భాగాన్ని తొలగించడం జరిగింది.ఇట్టి సర్జరీల లో పాల్గొన్న వైద్యుల బృందం లాప్రోస్కోప్ సర్జన్ డాక్టర్ అమర సింహా రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ స్వాతి, డాక్టర్ రామమం, డాక్టర్ భవాని. ఈ మూడు సర్జరీలు చేసిన వైద్య బృందాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న నవజాత శిశు కేంద్రం సేవలు, 2 డి ఎకో సేవలు, ఆధునిక పరిజ్ఞానంతో కూడిన లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు, యూరాలజీ సేవలు మరియు రూట్ కెనాల్ సేవలను ప్రజలు



ఉపయోగించుకోవాలని, ఈ సేవలలో ఏవైనా ఇబ్బందులు ఎదురైన సందర్భంలో నేరుగా సూపరింటెండెంట్ గారిని కలవచ్చని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ తెలియజేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలందరికీ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. పేషెంట్ హాస్పిటల్ లో ఉన్న సమయం లో సానిటేషన్ గురించి గాని, వాష్ రూమ్ శుభ్రత గురించి గాని ఎవరైనా డబ్బులు అడిగినా గాని మరియు ఏ ఇతర సమస్య ఉన్నా కూడా నర్సింగ్ సూపరింటెండెంట్ ను, ఆర్ ఎం ఓ, ను నేరుగా సంప్రదించవచ్చునని లేదా ఆస్పత్రిలోని ఫిర్యాదుల కంప్లైంట్ బాక్సులో సైతం ఫిర్యాదు చేయవచ్చని తెలియజేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం

## ◆ ప్రజా ప్రభుత్వంలోనే రైతులకు మేలు ◆ రైతులకు రోటోవేటర్లు, గడ్డి కట్టలు కట్టే యంత్రాలను పంపిణి చేసిన స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రైతులకు ఎనలేని మేలు చేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వమని స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పేర్కొన్నారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మంగళవారం రోజున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లి నియోజకవర్గంలోని 63 మంది లబ్ధిదారులకు 1 కోటి 11 లక్షల రూపాయల విలువ గల వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు రోటోవేటర్లు, గడ్డి కట్టలు కట్టే యంత్రాలను మంగళవారం స్థానిక శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోటి 11 లక్షల రూపాయల సబ్సిడీతో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. రాబోవు రోజుల్లో రైతులకు ఇబ్బంది రాకుండా అనుభవాన్ని రంగరించి కార్యక్రమాలు నడిపిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎండగట్టింది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు వ్యవసాయ యాంత్రికరణ పనిముట్ల పంపిణీ



కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. రైతులు నానో యూరియా, నానో డిఏపి, నానో పొటాష్ వాడాలని సూచించారు. అలాగే కేజీ వీల్స్ ట్రాక్టర్లతో రోడ్లు నాశనం అవుతున్నాయని అన్నారు. కేజీ వీల్స్ కు పట్టీలు పెట్టుకోవాలని సూచించారు. రోడ్డుపై కేజీ వీల్స్ తో నడిచే ట్రాక్టర్లకు మొదటిసారి 5 వేల రూపాయలు, రెండవసారి పదివేల రూపాయలు జరిమాన, మూడవసారి కేసు నమోదు చేయడం, బండిని సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, డి ఎ వో శ్రీనివాస్, ఎ డి ఈ శ్రీనాథ్, మార్కెట్





చైర్మన్లు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్ లు, ఎ.వో లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" పై కరువైన అధికారుల పర్యవేక్షణ ..

**◆ ఒక్కరికే.... నాలుగు బాధ్యతలు ◆ రెండు మండలాలు.. ◆ ఇక పరిపాలన కొనసాగేదెలా...? ◆ కొనసాగుతున్న 99 రోజుల ప్రభుత్వ "యాక్షన్ ప్లాన్".. - బుగ్గారం మండలంపై ఉన్నతాధికారులకు ఎందుకు ఇంత చిన్న చూపు.. ◆ ఉన్నతాధికారుల చేతివాటం కోసమేనా...? ఈ "అదనపు బాధ్యతలు" ◆ అయ్యా...... మంత్రి వర్యా.....! ఒక్క చూపు చూడవయ్యా...!! ◆ బుగ్గారం మండల ప్రజల ఆవేదన..**

**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సుమారు గత 40 రోజుల నుండి ఇంచార్జ్ ఎంపివో గా కొనసాగుతున్న వాసవి (జగిత్యాల అర్బన్ ఎంపివో, జగిత్యాల అర్బన్ ఇంచార్జి ఎంపిడివో ) కు అదనంగా బుగ్గారం ఎంపిడివో గా మంగళ వారం బాధ్యతలు అప్పగించారు. ఒక్కరికే నాలుగు పదవులు కట్టబెట్టడం చర్చనీయంగా మారింది. ఉన్నతాధికారుల చేతివాటం కోసమేనా...? ఈ అదనపు బాధ్యతలు అనే "పుకార్లు" కూడా జిల్లా వ్యాప్తంగా "షికార్లు" చేస్తున్నాయి. అందులో ఒక "మహిళా అధికారిణి కి" 20 కిలో మీటర్ల దూరం గల రెండు వేర్వేరు మండలాలకు బాధ్యతలు అప్పగించడం, అందులో ఒక్కరికే నాలుగు పదవులు కట్టబెట్టడం ఉన్నతాధికారులకు తగునా....? అని జిల్లా ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. గతంలో ఇక్కడ పని చేసి పదవీ విరమణ పొందిన అధికారి ఒక్కరు, బదిలీపై వెళ్లిన మరి కొందరు ఉన్నతాధికారుల అండదండలతో..., చేతి వాటాలతో.... అవినీతి - అక్రమాలకు పాల్పడి మండలంలో పాలనా వ్యవస్థను నాశనం చేసి వెళ్లారని ఆరోపణలు కోకొల్లలుగా ఉన్నాయి. అనేక ఆరోపణలతో రాష్ట్ర స్థాయి పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయాలలో, సెక్రెటరియేట్ లో మండల అధికారులపై, జిల్లా ఉన్నతాధికారులపై కూడా పలు పిర్యాదులు విచారణలో ఉన్నాయి. ఇప్పటికే సమాచార కమీషన్ లో, న్యాయ స్థానాలలో కూడా పలు కేసులు కొనసాగుతున్నాయి. ఇలాంటి తరుణంలో జగిత్యాల అర్బన్ ఎంపివో, జగిత్యాల అర్బన్ ఇంచార్జ్ ఎంపిడివో గా కొనసాగుతున్న వాసవి కి అదనంగా బుగ్గారం మండల ఎంపివో గా, ఇంచార్జ్ ఎంపిడివో గా కూడా అదనంగా మరో రెండు బాధ్యతలు అప్పగించడంలో అంతర్యం ఏమిటని యావత్ జిల్లా ప్రజానీకం, జిల్లాలోని ఇతర అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు కూడా అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ తో "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కొనసాగుతున్న సమయంలోనే నూతన ఎంపిడివో లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఎంపిడివో గా కొనసాగుతున్న సుమంత్ శిక్షణ కు వెళ్లడం పట్ల ఇంచార్జ్ ఎంపివో కు మరో అదనపు బాధ్యతను ఇంచార్జ్ ఎంపిడివో గా కూడా కట్ట బెట్టారు. జగిత్యాల అర్బన్ ఎంపివో గా ఉన్న "వాసవి" కి ఇంచార్జ్ గా జగిత్యాల అర్బన్ ఎంపిడివో, బుగ్గారం ఎంపివో, ఎంపిడివో గా నాలుగు బాధ్యతలు అప్పగిస్తే ఇక పరిపాలన ఎలా...? కొనసాగుతుందోనని ప్రజలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో నుండి కూడా బుగ్గారం మండలంపై ఉన్నతాధికారులకు ఎందుకు ఇంత చిన్న చూపు అని మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలనే కొద్ది - గొప్ప నిధులు గ్రామ పంచాయతీలకు విడుదల కావడం జరిగింది. ఆ నిధుల ద్వారానే పెండింగ్ బిల్లులు క్లియర్ చేసి ప్రస్తుత కార్యక్రమాలలో, ప్రజా పాలనలో ఖర్చులు చేయాల్సి ఉంటుంది. ఆ బిల్లుల చెల్లింపుల కార్యకలాపాలు అన్నీ ఈ అధికారులే చూసుకోవాలి. బిల్లుల చెల్లింపులకు అప్రూవల్ ఇవ్వాలి. అధికారులు - ఉన్నతాధికారులు వారి చేతి వాటాల కోసమే ఇలా ఇంచార్జ్ లుగా వారికి అనుకూలంగా ఉన్నవారికే జిల్లాలో ఒక్కొక్కరికి రెండు - మూడు - నాలుగు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారేమో...? అనే అనుమానాలు కూడా ప్రజల్లో, ప్రజా ప్రతినిధుల్లో, పంచాయతీ రాజ్ శాఖ లో పని చేసే ఇతర అధికారులకు, సిబ్బందికి కలుగుతున్నట్లు సమాచారం. అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకునే అధికారులే కరువయ్యారని బుగ్గారం మండల ప్రజలు మండి పడుతున్నారు. నిధులు సరిగా లేక శానిటేషన్ సక్రమంగా లేదని, అధికమైన దోమల సమస్యతో ప్రజలు అనారోగ్యాల పాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు, డ్రైనేజీ లు కూడా సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని బుగ్గారం మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అయ్యా...... మంత్రి వర్యా.....! ఒక్క చూపు చూడవయ్యా...!! ఈ ప్రాంత ఎమ్మెల్యే గా, తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రిగా కొనసాగుతున్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వయంగా పర్యవేక్షించి బుగ్గారం మండలం పై జిల్లా ఉన్నతాధికారుల చిన్నచూపు, ఇంచార్జ్ ఎంపివో, ఎంపిడివో పదవులపై జేర్రంత కన్నేసి పూర్తి స్థాయి అధికారులను శాశ్వతంగా నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ప్రజా సంక్షేమ పథకాల అమలు సక్రమంగా నిర్వహింప జేయాలని, శానిటేషన్, రోడ్లు, డ్రైనేజీ ల పనులు పూర్తి చేయించాలని యావత్ మండల ప్రజలు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు విజ్ఞప్తి చేస్తున్నారు...

# సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్బంగా కొవ్వొత్తులతో ఘన నివాళి



**ఎండపల్లి, మార్చి 10(ది క్రైమ్ న్యూస్ ):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి దినోత్సవం సందర్భంగా మంగళవారం కొవ్వొత్తులతో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఎం అర్ పి ఎస్ ఉమ్మడి వెల్గటూర్ మండల అధ్యక్షులు చెన్న కుమారస్వామి, జిల్లా ఉప అధ్యక్షులు మంతెన లక్ష్మణ్, అంబేద్కర్ సంఘ అధ్యక్షులు చందు దాసరి కొమురయ్య, వార్డు మెంబెర్ చెన్న సత్తయ్య, బొంగని నరేష్, గౌడ సంఘం మాజీ అధ్యక్షులు బుర్గడ్డ శ్రీనివాస్, యాదవ సంఘం బైకని రవీందర్, దొనబండ శంకర్, మాజీ ఉపసర్పంచ్ నారాయణ స్వామి, అరుణ్ లచ్చయ్య,బొంగని తిరుపతి, దేవేందర్, శ్రీనివాస్,గంగాధరి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే కు ఘన నివాళులు..

**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే కు ఘన నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మునిపట్ల లక్ష్మినారాయణ మాట్లాడుతూ,బాలికల చదువు కోసం బాటలు వేసిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే గారు. ఆడపిల్లలు చదువుకుంటేనే సమాజం సంపూర్ణంగా బాగుపడుతుందని భావించి, వారికి విద్యనందించడంలో ఎనలేని కృషి చేసిన ధైర్యశాలి సావిత్రిబాయి పూలే. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ...ఎన్నో అవరోధాలను ఎదుర్కొంటూ కూడా సమానత్వం కోసం పాటుపడిన సావిత్రిబాయి పూలే గారి జీవితం స్ఫూర్తిదాయకం. బాలికలతో పాటు దళితులకు విద్యనందించడంలో, వితంతువుల జీవితాల్లో వెలుగులు నింపడంలో, రోగులకు సేవ చేయడంలో సావిత్రిబాయి పూలే గారు దిక్సూచిగా నిలిచారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పించిన రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి మునిపట్ల లక్ష్మి నారాయణ, తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం జాయింట్ సెక్రటరీ ఆరె శంకర్, రాపర్తి రవి, బీసీ రాష్ట్ర యూత్ ఆర్గనైస్ కో ఆర్డినేటర్ హృషికేష్, ధ్యావనపెల్లి శంకర్, సాల్వేర్ రాజేశం, కాసారాపు సతీష్ గౌడ్, పంజాల సత్యనారాయణ పిండేరు శ్రావణ్, పాపన్న శ్రీనివాస్ గార్లు తదితరులు సావిత్రిబాయి పూలే గారికి నివాళులు అర్పించారు...

# జేఎన్‌టీయూలో.. కొన్ని ఏళ్లుగా అరకొర వేతనాలే

**- పెంచాలంటూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేడుకోలు**

**- తొట్ల తిరుపతి యాదవ్ చొరవతో పరిష్కారం**



**రామగిరి, మార్చి 10(ది క్రైమ్ న్యూస్):-** పన్నూర్ గ్రామంలోని జేఎన్టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాల లో స్వీపింగ్ కార్మికులు గత కొద్ది ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఇంకా అరకొర వేతనాలే ఇస్తున్నారని తక్కువ జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారడం తమకు కనీస వేతనాలు ఒక్క రూపాయి కూడా పెరగలేదని వారంతా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ఆయన తెలంగాణ రాష్ట్ర ఐటీ ఒ పరిశ్రమల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లగా, మంత్రి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు సూచనతో వెంటనే చర్యలు తీసుకున్నారు. అనంతరం మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ సంబంధిత అధికారులతో మాట్లాడి జేఎన్టీయూ యూనివర్సిటీ వద్ద సమస్యను పరిష్కరించేలా చొరవ చూపారు.దీంతో గత కొద్ది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనం పెంపును అమలు చేయడంతో పాటు బకాయిలను కూడా ఇప్పించారు.ఈ సందర్భంగా స్వీపింగ్ కార్మికులు మంథని బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, తమ సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతగా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ని శాలువాతో సత్కరించి, స్వీట్లు తినిపించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# విద్యార్థులకు స్కాలర్షిప్ అందజేత






**రామగిరి, మార్చి 10(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం నాగెపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రజ్ఞా ఫౌండేషన్ ట్రస్టు కర్నె నర్సయ్య మంగళవారం రోజున విచ్చేసి చదువులో ప్రతిభ కనబరిచిన ఎనిమిది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు వేల రూపాయలు ఉపకార వేతనం (స్కాలర్షిప్ ) అందించి, వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటూ వారి అమూల్యమైన ఆశీస్సులు అందించారు. విద్యార్థుల జీవితాల్లో వెలుగులను నింపే ఉపాధ్యాయులను అభినందించారు. ఇట్టి కార్యక్రమానికి ఎంఈఓ కొమురయ్య , సర్పంచ్ కొండవేన దివ్య సుధాకర్ విచ్చేసి విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఈ. హైమావతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రజ్ఞ ఫౌండేషన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు..

**● 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు ● 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలు ● తెలంగాణ బ్రాండ్' ప్రతిబింబించేలా ప్రతిష్ఠాత్మక ఏర్పాట్లు ● సమన్వయలోపం తలెత్తకుండా స్పెషల్ ఆఫీసర్, శాఖలవారీగా నోడల్ అధికారులు ● ఈ నెలఖారుకు డీపీఆర్ పూర్తి... తొలి దశలో 'టైర్ -- 1' ప్రాంతాల్లో పనులు ● కేబినేట్ సబ్ కమిటీ తొలి సమావేశంలో మంత్రులు**

**రామగిరి, మార్చి 10(ది క్రైమ్ న్యూస్):-** కుంభమేళా తరహాలోనే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని 'గోదావరి పుష్కరాలు 2027' క్యాబినేట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. 'తెలంగాణ బ్రాండ్' మార్మోగేలా... మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. మంగళవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన నిర్వహించిన కమిటీ తొలి సమావేశంలో... సభ్యులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. పుష్కర నిర్వహణ తేదీలు, సంబంధిత శాఖల సన్నద్ధత, భవిష్యత్తు కార్యాచరణను సమీక్షించి... అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.... సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సరస్వతీ పుష్కరాలు, సమ్మక్క సారక్క జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించిందన్నారు. అదే స్ఫూర్తితో... మరింత రెట్టించిన ఉత్సాహంతో రాబోయే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు, 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలను నిర్వహించాలని వేద పండితులు నిర్ణయించారన్నారు. సుమారు 8 కోట్ల మంది భక్తులు ఈ పుష్కరాలకు తరలి వచ్చే అవకాశముందని, అందుకు అనుగుణంగానే గోదావరి ప్రవహించే జిల్లాల్లో... ప్రముఖ దేవాలయాలను అనుసంధానిస్తూ... 96 ప్రాంతాలను పుష్కరాల కోసం ప్రత్యేకంగా ఎంపిక చేశామన్నారు. గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆయా చోట్ల క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఘాట్లు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర, జిల్లా ప్రణాళికలను ప్రత్యేకంగా రూపొందిస్తున్నామన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వీలైనంత వేగంగా పనుల్ని ప్రారంభించేలా ముమ్మర కసరత్తు చేస్తున్నామన్నారు. ఈ నెల చివరి నాటికి డీపీఆర్ లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు.




తొలి దశలో భాగంగా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు రద్దీ అధికంగా ఉండే తొమ్మిది ప్రాంతాలను 'టైర్ -- 1' కింద ఎంపిక చేశామన్నారు. సమన్వయలోపం తలెత్తకుండా గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్, శాఖల వారీగా నోడల్ అధికారులను నియమిస్తామన్నారు. ప్రతి ఘాట్ దగ్గర ట్రాఫిక్ క్రమబద్దీకరణ, ఎమర్జెన్సీ రూట్, అత్యాధునిక వైద్య సౌకర్యాలు, పార్కింగ్ తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. పుష్కర ఏర్పాట్లలో రాజీపడే ప్రసక్తే లేదని, పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అత్యంత పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.



## ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం: మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ

**సుల్తానాబాద్, (ది క్రైమ్ న్యూస్):** ప్రజా పాలన ప్రణాళిక విజయవంతం చేసేందుకు గాను 2 కె రన్ నిర్వహించడం జరిగిందని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ అన్నారు, మంగళవారం సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్ అయ్యప్ప స్వామి దేవాలయం నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు టు కె రన్ నిర్వహించడం జరిగింది, ఇందులో పాల్గొన్న వారికి టీ షర్ట్ లు క్యాప్‌లు అందజేశారు. సందర్భంగా బిరుదు కృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రణాళిక విజయవంతం చేసేందుకు గాను అందరూ సహకరించాలని అన్నారు, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మున్సిపాలిటీ ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, స్థానిక సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ చంద్రకుమార్, మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి డాక్టర్ అయిల రమేష్, వాకర్స్ అసోసియేషన్ సెక్రటరీ మంద శ్రీనివాస్ గౌడ్, స్పోర్ట్స్ క్లబ్బు అధ్యక్షులు ముత్యాల రవీందర్, కందుకూరి ప్రకాష్ రావు (పెద్దన్న), కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు, వాకర్స్, ప్రజా ప్రతినిధులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## విద్యార్థుల ప్రతిభకు వేదికగా "ది గ్రేట్ ఇంగ్లీష్ గాలా"



**సుల్తానాబాద్, మార్చి 10(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు "ది గ్రేట్ ఇంగ్లీష్ గాలా" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషపై ఆసక్తిని పెంపొందించడమే కాకుండా వారి భాషా నైపుణ్యాలను మెరుగుపరచేందుకు దోహదపడింది.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఇంగ్లీష్ ప్రసంగాలు, కథలు, కవితా పఠనం, నాటికలు తదితర కార్యక్రమాలను ప్రదర్శిస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు.విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకునేలా సాగడంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో అవసరమని అన్నారు. ఇంగ్లీష్ భాషలో ప్రావీణ్యం సాధించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని తెలిపారు. విద్యార్థులు ధైర్యంగా ముందుకు వచ్చి తమ ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయం అని పేర్కొన్నారు.పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రియ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ఇటువంటి కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు వేదికపై మాట్లాడే ధైర్యం పెంపొందించుకోవడంతో పాటు సృజనాత్మకతను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మండల అధికారులకు డైరీ అందజేసిన టిజిఓలు





**మానకొండూర్, మార్చి10(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలో సిఐ శ్రీలత, ఎంపీడీవో వరలక్ష్మి, వైద్యులు సల్మాన్ లకు మంగళవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టిజిఓ డైరీని అందజేశారు. టీజీవో జిల్లా కార్యదర్శి డాక్టర్ అరవింద్, జిల్లా సాంస్కృతిక సెక్రెటరీ బదావత్ రాజు నాయక్ తదితరులు అధికారులకు డైరీ అందజేసిన వారిలో ఉన్నారు.

## జెఎన్టియూహెచ్ అకడమిక్ బ్లాక్ లోని నూతన ఆడిటోరియం ప్రారంభోత్సవం

**- తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రాక - మంథని జెఎన్టియు కళాశాల ప్రిన్సాల్ విష్ణువర్ధన్**



**రామగిరి, మార్చి 10(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలంలోని సెంటనరీ కాలనీ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే పలు కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు 14 సంవత్సరాల తరువాత బుధవారం వస్తున్నారని, ఆయన చేతుల మీదుగా అకడమిక్ బ్లాక్-టు లో నూతన ఆడిటోరియంను ప్రారంభిస్తారని మంథని జెఎన్టియు కళాశాల ప్రిన్సాల్ విష్ణువర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సాల్ చాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆడిటోరియం ప్రారంభోత్సవం అనంతరం కళాశాల వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మంత్రి ఆదేశాలతో ప్రఖ్యాత కంప్యూటర్ దిగ్గజ సంస్థ టిసిఎస్ గత సంవత్సరం ఒప్పందం జరిగిందన్నారు. ప్రతి ఏటా వంద మంది విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి వీరికి ప్లేస్మెంట్ ఇవ్వడం జరుగుతుందని, మొదటి సంవత్సరం 97 మంది ఎంపికయ్యారని, వీరికి మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. మంత్రి కళాశాల అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర విషయాలపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. ముఖ్యంగా ప్రిన్సిపాల్ అతిధిగృహం, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణం, నూతన పరిపాలన భవనం, పెద్ద ఆడిటోరియ భవనం, సోలార ఏర్పాటు లాంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళుతామన్నారు. ఇట్టి కార్యక్రమాలకై అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సమావేశంలో వైస్ ప్రిన్సాల్ ఎం ఉదర కుమార్, పరిపాలనాధికారి సుమన్, అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గోన్నారు.

## మహిళల చదువుతోనే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి

**-ఘనంగా సావిత్రిబాయి పూలే 129 వ వర్ధంతి -తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం-జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య**

**రామగిరి, మార్చి 10(ది క్రైమ్ న్యూస్):-** మహిళలు చదువుకుంటేనే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి జరుగుతుందని తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం, జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య అన్నారు. సావిత్రి బాయి పూలే 129 వ వర్ధంతి సందర్భంగా స్థానిక పెద్దపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ,ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆమె ఫోటోకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల, బాలికల చదువుకుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని వారి కోసం ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు స్థాపించారని అన్నారు. స్త్రీ, బాలికల విద్య కోసం బ్రాహ్మణీయ భావజాలం, పితృస్వామ్యానికి, వ్యతిరేకంగా, వితంతు పునర్ వివాహాలకోసం పోరాడిన యోధురాలని కొనియాడారు. భర్త జ్యోతిబా పూలే అడుగుజాడల్లో సతీ సహగమనం, బాల్య వివాహాలు, అంటరానితనం, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిందని అన్నారు. మహారాష్ట్ర లో ప్లేగు వ్యాధి ప్రభలిన సందర్భంలో రోగులకు సేవలు చేస్తున్న క్రమంలో ఆ వ్యాధి సోకి సావిత్రి బాయి పూలే మృతి చెందిందని, ఆమె మృతి పీడిత వర్గాల మహిళలకు,ప్రజలకు తీరని లోటని ఆమె సిద్దాంతా అడుగుజాడల్లో నడవడమే ఆమెకు మనమిచ్చే ఘన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య,జిల్లా కమిటీ నాయకులు కె. రాజు,బీసీ సంఘాల జేఏసీ జిల్లా, జేఎన్టీయూహెచ్ రాష్ట్ర నాయకులు ఆకుల వివేక్ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కోమటిపల్లి రాజేందర్ ,బిసి సమితి జిల్లా నాయకులు కీర్తి రాజయ్య, గాండ్ల రాజేశం,అమర్ తదితరులు పాల్గొన్నారు.

## మురికి నీరు పోవడానికే ఇంకుడు గుంతల నిర్మాణం

**- సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు**



**రామగిరి, మార్చి 10(ది క్రైమ్ న్యూస్):-** మురికి నీరు పోవడానికే ఇంకుడు గుంతల నిర్మాణమని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని రాంనగర్ లో మురికి కాలువ ఆఖరి లో భారీగా నీరు నిలుస్తుందని వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రభుత్వం ఇంకుడు గుంత ను మంజూరు చేసింది. దీనితో ఇంకుడు గుంత పనులను సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు అల్లి రమేష్, బత్తిని ప్రశాంత్, పున్నం మణితేజ, పంచాయితీ సెక్రటరీ గంగుల సంతోష్, స్థానిక నాయకులు రామిడి వెంకటేశ్వర్లు, బెజ్జాల ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట ప్రకారం హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం

**- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు**



**సుల్తానాబాద్, మార్చి10(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రం నుండి హైదరాబాద్ వరకు నూతన బస్సు సౌకర్యాన్ని ఆర్టీసీ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చామని, ప్రయాణికుల సౌకర్యార్థం మంత్రుల సహకారంతో త్వరలో మరిన్ని బస్సు సేవలను ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఈ సౌకర్యం కల్పిస్తున్నామని, సౌకర్యాలు మెరుగుపరచడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ మున్సిపల్ కమిషనర్ రమేష్ ,వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత ,కౌన్సిలర్ల, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## పాత కార్మికులందరినీ యధావిధిగా ఎలాంటి కండిషన్ లేకుండా కొనసాగించాలి

**- సెక్యూరిటీ అధికారి షర్బుద్దీన్ ఏఎస్ఓ కి వినతిపత్రం**

**- సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఐఎఫ్టియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న**



**రామగిరి, మార్చి 10(ది క్రైమ్ న్యూస్):-** సింగరేణి సంస్థ ఆర్జీ-త్రీ ప్రైవేట్ సెక్యూరిటీ పాత టెండర్ లో పనిచేస్తున్న కార్మికులకు తిరిగి కొత్తగా రన్నింగ్, హైటు, వెయిట్, పిడిఎఫ్ లాంటి కండిషన్ లు పెట్టడాన్ని వెంటనే విరమించుకోవాలని సెక్యూరిటీ అధికారి షర్బుద్దీన్ ఏ ఎస్ ఓ కి సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న వినతిపత్రం ఇవ్వడమైంది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నిరుద్యోగులుగా ఉన్నటువంటి కొంతమంది కి ఆర్జీ-త్రీ లో ఉపాధి సెక్యూరిటీ విభాగంలో దొరికి పనులు చేసుకుంటున్నారు ఇప్పుడు పాత టెండర్ కాలపరిమితి ముగిసి తిరిగి మళ్లీ పిలిచిన టెండర్స్ లో పెట్టిన క్లాస్ రన్నింగ్ హైట్ వెయిట్ పిడిఎఫ్ లాంటి కండిషన్స్ పొందుపరిచి టెండర్ పిలవడం ఇది సరైనది కాదని దీన్ని వెంటనే రద్దుచేసి ఇక్కడ పనిచేస్తున్న పాత కార్మికులందరినీ యధావిధిగా ఎలాంటి కండిషన్ లేకుండా కొనసాగించాలని ఈ సందర్భంగా ఆర్జీ-త్రీ యాజమాన్యాన్ని కోరడమైనది. ఈ కార్యక్రమం లో ఎం. రమేష్, వి.కుమారస్వామి, డి. సంజీవ్, శ్రీ సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సాంకేతికలపై అవగాహన పరిజ్ఞానంపై పట్టు సాధించాలి

**-మంథని జెఎన్టియు కళాశాల ప్రిన్సాల్ బి.విష్ణువర్ధన్**




**రామగిరి, మార్చి 10(ది క్రైమ్ న్యూస్):-** అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ)పై కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు అవగాహన పెంచుకొని విషయ పరిజ్ఞానంపై పట్టు సాధించాలని మంథని జెఎన్టియు కళాశాల ప్రిన్సాల్ బి.విష్ణువర్ధన్ పిలుపునిచ్చారు. కళాశాల సిఎస్ఇ విభాగం ఆధ్వర్యంలో జనరేటివ్ ఎఐ అండ్ డెటా సైన్స్పై మూడు రోజుల పాటు, వర్క్ షాప్ జరుగుతుంది. ఇట్టి వర్క్ షాప్ ను ప్రిన్సాల్ ముఖ్యఅతిధిగా హజరై మాట్లాడుతూ నూతన సాంకేతికలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో మంచి అవకాశాలు పొందవచ్చు అన్నారు. వర్క్ షాప్ లలో కళాశాలకు చెందిన ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు హజరైనారు. వర్క్షాన్ కన్వీనర్ డాక్టర్ తియవతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గోన్నారు.

# అమ్మకానికి జాతీయ రహదారులు..

# మహారాష్ట్ర, ఏపీలోని ఆస్తుల నగదీకరణ

**● ఎన్‌హెచ్ఐటీ రూ.6,221 కోట్ల ఆఫర్‌కు ఎన్‌హెచ్ఏఐ సై**



**న్యూఢిల్లీ:** జాతీయ రహదారి ఆస్తుల నగదీకరణకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) మరోసారి సిద్ధమైంది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ (ఏపీ)లలో 310.35 కిలోమీటర్ల పొడవున ఉన్న రెండు హైవే సెక్షన్ల కోసం నేషనల్ హైవేస్ ఇన్‌ఫ్రా ట్రస్ట్ (ఎన్‌హెచ్ఐటీ) రూ.6,220.90 కోట్లను ఆఫర్ చేసింది. దీనికి ఎన్‌హెచ్ఏఐ అంగీకరించినట్టు కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన ఓ అధికారిక ప్రకటనలో తెలియజేసింది. ఇప్పటికే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) జాతీయ రహదారుల ఆస్తుల నగదీకరణ ద్వారా దాదాపు రూ.28,077 కోట్లను ఎన్‌హెచ్ఏఐ సమీకరించిన విషయం తెలిసిందే. కాగా, తాజా డీల్‌లో మహారాష్ట్రలోని జాతీయ రహదారి 53పై 255.97 కిలోమీటర్ల పొడవున ఉన్న అమరావతి-చిఖిలీ-టార్సోడ్ సెక్షన్, ఏపీలోని జాతీయ రహదారి 16పై 54.38 కిలోమీటర్ల పొడవున ఉన్న గుండుగొలను-చిన్న అవుతపల్లి సెక్షన్‌లు సేల్ అవుతున్నాయి. ఇదిలావుంటే ఎన్‌హెచ్ఐటీ అనేది ఓ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్). దీన్ని ఎన్‌హెచ్ఏఐ స్పాన్సర్ చేస్తున్నది. ఎన్‌హెచ్ఐటీ ద్వారా జరిగిన మొత్తం ఆస్తుల నగదీకరణ విలువ రూ.49,858 కోట్లుగా ఉన్నది. ఎన్‌హెచ్ఐటీ యూనిట్లు దేశీయ ప్రధాన స్టాక్ మార్కెట్లైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో నమోదైయ్యాయి. ఇదిలావుంటే పర్యావరణ ఒత్తిడిని తగ్గించేందుకు దేశంలోని జాతీయ రహదారుల పొడవున బీ కారిడార్లను ఎన్‌హెచ్ఏఐ అభివృద్ధి చేయనున్నది. తేనెటీగలు, ఇతర పరాగ సంపర్కాల సాయంతో ఏడాదంతా జాతీయ రహదారుల వెంబడి పచ్చదనం, పూలమొక్కలతో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టనున్నామని మంగళవారం ఓ అధికారిక ప్రకటనలో కేంద్రం వెల్లడించింది.

## మెరిసిన బ్యాంకింగ్ షేర్లు.. సెన్సెక్స్ 650, నిఫ్టీ 212 పాయింట్లు వృద్ధి



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ రెండూ 0.8 శాతం మేర పుంజుకున్నాయి. విద్యుత్తు, బ్యాంకింగ్, ఇతర ఆర్థిక రంగ షేర్లకు మదుపరుల కొనుగోళ్ల మద్దతు లభించడం కలిసొచ్చింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 650.39 పాయింట్లు లేదా 0.79 శాతం ఎగిసి 83,277.15 వద్ద స్థిరపడింది. ఫలితంగా బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.3,11,982.13 కోట్లు పెరిగి రూ.4,68,58,625.33 కోట్లకు చేరింది. ఇక నిఫ్టీ 211.65 పాయింట్లు లేదా 0.83 శాతం ఎగబాకి 25,682.75 వద్ద నిలిచింది. అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు మదుపరుల సెంటిమెంట్‌ను బలపర్చాయని ట్రేడర్లు చెప్తున్నారు. ముడి చమురు ధరల్లో స్థిరత్వం కూడా మార్కెట్ల లాభాలకు దోహదం చేసిందంటున్నారు. కాగా, సెన్సెక్స్ షేర్లలో పవర్‌గ్రిడ్ విలువ గరిష్ఠంగా 4.45 శాతం పెరిగింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, కొటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్బీఐ షేర్లూ లాభపడ్డాయి. రంగాలవారీగా పవర్, యుటిలిటీస్, బ్యాంకింగ్, రియల్టీ షేర్లు ఇన్వెస్టర్లను ఆకట్టుకున్నాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.95 శాతం పెరుగగా, స్మాల్‌క్యాప్ 0.16 శాతం పడిపోయింది.

## ఐపీవోకి గౌడియం ఐవీఎఫ్




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లోకి మరో సంస్థ అడుగుపెట్టబోతున్నది. ఫెర్టిలిటీ సేవల సంస్థ గౌడియం ఐవీఎఫ్ అండ్ మహిళా హెల్త్ లిమిటెడ్..ఐపీవో ప్రతిపాదనకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. షేరు ధరల శ్రేణిని రూ.75-79 గా నిర్ణయించింది. ఈ నెల 20న ప్రారంభంకానున్న వాటాల విక్రయం ఈ నెల 24న ముగియనున్నది. రెండు శాతానికి సమానమైన షేర్లను బహిరంగా మార్కెట్లో విక్రయించడం ద్వారా సంస్థకు రూ.165 కోట్ల నిధులు సమకూరనున్నాయి. ఫెర్టిలిటీ విభాగం నుంచి వస్తున్న తొలి ఐపీవో సంస్థ ఇదే కావడం విశేషం.

## భెల్‌కు 1,500 కోట్ల ఆర్డర్

**న్యూఢిల్లీ:** విద్యుత్ పరికరాల తయారీ సంస్థ భెల్ మరో భారీ ప్రాజెక్టును చేజిక్కించుకున్నది. స్టీల్ ఆథార్టీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్) నుంచి రూ.1,200-1,500 కోట్ల విలువైన విద్యుత్ ప్లాంట్ ప్రాజెక్టు లభించినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఇందుకు సంబంధించి ఇరు సంస్థల మధ్య నేడు అధికారిక ఒప్పందం జరిగింది. బర్నపూర్‌లో సెయిల్ సంయుక్తంగా 4.08 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన స్టీల్ ప్లాంట్‌లోనే ఈ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నది. ఈ ప్రాజెక్టు వచ్చే 39 నెలల్లో అందుబాటులోకి రానున్నది.

## 3 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు.. జనవరిలో 34.68 బిలియన్ డాలర్లుగా నమోదు



**న్యూఢిల్లీ:** దేశ ఎగుమతులు, దిగుమతుల మధ్య అంతరం అంతకంతకూ పెరిగిపోతున్నది. జనవరిలో 3 నెలల గరిష్ఠాన్ని తాకుతూ వాణిజ్య లోటు 34.68 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఈసారి ఎగుమతులు స్వల్పంగా 0.61 శాతం పెరిగి 36.56 బిలియన్ డాలర్లుగా ఉంటే.. దిగుమతులు మాత్రం 19.2 శాతం ఎగిసి 71.24 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది వాణిజ్య లోటును ఎగదోసింది. ఇక అధిక ధరల నేపథ్యంలో దిగుమతుల్లో బంగారం, వెండి వాటా గణనీయంగా పెరిగి వరుసగా 12 బిలియన్ డాలర్లు, 2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ముడి చమురు దిగుమతులు 0.24 శాతం తగ్గి 13.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అమెరికాకు తగ్గుముఖం అమెరికాకు భారతీయ ఎగుమతులు గత నెలలో 21.77 శాతం క్షీణించాయి. 6.6 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. అగ్రరాజ్యం విధించిన అధిక సుంకాల ప్రభావం కనిపించింది. సెప్టెంబర్, అక్టోబర్, డిసెంబర్ నెలల్లోనూ పతనం చూసిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే అమెరికా నుంచి భారత్‌కు జరిగిన దిగుమతులు 23.71 శాతం పెరిగి 4.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

## మార్కెట్లోకి మారుతి ఈ-విటారా.. ప్రారంభ ధర రూ 10.99 లక్షలు




**న్యూఢిల్లీ:** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ..ఎలక్ట్రిక్ వాహన సెగ్మెంట్‌లోకి ఎట్టకేలకు ప్రవేశించింది. కిందటేడాది చివర్లో ప్రదర్శించిన తన తొలి ఎలక్ట్రిక్ మాడల్ ఈ-విటారాను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.10.99 లక్షలుగా నిర్ణయించింది. బాస్(బ్యాటరీ-యాస్-సర్వీసెస్) ఆప్షన్‌తో కొనుగోలు చేయవచ్చును. ఇందుకోసం కొనుగోలుదారుడు అదనంగా కిలోమీటర్‌కు రూ.3.99 చొప్పున చెల్లించాల్సివుంటుంది. 61 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 543 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, 49 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన మాడల్ 440 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. ఆన్‌లైన్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న డీలర్ల వద్ద రూ.21 వేలు చెల్లించి ముందస్తుగా ఈ కారును బుకింగ్ చేసుకోవచ్చునని తెలిపింది. ఇందుకోసం సంస్థ 1,100 నగరాల్లో 2 వేల చార్జింగ్ పాయింట్లను ఇప్పటికే ఏర్పాటు చేసింది. 2030 నాటికి దేశవ్యాప్తంగా లక్ష చార్జింగ్ స్టేషన్లను నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకున్నది. మారుతి చరిత్రలో ఇదొక కీలక మైలురాయి వంటిదని, ఎలక్ట్రిక్ రంగంలో తొలి అడుగుపడిందని, భవిష్యత్తులో ఈ సెగ్మెంట్ మరింత బలోపేతం అయ్యే అవకాశాలున్నాయని మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ పార్థో బెనర్జీ తెలిపారు. గడిచిన రెండేండ్లలో ఈవీ మార్కెట్ 4-5 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటుందన్నారు. ఈ కారును ఇప్పటికే విదేశాల్లో సుజుకీ మోటర్ కార్పొరేషన్‌తో కలిసి విక్రయిస్తున్నది.

## ఆర్‌సీబీ మహిళా టీమ్‌కు చేతక్ స్కూటర్లు

**పుణె:** ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ బజాజ్ ఆటో లిమిటెడ్... మహిళా టీ-20 లీగ్‌లో గెలుపొందిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మహిళా టీం ప్రతి ఒక్క సభ్యురాలుకు నూతన చేతక్ సీ25ని బహుమతిగా అందచేస్తున్నట్టు సంస్థ ప్రకటించింది. ఇప్పటికే ఆర్‌సీబీ మహిళా టీమ్‌కు భాగస్వామిగా వ్యవహరిస్తున్న చేతక్..తాజాగా ఐపీఎల్ మహిళా టీమ్ విజేతలకు ఉచితంగా స్కూటర్‌ను ఇస్తున్నట్టు కంపెనీ ప్రెసిడెంట్ సుమీత్ నారంగ్ తెలిపారు.



## దిగొస్తున్న పుత్తడి.. 2 శాతం వరకు తగ్గిన తులం ధర

### రూ.5 వేలు దిగొచ్చిన కిలో వెండి



**న్యూఢిల్లీ:** బంగారం, వెండి ధరలు కొండదిగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేమి కారణంగా దేశీయంగా ధరలు 2 శాతం వరకు తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. కిలో వెండి రూ.2.45 లక్షలకు దిగిరాగా, బంగారం రూ.1.57 లక్షలకు దిగొచ్చింది. ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించిన సమాచారం ఆధారంగా వెండి రూ.5 వేలు లేదా 2 శాతం తగ్గి రూ.2.45 లక్షలకు పడిపోయినట్టు తెలిపింది. సోమవారం ఈ ధర రూ.2.50 లక్షలుగా ఉన్నది. వెండితోపాటు 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.2,200 లేదా 1.4 శాతం తగ్గి రూ.1,57,000కి తగ్గింది. ఆసియా మార్కెట్లకు సెలవు కావడం, మరోవైపు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు తగ్గుముఖం పట్టడంతో భవిష్యత్తులో యూఎస్ ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా ధరలు తగ్గడానికి ప్రధాన కారణాలని చాయిస్ బ్రోకింగ్ కమోడిటీ అనలిస్ట్ కావేరి మోర్ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ వెండి 1.65 డాలర్లు లేదా 5.15 శాతం తగ్గి 73.58 డాలర్లకు పడిపోయింది. అలాగే బంగారం 3.04 శాతం తగ్గి 4,907.70 డాలర్ల వద్ద ఉన్నది. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య చర్చలు ప్రారంభం కావడంతో వరుసగా రెండు రోజులుగా అతి విలువైన లోహాల ధరలు దిద్దుబాటునకు గురవుతున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ రీసర్చ్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.

## రెండోరోజూ లాభాల్లో సూచీలు.. సెన్సెక్స్ 173, నిఫ్టీ 42 పాయింట్ల వృద్ధి



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో దూసుకుపోతున్నాయి. బ్యాంకింగ్, ఐటీ రంగ షేర్ల లభించిన మద్దతుతో వరుసగా రెండోరోజూ మంగళవారం సూచీలు లాభపడ్డాయి. 83,598 నుంచి 82,987 పాయింట్ల మధ్య కదలాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 173.81 పాయింట్లు అందుకొని 83,450.96 వద్ద ముగిసింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.1,52,688.24 కోట్లు పెరిగి రూ.4,70,11,313.57 కోట్లు(5.18 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నాయి. మరో సూచీ నిఫ్టీ 42.65 పాయిం ట్లు ఎగబాకి 25,725.40 వద్ద స్థిరపడింది. ఐటీ రంగ సూచీ కరెక్షన్‌కు గురైనప్పటికీ ఇతర రంగాల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుతో లాభాలను కొనసాగించాయని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఐటీసీ, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, లార్సెన్ అండ్ టుబ్రో, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, టైటాన్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, సన్‌ఫార్మాస్యూటికల్స్, మారుతి సుజుకీ, ఇండిగో, ఎస్బీఐ, టెక్ మహీంద్రా షేర్లు లాభాల్లో ముగిశాయి. మరోవైపు, ఎటర్నల్, టాటాస్టీల్, ట్రెంట్, రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి.

## ఆంత్రోపిక్- ఇన్ఫీ జట్టు




**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధస్సు (ఏఐ)లో సరికొత్త సంచలనం, అమెరికాకు చెందిన కంపెనీ ఆంత్రోపిక్‌తో.. భారతీయ ఐటీ రంగ దిగ్గజ సంస్థల్లో ఒకటైన ఇన్ఫోసిస్ జట్టు కట్టింది. టెలికమ్యూనికేషన్స్, ఆర్థిక సేవలు, తయారీ, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి తదితర కంపెనీల కోసం అత్యాధునిక సంస్థాగత ఏఐ సొల్యూషన్స్‌ను అందుబాటులోకి తేవడం, అభివృద్ధిపర్చడానికి ఆంత్రోపిక్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మంగళవారం ఇన్ఫోసిస్ ప్రకటించింది. ముందుగా టెలికాం రం గంలో ఆంత్రోపిక్ సహకారాన్ని ఇన్ఫోసిస్ తీసుకోనున్నది. ఈ మేరకు ఓ ప్రకటనలో కంపెనీ పేర్కొన్నది. 'ఓ రెగ్యులేటెడ్ ఇండస్ట్రీలో పనిచేసే ఏఐకి, డెమోలో ఉన్న ఏఐ మాడల్‌కు మధ్య చాలా అంతరం ఉన్నది. ఈ దూరాన్ని తొలగించడానికి ఆయా రంగాల్లో సమర్థవంతమైన నైపుణ్యం అవసరం. ఇన్ఫోసిస్‌కు టెలికాం, ఆర్థిక సేవలు, తయారీ రంగాల్లో అలాంటి నైపుణ్యమే ఉన్నది' అని ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడీ అన్నారు.

# వారానికో బాతు గుడ్డు తినండి..!
## ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదులుకోరు



బాతు గుడ్లు వివిధ ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. కోడి గుడ్లకు రుచికరమైన, పోషకమైన ప్రత్యామ్నాయం బాతుగుడ్లు. వాటిలో ప్రోటీన్, విటమిన్లు, విటమిన్ బి12, విటమిన్ డి, ఐరన్, సెలీనియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. అదనంగా బాతు గుడ్లు, కోడి గుడ్ల కంటే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాల సాంద్రతను కలిగి ఉంటాయి. ఇవి గుండె, మెదడుకు మేలు చేస్తాయి. బాతు గుడ్లు కొంతమందికి సులభంగా జీర్ణమవుతాయి. మీ ఆహారంలో బాతు గుడ్లను చేర్చుకోవడం వల్ల మీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. వారానికి ఒకసారి బాతు గుడ్లు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ఇక్కడ తెలుసుకుందాం.. కోడి గుడ్ల కంటే రెట్టింపు ప్రయోజనం బాతు గుడ్లు వల్ల



కలుగుతుంది. బాతు గుడ్లలో ప్రోటీన్లు, విటమిన్లు, విటమిన్ బి12, విటమిన్ డి, ఐరన్, సెలీనియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. అంతే కాదు ఇందులో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా చాలా ఎక్కువ. మన గుండె, మెదడు, జ్ఞాపకశక్తికి ఈ ప్రయోజనాలన్నీ చాలా మంచివి. బాతు గుడ్లు అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేస్తాయి. ఇది బరువు నిర్వహణ, కండరాల పెరుగుదల, వ్యాయామం తర్వాత కోలుకోవడానికి సహాయపడుతుంది. బాతు గుడ్లు చాలా తేలికగా జీర్ణమవుతాయి. కోడి గుడ్ల కంటే బాతు గుడ్లు చాలా ప్రయోజనాలను కలిగి ఉన్నాయని, పరిమాణం పరంగా మరింత మెరుగ్గా ఉంటాయి. ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదు. వారానికి ఒకసారి బాతు గుడ్డు మీ ఆహారంలో చేర్చుకోవడం మంచిది. యాంటీఆక్సిడెంట్ లక్షణాలు.. బాతు గుడ్లలో యాంటీఆక్సిడెంట్ చర్యలో గణనీయమైన పెరుగుదల గమనించబడింది. బాతు గుడ్లలో ఉండే కెరోటినాయిడ్స్, అమినో యాసిడ్స్ యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. క్యాన్సర్ నివారణకు బాతు గుడ్లను ముఖ్యమైన ఆహారంగా తీసుకోవచ్చు. కోడి గుడ్ల కంటే డీసాల్టెడ్ బాతు గుడ్డులోని తెల్లసొన మంచి కాల్షియం శోషణను కలిగి ఉంటుంది. బరువు నియంత్రణతో పాటు, బాతు గుడ్లు కండరాల ఆరోగ్యానికి, బలానికి సహాయపడతాయి. వ్యాయామం తర్వాత వారానికి ఒకసారి బాతు గుడ్లు తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. బాతు గుడ్లు కండరాల బలాన్ని పెంచుతుంది. కండరాల నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి.

# ఎండు ద్రాక్ష నీరు ఇలా తాగారంటే.. కేవలం 10 రోజుల్లోనే ఆ సమస్యలన్నీ పరార్..!



ప్రస్తుత కాలంలో ఎంతో మంది ఎదుర్కొంటున్న సమస్యల్లో అధిక బరువు కూడా ఒకటి. అధిక బరువు కారణంగా చాలా మంది అనేక అనారోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. వెయిట్ లాస్ అయ్యేందుకు ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యాయామం, వాకింగ్, హెల్దీ డైట్, జిమ్ ఇలా చాలానే ట్రై చేస్తున్నారు. అయితే కొన్ని రకాల సింపుల్ చిట్కాలతో కూడా వెయిట్ లాస్ అవ్వొచ్చని నిపుణులు చెబుతున్నారు. వెయిట్ లాస్ అయ్యేందుకు ఎండు ద్రాక్ష వాటర్ ఎంతగానో సహకరిస్తుంది. ప్రతిరోజూ ఎండు ద్రాక్ష నీరు తాగుతూ, మంచి డైట్ మెయిన్ టైన్ చేస్తూ.. వ్యాయామం చేస్తే మీకు కేవలం 10 రోజుల్లోనే రిజల్ట్ కనిపిస్తుంది. ఇలాంటి వాటర్ తాగడం వల్ల మీ బాడీ కూడా ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంటుంది. మరి ఇంకా ఎండు ద్రాక్ష నీటిని తీసుకుంటే ఎలాంటి లాభాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం. బాడీని డిటాక్సిఫికేషన్ చేస్తుంది: ఎండుద్రాక్ష నీటిని తాగడం వల్ల శరీరం డీటాక్సిఫై అవుతుంది. రోజు వారీ జీవితంలో మనకు తెలియకుండానే కాలుష్యం, తినే ఆహారం ఇలా రకరకాల కారణాల వల్ల శరీరంలో మలినాలు అనేవి చేరతాయి. కాబట్టి ఎండు ద్రాక్ష నీటిని తాగడం వల్ల శరీరంలో ఉండే మలినాలు బయటకు పోతాయి. శరీరం ఫ్రీ రాడికల్స్‌తో పోరాడే శక్తి కూడా లభిస్తుంది. నిద్ర లేమి సమస్యలను దూరం చేస్తుంది: బరువు పెరిగేందుకు నిద్ర లేమి సమస్యలు కూడా ఒక కారణంగా ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సరైన నిద్ర లేకపోతే.. తిన్నది అరగక.. పొట్టలో కొవ్వు అనేది నిల్వ ఉండిపోతుంది. అంతే కాకుండా గ్యాస్ అసిడిటీ సమస్యలు కూడా వస్తాయి. కాబట్టి మీరు ఎండు ద్రాక్ష నీటిని తాగితే నిద్ర లేమి సమస్యల్ని దూరం చేస్తుంది. ఎలక్ట్రోలైట్ సమతుల్యత: ఎండు ద్రాక్ష నీటిలో పొటాషియం, మెగ్నీషియం వంటివి లభ్యమవుతాయి. ఇవి శరీరంలోని ద్రవాల స్థాయిల్ని కంట్రోల్‌లో ఉంచుతుంది. చెమట వల్ల కోల్పోయిన శక్తి ఈ నీళ్ల వల్ల తిరిగి వస్తుంది. నాడీ వ్యవస్థ పనితీరు, కండరాల తీరును సరి చేస్తుంది. గట్ హెల్త్: ఎండు ద్రాక్ష నీరు తాగడం వల్ల గట్ హెల్త్ కూడా మెరుగు పడుతుంది. శరీరంలో నుంచి మలినాలన్నీ బయటకు పంపుతుంది. ఎండు ద్రాక్షలో ఉండే ఫైబర్ జీర్ణ శక్తిని, మలబద్ధకం వంటి సమస్యలు రాకుండా చేస్తుంది. వెయిట్ లాస్: ఎండు ద్రాక్ష నీరు తాగడం వల్ల తక్కువ రోజుల్లోనే బరువు తగ్గుతారు. ఎండు ద్రాక్ష నీటిలో ఫైబర్ కంటెంట్ మెండుగా ఉంటుంది. కాబట్టి ఈ నీటిని తీసుకుంటే కడుపు నిండిన భావన కలుగుతుంది. గోరు వెచ్చటి నీటిలో 3 లేదా 4 ఎండు ద్రాక్షను వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం లేవగానే ఆ నీటిని తాగి ఎండుద్రాక్ష తినాలి.

# తమలపాకును నీళ్లలో మరిగించి తాగితే ఏమవుతుందో తెలుసా..? నమ్మలేని లాభాలు..





ఇందుకోసం ముందుగా పొయ్యి మీద ఒక పాత్ర పెట్టి, ఒక గ్లాసు నీళ్లు పోసి, ఒక తమలపాకును ముక్కలుగా కట్ చేసి అందులో వేయాలి. 5 నుంచి7 నిమిషాలు మరిగించి ఆ నీటిని వడకట్టి తాగాలి. మలబద్ధకం సమస్య ఉన్నవారికి ఈ తమలపాకు నీరు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పేగు కదలికలు బాగా జరిగేలా చేస్తుంది. శరీరంలో వాపులను తగ్గిస్తుంది. తమలపాకులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉండటంవల్ల ఛాతీలో పేరుకుపోయిన కఫాన్ని తొలగిస్తుంది. అలాగే జలుబు, దగ్గు, గొంతు నొప్పి నుండి ఉపశమనం కలిగిస్తుంది. మధుమేహం నియంత్రణలో కూడా తమలపాకు నీరు తోడ్పడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచటమే కాకుండా, మధుమేహం కారణంగా వచ్చే సమస్యలను కూడా తగ్గిస్తుంది. చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను కూడా తమలపాకు నీరు నియంత్రిస్తుంది. తద్వారా గుండె ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. తమలపాకులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉండుటవల్ల ఆస్తమాను కూడా అదుపులో ఉంచుతుంది. అంతేగాక తమలపాకును మౌత్ ఫ్రెషనర్‌గా ఉపయోగిస్తున్నారు. ఇది నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. తమలపాకు నోటిలో బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధిస్తుంది. అయితే తమలపాకు నీటిని ఎప్పుపడితే అప్పుడు తాగడం కూడా మంచిదికాదు. రోజులో ఒకసారి మాత్రమే తీసుకోవాలి.

# క్యాన్సర్ భూతాన్ని పారదోలే అద్భుత ఫలం.. ఎక్కడ కనిపించినా వదిలిపెట్టకండీ!



ఆప్రికాట్ పండు చాలా రుచికరమైన పండు. యాంటీఆక్సిడెంట్లతో నిండిన ఈ పండులో పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలకంగా వ్యవహరిస్తుంది. వీటిని రోజు వారీ ఆహారంలో క్రమం తప్పకుండా తింటే ఎన్నో ప్రయోజనాలు పొందుతారు. ఆప్రికాట్ పండును సూపర్ ఫుడ్ అని కూడా అంటారు. ఇందులో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. అయితే పోషకాలు మాత్రం పుష్కలంగా ఉంటాయి. ఆప్రికాట్ పండ్లలో బీటా కెరోటిన్, లుటిన్, పొటాషియం, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, జియాక్సంతిన్ అధికంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఆప్రికాట్ పండ్లు కళ్లకు కూడా చాలా మేలు చేస్తాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులో బీటా కెరోటిన్, విటమిన్ ఎ, జియాక్సంతిన్ ఉంటాయి. ఈ మూడు పదార్థాలు కళ్లకు ఎంతో మేలు చేస్తాయి. ఆప్రికాట్‌పండ్లు కంటిశుక్లం, రేచీకటి ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఆప్రికాట్ పండ్లలో వివిధ రకాల ఫైబర్ ఉంటుంది. కాబట్టి ఈ పండు తింటే జీర్ణం సులువుగా కడుపు క్లీన్ చేస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఈ పండు ఎంతగానో ఉపయోగపడుతుంది. బీటా-కెరోటిన్, లుటిన్, జియాక్సంతిన్, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, యాంటీఆక్సిడెంట్లు వంటి పదార్థాలు శరీరంలోని యాంటీ-క్యాన్సర్ ఏజెంట్లుగా పనిచేస్తాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుండి కణాలను రక్షిస్తాయి. ఆప్రికాట్ పండ్లు శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుతాయి. ఆప్రికాట్ పండ్లలో అధికంగా పొటాషియం ఉంటుంది. కాబట్టి ఇది రక్తపోటును పెంచదు. ఆప్రికాట్ కూడా కాలేయం దెబ్బతినకుండా కాపాడుతుంది. ఈ పండు కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆప్రికాట్ పండ్లు శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ తగ్గకుండా కాపాడుతాయి. అంటే మీరు ఎంత కష్టపడి పనిచేసినా శరీరం బలహీనపడకుండా ఉంటుంది.

# వయసు పెరిగినా యవ్వనంగా కనిపించాలంటే.. ఈ పండ్లు తినండి! ఏంజెల్స్‌లా మెరిసిపోతారు

ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ యవ్వనంగా, అందంగా కనిపించాలని కోరుకుంటారు. దీని కోసం అనేక రకాల చికిత్సలు కూడా తీసుకుంటూ ఉంటారు. బ్యూటీ పార్లర్లలలో రకరకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులను వినియోగిస్తుంటారు. కానీ ప్రతీసారి ఆశించిన ఫలితాలు అందకపోవచ్చు. నిజానికి, చర్మం యవ్వనంగా కనిపించాలంటే కొన్ని ఆహారాలను డైట్‌లో చేర్చుకోవాలి. అలాగే చెడు జీవనశైలి కారణంగా కూడా చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. ఏది ఏమైనప్పటికీ, వేసవి కాలంలో సూర్యుని కిరణాల కారణంగా చర్మం దెబ్బతింటుంది. అటువంటి పరిస్థితిలో చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఆహారపు అలవాట్లు సరిగా లేకపోవడం వల్ల అతి చిన్న వయసులోనే వృద్ధాప్య సంకేతాలు కనిపిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖంపై, ముడతలు, మచ్చలు కనిపించడం ప్రారంభిస్తాయి. చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే ఏయే ఆహారాలు తీసుకోవాలో ఇక్కడ తెలుసుకుందాం.. బెర్రీ పండ్లు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు బెర్రీలలో పుష్కలంగా లభిస్తాయి. స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీస్, బ్లాక్బెర్రీస్ తినడం వల్ల చర్మం యవ్వనంగా ఉంటుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మంలో వేగవంతమైన మార్పులను నెమ్మదించేలా చేస్తాయి. దీనితో పాటు బెర్రీలు ఆక్సీకరణ ఒత్తిడిని తొలగించడంలో కూడా సహాయపడతాయి. డ్రై ఫ్రూట్స్ బాదం, వాల్‌నట్, జీడిపప్పు, వాల్‌నట్, గుమ్మడికాయ గింజలు వంటి డ్రై ఫ్రూట్స్ చర్మానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. చర్మానికి మేలు చేసే డ్రై ఫ్రూట్స్ రోజూ తినడం వల్ల ఇందులో ఉండే విటమిన్-ఇ, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు పుష్కలంగా చర్మానికి అందుతాయి. కొవ్వు చేప నాన్ వెజ్ ఫుడ్ ఇష్టపడే వారు చర్మాన్ని కాపాడుకోవడానికి ఫ్యాటీ ఫిష్ ను తమ డైట్ లో చేర్చుకోవచ్చు. చర్మంపై కనిపించే వృద్ధాప్య సంకేతాలను నివారించడంలో ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కొవ్వు



చేపలలో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో సహాయపడతాయి. వీటితోపాటు గ్రీన్ టీ ద్వారా కూడా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. గ్రీన్ టీని రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల చర్మ కణాలు ఆరోగ్యంగా ఉంటాయి.

# అధిక రక్తపోటు ఎంత ప్రమాదమో తెలుసా? నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం తప్పదంటున్న నిపుణులు



హైపర్ టెన్షన్ కూడా ఓ విధమైన సైలెంట్ కిల్లర్. అధిక రక్తపోటు ప్రాణాలను నెమ్మదిగా హరిస్తుంది. మీకూ అధిక రక్తపోటు సమస్య ఉంటే ప్రతిరోజూ తప్పకుండా మెడిసిన్ తీసుకోవాలి. అధిక రక్తపోటు వల్ల గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యలు వస్తాయి. అసలు అధిక రక్తపోటు ఎందుకు దాడి చేస్తుంది? ఈ సమస్యను ఎలా నియంత్రించవచ్చు వంటి వివరాలు నిపుణుల మాటల్లో తెలుసుకుందాం. బిర్లా హార్ట్ హాస్పిటల్‌లోని కార్డియాలజీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సబ్యసాచి పాల్ మాట్లాడుతూ.. రక్తపోటు వెనుక అనేక జీవనశైలి కారకాలను వివరించారు. వీటిలో వ్యాయామం నుంచి ఊబకాయం, ధూమపానం వరకు అనేక కారకాలు ఉన్నాయి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుందని డాక్టర్ సబ్యసాచి పాల్ అంటున్నారు. కానీ రోజువారీ ఏరోబిక్ వ్యాయామం రక్తపోటును పెంచుతుంది. ముఖ్యంగా రక్తపోటు అదుపులో లేని వారు, శరీర బరువు పెరిగినవారికి, ఊబకాయంతో బాధపడుతున్నవారికి గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. ఊబకాయం కారణంగా అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా తరచుగా సంభవిస్తుంది. ఇది రక్తపోటు ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. ప్రిజర్వేటివ్స్, చక్కెర, ఉప్పుతో కూడిన ప్రాసెస్ చేసిన ఆహారాలు రక్తపోటుకు కారణమని డాక్టర్ సబ్యసాచి పాల్ చెబుతున్నారు. ఇందులో అధిక మొత్తంలో కేలరీలు, సోడియం ఉంటుంది. ఇవి అధిక రక్తపోటుతో పాటు కిడ్నీ సమస్యలు, మధుమేహం ప్రమాదాన్ని పెంచుతాయి. అధిక రక్తపోటు ప్రమాదాన్ని నివారించడానికి ఫాస్ట్ ఫుడ్ మానుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. రక్తపోటు ప్రమాదాన్ని నివారించడానికి, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని డాక్టర్ పాల్ సూచిస్తున్నారు. జీవనశైలి కారకాలు మాత్రమేకాకుండా, రక్తపోటుకు మరొక కారకం కూడా ఉంది. అధిక రక్తపోటుకు ఒత్తిడి కూడా కారణం. ఒత్తిడిని తగ్గించుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. మీరు హైపర్‌టెన్షన్ రోగి అయితే, ప్రతిరోజూ తప్పనిసరిగా మందులు వాడాల్సి ఉంటుంది. బిఎమ్ బిర్లా హార్ట్ హాస్పిటల్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ అంజన్ సియోటియా ఈ విషయాన్ని సూచిస్తున్నారు. చాలా మంది హైపర్ టెన్షన్ కు చికిత్స తీసుకోరని డాక్టర్ అంజన్ అంటున్నారు. సగం కంటే ఎక్కువ మందికి తమకు అధిక రక్తపోటు ఉందనే విషయమే తెలియదు. ఎందుకంటే వారు ఎప్పుడూ రక్తపోటును క్రమం తప్పకుండా టెస్ట్ చేయించుకోరు. అలాగే దీనిపై అవగాహన ఉన్న రోగులలో కూడా సగం మంది రోగులు రోజూ మందులు తీసుకోరు. ఈ కారణంగా మరణాల సంఖ్య పెరుగుతుంది. చికిత్స చేయకపోతే సమస్య మరింత తీవ్రతరం అవుతుంది. దీంతో పక్షవాతం, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి తరచుగా రక్తపోటు పరీక్షించుకోవాలి. అలాగే మందులు తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. ఇలాచేస్తే రక్తపోటును నియంత్రించడం సులభతరం అవుతుంది.

క్రైమ్ న్యూస్
Crime News
తెలుగు దినపత్రిక
మార్చి 11
బుధవారం 2026


## స్పీకర్‌పై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం

# లోక్‌సభలో మొదలైన చర్చ



దిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పై విపక్షాలు అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చాయి. ఈ తీర్మానాన్ని కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ మంగళవారం సభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభమైంది. ఇందుకోసం 10 గంటల సమయం కేటాయించారు. అనంతరం తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ తీర్మానంపై చర్చ వేళ సభను నడిపేందుకు ప్రత్యేక సభాపతిని నియమించాలని విపక్షాలు కోరాయి. ఇందుకు అంగీకరించిన కేంద్రం.. సీనియర్ ఎంపీ, ఛైర్‌పర్సన్స్ ప్యానెల్ సభ్యుడు జగదాంబికా పాల్‌ను నియమించింది. ఆయన నేతృత్వంలో అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో చర్చ కొనసాగుతోంది.

రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చాయి. ఇందుకోసం 118 మంది ఎంపీల సంతకాలు సేకరించినట్లు తెలుస్తోంది.

చర్చ అనంతరం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తారు. ఈ తీర్మానం ఆమోదం పొందాలంటే సాధారణ మెజార్టీ అయిన 272 ఓట్లు కావాలి. ప్రస్తుతం లోక్‌సభలో భాజపా నేతృత్వంలోని ఎన్డీయేకు 293 సంఖ్యాబలం ఉంది. ప్రతిపక్షాలకు 238 మంది ఎంపీలు ఉన్నారు. దీంతో విపక్షాలు ఈ తీర్మానం నెగ్గే అవకాశాలు దాదాపు కన్పించట్లేదు.

## అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరును

# తొలగించబోం: సీఈసీ



పశ్చిమబెంగాల్ : ఓటరు జాబితా నుంచి అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరును తొలగించబోమని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం సీఈసీ బృందం పశ్చిమబెంగాల్‌లో పర్యటించింది. ఈ క్రమంలో రాజకీయ పార్టీలు, అధికారులతో సమావేశాల అనంతరం జ్ఞానేశ్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు.

పశ్చిమబెంగాల్‌లో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడటమే ఎన్నికల సంఘంమొదటి ప్రాధాన్యం అని అన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును ఉపయోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన ఓటర్ల పేర్లు ఎప్పటికీ తొలగించబోమని స్పష్టంచేశారు. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారమే అన్ని రాష్ట్రాల్లో 'ప్రత్యేక సమగ్ర సవరణ' అమలవుతుందన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా ఉండటం, అర్హులైన వారి పేర్లు ఆ జాబితాలో ఉండేలా చూడటమే 'సర్' బాధ్యత అని అన్నారు. ఇక్కడ ఎన్నికలు ఎన్ని దశల్లో జరుగుతాయనేది.. రాష్ట్రప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో చేపట్టే చర్యలపైన ఆధారపడి ఉటుందన్నారు. బెంగాల్ ఎన్నికల ప్రక్రియలో.. ప్రభుత్వ ఉద్యోగులందరూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించాలన్నారు.

ఓటర్లపైనా, ఎన్నికల అధికారులపైనా రాజకీయ నేతలు ఎలాంటి బెదిరింపులకు పాల్పడినా సహించేది లేదన్నారు. పశ్చిమబెంగాల్‌లో దాదాపు 80వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని.. వాటిల్లో దాదాపు 61,000 గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయన్నారు. ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించేందుకు రాష్ట్రంలోని అన్ని పోలింగ్‌బూత్‌లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను అమలుచేస్తామని తెలిపారు.

# వంట గ్యాస్ కొరత..

## ముంబయిలో 20% హోటళ్లు బంద్



ముంబయి : దేశంలో చమురు, గ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని ఓవైపు కేంద్రం చెబుతున్నప్పటికీ.. పలు ప్రాంతాల్లో ఇంధన కొరత ఆందోళన కలిగిస్తోంది. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా ముంబయిలో 20శాతం హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడ్డాయి. ఈ మేరకు ముంబయి హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ మంగళవారం వెల్లడించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రెండు రోజుల్లో నగరంలోని సగం హోటళ్లు మూతపడతాయని పేర్కొంది. ముంబయి మాత్రమే కాదు.. గత రెండు రోజులుగా దేశంలోని పలు ప్రధాన నగరాల్లో వాణిజ్య సిలిండర్ (జశీఎఎవతీఎఖుశ్రీ ాౌ+ జఎశ్రీఱఅఎవతీ)ల కొరత ఏర్పడింది. దిల్లీ, బెంగళూరులో ఇప్పటికే కొన్ని హోటళ్లలో వంటగ్యాస్ అందుబాటు లేక తాత్కాలికంగా మూసివేస్తున్నారు. సిలిండర్ల కొరత వల్ల తమ వ్యాపారం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు, ఇదే అదనుగా కొన్ని ప్రాంతాల్లో బ్లాక్ విక్రయాలు ఊపందుకుంటున్నాయి. ఒక్కో వాణిజ్య సిలిండర్‌ను రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.

ఈ పరిణామాల నేపథ్యంలో బ్లాక్ విక్రయాలను అరికట్టేందుకు కేంద్రం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతమున్న 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. ఇక, వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వశాఖ ఓ కమిటీని ఏర్పాటుచేసింది.

మన దేశంలో ఏటా 31.3 మిలియన్ టన్నుల వంటగ్యాస్‌ను వినియోగిస్తున్నారు. ఇందులో 62 శాతం దిగుమతుల నుంచి వచ్చేదే. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని మూసివేయడంతో ఈ దిగుమతులపై ప్రభావం పడింది. అయితే, ప్రస్తుతం మన వద్ద సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులోనే ఉన్నాయని కేంద్రం వెల్లడించింది.

# అఫ్గాన్‌పై వైమానిక దాడులు

# అన్యాయం: ఐరాసలో భారత్




ముంబయి : పాకిస్థాన్- అఫ్గానిస్థాన్ మధ్య సరిహద్దు ఘర్షణలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో అఫ్గాన్‌పై ఇటీవల జరిగిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో భారత ప్రతినిధి పర్వతనేని హరీష్ పేర్కొన్నారు. 'సరిహద్దుల్లో జరిగే హింస కారణంగా సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై సెక్రటరీ జనరల్ ఆందోళన వ్యక్తంచేశారు. అంతర్జాతీయ మానవతా వాదం, అంతర్జాతీయ చట్టాలను బాధ్యతాయుతంగా పాటించాలి. పౌరుల రక్షణకు చర్యలు చేపట్టాలనే సెక్రటరీ జనరల్ పిలుపునకు మా మద్దతును పునరుద్ఘాటిస్తున్నాం' అని హరీష్ అన్నారు. ఈ సందర్భంగా అఫ్గాన్ భూభాగంపై ఇటీవల జరిగిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇవి అంతర్జాతీయ చట్టాలతో పాటు ఆ దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించారు. ఇక, ఇరుదేశాలు సంయమనం పాటించాలని పలు దేశాలు పిలుపునిచ్చినప్పటికీ.. పాక్- అఫ్గాన్ మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన సరిహద్దు ఆపరేషన్‌లో అనేకమంది శత్రు సైనికులను హతమార్చామని ఇరువర్గాలు ప్రకటించాయి. ఇదిలాఉండగా.. అఫ్గాన్ సరిహద్దులోని ఉత్తర వజీరిస్తాన్‌లో ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా.. 18 మంది గాయపడ్డారు.

Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

# ఐసీసీ, బీసీసీఐ నుంచి కళ్లు చెదిరే ప్రైజ్ మనీ..

## టీమిండియాకు మొత్తం ఎన్ని కోట్లు ముట్టిందో తెలిస్తే షాకవుతారు

**టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడి, దేశం గర్వపడేలా చేసిన సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియాపై ఇప్పుడు కాసుల వర్షం కురుస్తోంది. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి టైటిల్ నెగ్గిన భారత్‌కు ఐసీసీతో పాటు బీసీసీఐ కళ్లు చెదిరే నజరానాలను ప్రకటించాయి.**



టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడి, దేశం గర్వపడేలా చేసిన సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియాపై ఇప్పుడు కాసుల వర్షం కురుస్తోంది. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి టైటిల్ నెగ్గిన భారత్‌కు ఐసీసీతో పాటు బీసీసీఐ కళ్లు చెదిరే నజరానాలను ప్రకటించాయి. గెలిచిన వెంటనే ఐసీసీ సుమారు రూ.27.48 కోట్ల ప్రైజ్ మనీని ప్రకటించగా, ఇప్పుడు బీసీసీఐ భారీ మొత్తాన్ని అనౌన్స్ చేసింది. దీంతో మన ఆటగాళ్లకు అందే మొత్తం ప్రైజ్ మనీ ఏకంగా రూ.158 కోట్లకు చేరింది.

టీమిండియా అద్భుత విజయానికి గుర్తుగా బీసీసీఐ మంగళవారం (మార్చి 10) ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. వరల్డ్ కప్ నెగ్గిన జట్టుకు రూ.131 కోట్ల నగదు బహుమతిని ఇస్తున్నట్లు బోర్డు వెల్లడించింది. ఈ మొత్తాన్ని ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది, సపోర్ట్ స్టాఫ్ మధ్య పంచుతారు. 2024లో టీ20 వరల్డ్ కప్ గెలిచినప్పుడు బీసీసీఐ రూ.125 కోట్లు ప్రకటించగా, ఈసారి మరో రూ.6 కోట్లు పెంచి రికార్డు స్థాయి బహుమతిని అందించింది. ఐసీసీ ఇచ్చిన రూ.27.48 కోట్లు, బీసీసీఐ ఇచ్చే రూ.131 కోట్లు కలిపితే మొత్తం రూ.158.48 కోట్లు అవుతుంది.

భారత జట్టు ఈ విజయంతో ప్రపంచ క్రికెట్‌లో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. మూడుసార్లు టీ20 ప్రపంచకప్ టైటిల్ గెలుచుకున్న మొట్టమొదటి జట్టుగా టీమిండియా చరిత్ర సృష్టించింది. ఇంతకుముందు 2007 (మొదటి ఎడిషన్), 2024లో భారత్ ఛాంపియన్‌గా నిలిచింది. అంతేకాకుండా వరుసగా రెండు టీ20 ప్రపంచకప్‌లు (2024, 2026) గెలిచిన తొలి జట్టుగా కూడా భారత్ రికార్డు సృష్టించింది. ఒకప్పుడు ఆస్ట్రేలియా వన్డేల్లో ఆధిపత్యం చలాయించినట్లు, ఇప్పుడు టీ20 ఫార్మాట్‌లో మెన్ ఇన్ బ్లూ తిరుగులేని శక్తిగా ఎదిగింది.

రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత పగ్గాలు అందుకున్న సూర్యకుమార్ యాదవ్, తన కెప్టెన్సీలో జట్టును అద్భుతంగా నడిపించాడు. టోర్నీ ఆరంభం నుంచి అజేయంగా నిలిచిన భారత్, ఫైనల్‌లో కివీస్‌ను మట్టికరిపించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ విజయం తర్వాత దేశవ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. బీసీసీఐ ప్రకటించిన ఈ భారీ ప్రైజ్ మనీ ఆటగాళ్ల కష్టానికి దక్కిన ప్రతిఫలమని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. త్వరలోనే ముంబైలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించి ఆటగాళ్లను అధికారికంగా సన్మానించేందుకు బోర్డు ఏర్పాట్లు చేస్తోంది.

# టీమిండియా బరిలోకి దిగేది అప్పుడే..

## ఏకంగా ఎన్ని రోజులు హాలీడేస్ అంటే..

**టీ20 ప్రపంచ కప్ విజయం తర్వాత భారత క్రికెట్ షెడ్యూల్: టీ20 ప్రపంచ కప్ విజేత భారత జట్టు ఆఫ్ఘనిస్తాన్ సిరీస్‌తో 96 రోజుల విరామం తర్వాత తిరిగి ఆటలోకి దిగనుంది. ఇంగ్లాండ్, శ్రీలంక, వెస్టిండీస్, న్యూజిలాండ్ పర్యటనలతో సహా 2026 పూర్తి క్రికెట్ షెడ్యూల్ వెల్లడైంది. ఆటగాళ్ళు ఘ్రూలో తమ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారు. రాబోయే టోర్నమెంట్ల ఉత్సాహం క్రికెట్ ప్రియుల కోసం వేచి ఉంది.**



వరుసగా రెండోసారి టీ20 ప్రపంచ కప్ గెలిచిన టీం ఇండియా, అనేక రికార్డులను క్రియేట్ చేసి పొట్టి ప్రపంచకప్ ను సొంతం చేసుకుంది. గత నెల రోజులుగా టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొంటున్న టీం ఇండియా ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటోంది. అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను ముగించిన తర్వాత జట్టుతో కలిసి జరుపుకున్న ఆటగాళ్లు ఇప్పుడు ఇంటికి చేరుకున్నారు. టీ20 ప్రపంచ కప్ గెలిచిన ఆనందాన్ని కొన్ని రోజులు సెలబ్రేట్ చేసుకుంటుంటారు. మరి టీం ఇండియా ఆటగాళ్ల కథ ఇదే అయితే, క్రికెట్ ప్రేమికులలో కొత్త ప్రశ్న తలెత్తింది. అంటే, టీం ఇండియా మరలా ఎప్పుడు మైదానంలోకి తిరిగి వస్తుంది

### టీమిండియాకు 96 రోజులు విశ్రాంతి..

టీ20 ప్రపంచ కప్ గెలిచిన టీమిండియా 96 రోజుల పాటు క్రికెట్ కు దూరంగా ఉంటుంది. ఆ తర్వాత భారత జట్టు ఆఫ్ఘనిస్తాన్ తో సిరీస్ ఆడనుంది. జూన్ 6న న్యూ చండీగఢ్ లో ఏకైక టెస్ట్ మ్యాచ్ జరుగుతుంది. ఆ తర్వాత టీమిండియా ఆఫ్ఘనిస్తాన్ తో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ ఆడనుంది. ఇందులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కూడా ఆడతారు. ఈ సిరీస్ కు ముందు భారత జట్టు కనిపించకపోయినా, టీమిండియా ఆటగాళు ఖచ్చితంగా మైదానంలో కనిపిస్తారు. మార్చి 28 నుంచి ప్రారంభమయ్యే ఐపీఎల్ లో భారత ఆటగాళ్లు తమ తమ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ టోర్నమెంట్ చివరి మ్యాచ్ మే 31న జరుగుతుంది.

### 2026లో టీమిండియా షెడ్యూల్..

ఆఫ్ఘనిస్తాన్‌తో సిరీస్ తర్వాత భారత జట్టు ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది.

జూలైలో జరిగే ఈ పర్యటనలో 5 టీ20లు, 3 వన్డేలు ఉంటాయి.

ఆగస్టులో టీమిండియా శ్రీలంకలో పర్యటించనుంది.

సెప్టెంబర్-అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో భారత జట్టు 3 వన్డేలు, 5 టీ20 మ్యాచ్‌లు ఆడనుంది.

భారత జట్టు అక్టోబర్-నవంబర్‌లో న్యూజిలాండ్‌లో పర్యటిస్తుంది, అక్కడ వారు 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టీ20 మ్యాచ్‌లు ఆడతారు.

శ్రీలంక జట్టు డిసెంబర్‌లో భారతదేశానికి వచ్చి 3 వన్డేలు, 3 టీ20 మ్యాచ్‌లు ఆడనుంది.

# ఐపీఎల్ 2026 షెడ్యూల్ ఫిక్స్..

## మార్చి 12న బీసీసీఐ బిగ్ అనౌన్స్‌మెంట్

**ఐపీఎల్ లవర్స్‌కు అదిరిపోయే వార్త వచ్చేసింది. గత కొన్ని రోజులుగా ఊరిస్తున్న ఐపీఎల్ 2026 (ఘ్రూా 2026) షెడ్యూల్‌పై ఎట్టకేలకు ఒక క్లారిటీ వచ్చింది. నిజానికి టీ20 వరల్డ్ కప్ ఫైనల్ రోజే ఈ షెడ్యూల్ విడుదలవుతుందని అందరూ భావించారు..**

ఐపీఎల్ లవర్స్‌కు అదిరిపోయే వార్త వచ్చేసింది. గత కొన్ని రోజులుగా ఊరిస్తున్న ఐపీఎల్ 2026 (ఘ్రూా 2026) షెడ్యూల్‌పై ఎట్టకేలకు ఒక క్లారిటీ వచ్చింది. నిజానికి టీ20 వరల్డ్ కప్ ఫైనల్ రోజే ఈ షెడ్యూల్ విడుదలవుతుందని అందరూ భావించారు.. కానీ కొన్ని కారణాల వల్ల అది సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (దీజజ×) కార్యదర్శి దేవజిత్ సైకియా షెడ్యూల్ విడుదలపై కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఎప్పుడు షెడ్యూల్ వస్తుంది ఎందుకు ఆలస్యం అవుతోంది అనే విషయాలను ఆయన వెల్లడించారు.

### మార్చి 12న మొదటి విడత షెడ్యూల్

మీడియాతో మాట్లాడిన దేవజిత్ సైకియా.. మార్చి 12 లోపు ఐపీఎల్ 2026 షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. అయితే, ఇక్కడే ఒక చిన్న ట్విస్ట్ ఉంది. మొత్తం టోర్నీ షెడ్యూల్‌ను ఒకేసారి ప్రకటించడం లేదు. ప్రస్తుతం కేవలం మొదటి 20 రోజుల షెడ్యూల్‌ను మాత్రమే బీసీసీఐ విడుదల చేయనుంది. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఇప్పటికే మొదటి విడత మ్యాచుల జాబితాను సిద్ధం చేసింది. మిగిలిన మ్యాచుల వివరాలను తర్వాతి దశలో ప్రకటిస్తారు.

### అందుకే ఈ ఆలస్యం

ఐపీఎల్ షెడ్యూల్ విడుదలలో ఆలస్యానికి ప్రధాన కారణం ఈ ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలే. 2026లో పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ మూడు రాష్ట్రాల్లోనూ ఐపీఎల్ టీమ్స్ ఉండటం, అక్కడ హోమ్ గ్రౌండ్ మ్యాచులు జరగాల్సి ఉండటంతో భద్రతా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా బీసీసీఐ జాగ్రత్త పడుతోంది. ఎన్నికల తేదీలకు అనుగుణంగా మ్యాచులను సర్దుబాటు చేయాల్సి రావడంతో షెడ్యూల్‌ను విడతల వారీగా ప్రకటిస్తున్నారు.

### లీగ్ ప్రారంభం ఎప్పుడంటే

బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన రానప్పటికీ, విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 28 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మే 31వ తేదీన గ్రాండ్ ఫైనల్ నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. గతంలో మార్చి 26 నుంచే టోర్నీ మొదలవుతుందని ప్రచారం జరిగినప్పటికీ, ఇప్పుడు ఆ తేదీ రెండు రోజులు వెనక్కి వెళ్ళినట్లు తెలుస్తోంది. మార్చి 12న వచ్చే షెడ్యూల్ తో తొలి మ్యాచ్ ఎవరి మధ్య ఉంటుంది వేదికలు ఎక్కడ అనే దానిపై పూర్తి క్లారిటీ రానుంది.

# టీమిండియా కెప్టెన్‌గా సంజూ శాంసన్..

## పొట్టి ఫార్మాట్ బాధ్యతలు స్వీకరించేందుకు రెడీ..

**టీ20 వరల్డ్ కప్ 2026లో అద్భుత ప్రదర్శనతో టీమ్ ఇండియాకు టైటిల్ అందించిన సంజూ శాంసన్ ఇప్పుడు మరో పెద్ద చర్చకు కేంద్రబిందువయ్యాడు. అతడిని భారత టీ20 జట్టు కెప్టెన్‌గా నియమించాలనే అభిప్రాయాలు పెరుగుతున్నాయి. మాజీ క్రికెటర్ మొహమ్మద్ కైఫ్ కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు.**



టీ20 వరల్డ్ కప్ 2026లో భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన సంజూ శాంసన్ ప్రస్తుతం భారత క్రికెట్‌లో అత్యంత చర్చనీయాంశంగా మారాడు. ఈ టోర్నమెంట్‌లో అతను అత్యధిక పరుగులు సాధించి టీమ్ ఇండియాకు టైటిల్ అందించడంలో ప్రధాన పాత్ర పోషించాడు. అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శనతో పాటు టోర్నమెంట్ మొత్తంలో అతని స్థిరమైన ఆటతీరు కారణంగా అతను “ప్లేయర్ ఆఫ్ ద సిరీస్” అవార్డును కూడా దక్కించుకున్నాడు.

శాంసన్ ప్రదర్శన చూసిన తర్వాత ఇప్పుడు అతన్ని భారత టీ20 జట్టు కెప్టెన్‌గా నియమించాలనే చర్చలు మొదలయ్యాయి. మాజీ భారత క్రికెటర్ మొహమ్మద్ కైఫ్ ఈ విషయంపై స్పందిస్తూ సంజూ శాంసన్ కెప్టెన్‌గా మంచి ఎంపిక అవుతాడని అభిప్రాయపడ్డాడు.

మొహమ్మద్ కైఫ్ మాట్లాడుతూ, ఒక మంచి కెప్టెన్ అంటే ప్రపంచాన్ని చూసిన అనుభవం ఉండాలి అని చెప్పారు. జట్టులోని ప్రతి ఆటగాడి విలువ తెలుసుకుని, ఫామ్‌లో లేని ఆటగాళ్లను కూడా ప్రోత్సహించే నాయకత్వం కెప్టెన్‌లో ఉండాలని ఆయన పేర్కొన్నారు. విఫలమవ్వడం ఆటలో భాగమేనని అర్థం చేసుకునే వ్యక్తి కెప్టెన్‌గా ఉంటే జట్టుకు మేలు జరుగుతుందని కైఫ్ అన్నారు.

అదే సమయంలో ప్రస్తుతం టీ20 జట్టు కెప్టెన్‌గా ఉన్న సూర్యకుమార్ యాదవ్ భవిష్యత్తు గురించి చర్చ కొనసాగుతోంది. సూర్యకుమార్ యాదవ్ ప్రస్తుతం 35 ఏళ్ల వయస్సులో ఉన్నాడు. 2028 టీ20 వరల్డ్ కప్ సమయానికి అతను 37 ఏళ్ల వయస్సులో ఉంటాడు. ఆ సమయంలో కూడా అతనే కెప్టెన్‌గా కొనసాగుతాడా అన్నది అతని ఫామ్, ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుంది.

టీ20 వరల్డ్ కప్ 2026లో భారత జట్టు విజయం సాధించినప్పటికీ, వ్యక్తిగతంగా సూర్యకుమార్ యాదవ్ ప్రదర్శన అంతగా ఆకట్టుకోలేదు. మొత్తం టోర్నమెంట్‌లో అతను కేవలం యూఎస్ఏపై మాత్రమే అర్ధశతకం సాధించాడు. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లలో కూడా అతను పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. ఫైనల్ మ్యాచ్‌లో అయితే గోల్డెన్ డక్‌గా ఔట్ కావడం అభిమానులను నిరాశపరిచింది.

టోర్నమెంట్ మొత్తం మీద సూర్యకుమార్ యాదవ్ 30.25 సగటుతో 242 పరుగులు మాత్రమే చేశాడు. అతని స్ట్రైక్ రేట్ కూడా 136 వద్దే నిలిచింది. ఈ గణాంకాలను చూస్తే అతని ఫామ్‌పై ప్రశ్నలు రావడం సహజం.

ఇలాంటి పరిస్థితుల్లో భవిష్యత్తులో టీ20 జట్టు నాయకత్వం సంజూ శాంసన్ చేతుల్లోకి వెళ్లే అవకాశాలపై చర్చ మరింత వేగంగా జరుగుతోంది. అయితే చివరికి ఈ విషయంలో బీసీసీఐ ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# త్వరలోనే ఒకటవ్వబోతున్న ఇషాన్ కిషన్ అదితి.. పెళ్లి డేట్ లీక్ చేసిన తాతయ్య



**ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఈ మెగా టోర్నీ ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి భారత్ విశ్వవిజేతగా నిలిచింది. ఈ అద్భుత విజయంలో కీలక పాత్ర పోషించిన యువ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ప్రస్తుతం నెట్టింట్లో హాట్ టాపిక్‌గా మారాడు.**

ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఈ మెగా టోర్నీ ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి భారత్ విశ్వవిజేతగా నిలిచింది. ఈ అద్భుత విజయంలో కీలక పాత్ర పోషించిన యువ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ప్రస్తుతం నెట్టింట్లో హాట్ టాపిక్‌గా మారాడు. అయితే ఈసారి అతను చర్చల్లో నిలిచింది తన బ్యాటింగ్ వల్ల కాదు.. తన పర్సనల్ లైఫ్, పెళ్లి కబురు వల్ల. ఫైనల్ మ్యాచ్‌లో కేవలం 25 బంతుల్లోనే 54 పరుగులు చేసి విధ్వంసం సృష్టించిన కిషన్, మ్యాచ్ ముగిసిన తర్వాత నరేంద్ర మోదీ స్టేడియంలో తన లాంగ్ టైమ్ గర్ల్‌ఫ్రెండ్ అదితి హుండియాను ఆలింగనం చేసుకున్న ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇషాన్ కిషన్ పెళ్లిపై అతని తాతయ్య రామానుగ్రహ పాండే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. “నీ పెళ్లి చూసే వరకు నేను బతుకుతానా నాయనా” అని ఇషాన్‌ను అడిగినట్లు తెలిపారు. దానికి ఇషాన్ నవ్వుతూ.. “తాతయ్య, నా పెళ్లి వచ్చే ఏడాది(2027)లోనే జరుగుతుంది. మీరు నా పెళ్లి చూడటమే కాదు, నాకు పుట్టబోయే బిడ్డను కూడా మీ ఒడిలో వేసుకుని ఆడించాలి.. అంతవరకు మీరు క్షేమంగా ఉండాలి” అని బదులిచ్చాడట. ఇషాన్‌కు ఇష్టమైన అమ్మాయితో పెళ్లి చేయడానికి తమ కుటుంబ సభ్యులందరికీ ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన స్పష్టం చేశారు.

### ఎవరీ అదితి హుండియా

ఇషాన్ కిషన్ మనసు దోచుకున్న అందాల సుందరి అదితి హుండియా మోడలింగ్ రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె మిస్ దివా 2018 విజేతగా నిలవడమే కాకుండా, ఫెమినా మిస్ ఇండియా ఫైనలిస్ట్‌గా కూడా నిలిచారు. జైపూర్‌కు చెందిన ప్రముఖ నెయ్యి వ్యాపారి కుమార్తె అయిన అదితి, 2019 ఐపీఎల్ సీజన్ నుంచి ఇషాన్‌తో ప్రేమలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అప్పట్లో స్టేడియంలో ఆమెను చూసిన నెటిజన్లు మిస్టరీ గర్ల్ అని పిలిచేవారు. అప్పటి నుంచి ఇషాన్ ఆడే ప్రతి మ్యాచ్‌కు ఆమె హాజరవుతూ అతన్ని ప్రోత్సహిస్తోంది. ఈ వరల్డ్ కప్ ఫైనల్‌కు ముందు కూడా టీమిండియా సభ్యులతో కలిసి అదితి డిన్నర్‌లో పాల్గొనడం విశేషం.

### పెళ్లి ఎప్పుడు

ఇషాన్ కిషన్ మాటల ప్రకారం చూస్తే 2027లో ఈ జంట ఒక్కటి కాబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వీరిద్దరూ చాలా కాలంగా డేటింగ్‌లో ఉన్నారు. ఇరు కుటుంబాల నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చేసినట్లే కనిపిస్తోంది. వరల్డ్ కప్ గెలిచిన జోష్‌లో ఉన్న ఇషాన్, త్వరలోనే తన పెళ్లి తేదీని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ లోపు అదితి సోషల్ మీడియా వేదికగా ఇషాన్‌కు అభినందనలు తెలుపుతూ షేర్ చేసిన పోస్ట్‌లు నెటిజన్ల మనసు గెలుచుకుంటున్నాయి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) RNI NO. APTEL/2006/18964, : .